

‘రిలయన్స్ గ్యాస్ అందుబాటులోకి వస్తే
మూడో పంటకు కూడా విద్యుత్ సరఫరా చేస్తాం.
అప్పుడిక ప్రతి రైతు ఇంట రోజూ సంక్రాంతే’

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 342

శనివారం 4-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





ఫుట్‌బాల్ చెప్పిన కథ

మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్ అధికార్ సమితి. ఫుట్‌బాల్ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్ బాల్స్...

-IIలో

II

సాక్షి ఫ్యామిలీ

హైదరాబాద్

శనివారం ॥ 4-3-2023



● కె. రామలక్ష్మి

తెలుగు సాహిత్యలోకం నుంచి రచయిత్రి కె.రామలక్ష్మి (92) వీడ్కోలు తీసుకున్నారు. రచయిత్రిగా, ఆరుద్ర సతీమణిగా, మద్రాసు (చెన్నై) నగరంలో తెలుగువారి ప్రతినిధిగా, నాటి సాహితీ సమూహాలలో కీలకమైన వ్యక్తిగా, సినిమా రంగంలో రచయిత్రిగా ఆమె సాగించిన యాత్ర సుదీర్ఘమైనది. ఆమె మరణంతో ఒక కాలపు తెలుగు సాహితీ చరిత్రకు మిగిలిన ఆఖరు సాక్షి లేకుండా పోయినట్టయ్యింది.

నివాళి

ఆమె ప్రతి అక్షరం స్త్రీ పక్షం

స్టెల్లా మేరీ స్టూడెంట్

స్వస్థలం కాకినాడ అయినా కె.రామలక్ష్మి చదువు చెన్నైలోనే సాగింది. స్టెల్లా మేరీ కాలేజీలో చదువుకుని ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించారు. 'ఐ యామ్ ఏ స్టెల్లామేరియన్' అని గర్వంగా చెప్పుకునేవారు. కాలేజీలో ఒక కార్యక్రమానికి అతిథిగా హాజరైన ప్రఖ్యాత జర్నలిస్టు ఖాసా సుబ్బారావు ఇంగ్లిష్‌లో ఉపన్యాసం ఇచ్చిన కె.రామలక్ష్మిని చూసి పరీక్షలు అయిపోయాక తనని కలవమని చెప్పారు. 'స్వతంత్ర' పత్రికలో ఇంగ్లిష్ విభాగంలో పాత్రికేయురాలిగా ఉద్యోగం ఇచ్చారు. 'తెలుగు స్వతంత్ర'కు ఎడిటర్‌గా ఉన్న ఖాసా సుబ్బారావు కోరిక మేరకు 'నడుస్తున్న చరిత్ర' కాలమ్ రాశారు రామలక్ష్మి. ఆమె ఇంటిలో ప్రతి సాయంత్రం సాహితీచర్చలు జరిగేవి. వాటికి ఆరుద్ర, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ తదితరులు హాజరయ్యేవారు. ఆరుద్ర, రామలక్ష్మి పరస్పరం ఇష్టపడి ఆ రోజుల్లో అంటే 1954ఏప్రిల్30న రిజిస్టర్డ్ మేరేజీ చేసుకున్నారు. ఈ పెళ్లికి దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీ సాక్షి సంతకాలు చేశారు. శ్రీశ్రీ తన పెళ్లికి సాక్షి సంతకం చేయాలని ఆరుద్ర భావించడం వల్ల ఇది జరిగింది. శ్రీశ్రీ రామలక్ష్మిని 'అత్తగారు' అని సరదాగా పిలిచేవారు. అయితే శ్రీశ్రీ ధోరణిని రామలక్ష్మి చివరి వరకూ వ్యతిరేకిస్తూనే వచ్చారు.



● కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతిలతో ఆరుద్ర, రామలక్ష్మి

ఆరుద్రకు అండా దండా

ఆరుద్ర సినిమా రంగంలో కృషి చేయడానికి, 'సమగ్రాంధ్ర చరిత్ర' పరిశోధన పూర్తి చేయడానికి రామలక్ష్మి అందించిన అండదండలే కారణం.

రచయిత్రి రామలక్ష్మి ఆరుద్ర కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నివాసంలో మృతి
- 100 కుపైగా పుస్తకాలు రాసిన రామలక్ష్మి
- జీవనజ్యోతి సినిమాకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు
- జర్నలిస్టుగా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలు

ప్రముఖ రచయిత ఆరుద్ర సతీమణి కె.రామలక్ష్మి (92) కన్నుమూశారు. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్మాన్‌ఘడ్‌లో ఉన్న నివాసంలో తుదిశ్వాస విడిచారు. రామలక్ష్మి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా కోటనందూర్‌లో 1930 డిసెంబర్ 31న జన్మించారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీఏ పూర్తిచేశారు. ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యం, ప్రాచీనాంధ్ర సాహిత్యం అభ్యసించారు. 1954లో ప్రముఖ కవి ఆరుద్రను వివాహం చేసుకున్నారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. 1951 నుంచే రామలక్ష్మి రచనా ప్రస్థానం మొదలైంది. వివాహమైన తర్వాత 'రామలక్ష్మి ఆరుద్ర' కలం పేరుతో రచనలు చేశారు. మొత్తం 100 కు పైగా పుస్తకాలు రాశారు. ఆంధ్రపత్రికలో ఆమె సుదీర్ఘకాలం నిర్వహించిన 'ప్రశ్న జవాబు' శీర్షిక ప్రసిద్ధి చెందింది. విడదీసే రైలుబళ్లు, అవతలిగట్టు, మెరుపుతీగె, తొణికిన స్వర్గం, మానని గాయం, ఆణిముత్యం, పెళ్లి, ప్రేమించు ప్రేమకై, ఆడది, ఆశకు సంకెళ్లు, కరుణ కథ, లవంగి, ఆంధ్ర నాయకుడు, పాండురంగని ప్రతిజ్ఞ, నీదే నా హృదయం, అద్దం, ఒక జీవికి స్వేచ్ఛ వంటి కథా సంకలనాలను రామలక్ష్మి రచించారు. తెలుగు సాహిత్య రంగానికి చేసిన సేవలకు గాను ఆమెకు గృహలక్ష్మి, స్వర్ణకంకణం సహా పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కాయి.

ఉత్తమ రచయిత్రిగా నంది అవార్డు...

రామలక్ష్మి పలు సినిమాలకు కథలు అందించారు. 1975వ సంవత్సరంలో జీవన జ్యోతి సినిమా కథకు గాను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. కాసా సుబ్బారావు నిర్వహించిన స్వతంత్ర దినపత్రికలో జర్నలిస్టుగా పని చేశారు. 1978లో ఉత్తమ జర్నలిస్టుగా రామానాయుడు అవార్డు అందుకున్నారు. పలు స్త్రీ సంక్షేమ సంఘాల్లో సేవలు అందించి మహిళల శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ రీజనల్ ప్యానెల్ సభ్యురాలిగా కూడా పనిచేశారు. రామలక్ష్మి ఆరుద్ర మృతిపట్ల పలువురు రచయితలు, సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖులు సంతాపం తెలిపారు. శుక్రవారం సాయంత్రమే ఎస్ఆర్‌నగర్ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలను నిర్వహించారు.

వీరికి ఐదుగురు కుమార్తెలు విజయ, త్రివేణి, కవిత, లలిత, వాసంతి. వీరి పెంపకం, చదువు బాధ్యతలకోసం ఆరుద్ర సమయాన్ని తీసుకోకుండా ఆమే తన సమయమంతా వెచ్చించారు. 'ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం కోసం విపరీతంగా సమయం ఇవ్వాలనుకునేవాడు. కాని ఇల్లు గడవాలి కదా. సినిమా రంగంలో పని చేస్తేనే డబ్బులు వస్తాయి. అందుకని నేనేమి అనకుండా గబగబా కొన్ని పాటలు రాసేసి ఆ డబ్బు అప్పజెప్పి మళ్లీ పరిశోధనలో పడేవాడు' అన్నారు రామలక్ష్మి. ఆరుద్రకు అనారోగ్యం వస్తే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మాట్లాడి ప్రభుత్వ సహాయం అందేలా చూశారామె. 'నేను మరణించినప్పుడు ఎటువంటి హంగామా చేయవద్దు' అని ఆరుద్ర కోరడం వల్ల 1998లో ఆరుద్ర మరణించినప్పుడు కేవలం ముగ్గురు నలుగురు స్నేహితులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించి ఆ తర్వాతే మరణవార్తను లోకానికి తెలియచేశారు. ఇది సాహిత్య ప్రియులను బాధించినా రామలక్ష్మి ధోరణి అలాగే ఉండేది.

సినిమా రచయిత్రి

కె.రామలక్ష్మికి సినిమా రంగంలో అందరూ సుపరిచితులు స్నేహితులు. వారిలో భానుమతి రామకృష్ణ, జయలలిత, వాణిశ్రీ తదితరులు ఉన్నారు. కె.విశ్వనాథ్ తీసిన 'జీవనజ్యోతి' సినిమాకు రామలక్ష్మి కథను అందించారు. ఈ సినిమా నిజానికి వాణిశ్రీ కోసమే రాశారు. కె.రామలక్ష్మి రాశారని వాణిశ్రీ నటించారు. దీని నిర్మాణ సమయంలో విశ్వనాథ్‌కు, రామలక్ష్మికి వాదోపవాదాలు నడిచాయి. దాంతో కె.విశ్వనాథ్ విజయవాడలో జరిగిన శతదినోత్సవంలో 'ఇకపై ఇతరులు రాసిన కథలతో నేను సినిమాలు తీయను' అని ప్రకటించారు. రామలక్ష్మి రాసిన మరో సినిమా 'గోరింటాకు'. అయితే దీని మీద ఆ రోజుల్లో వివాదం చెలరేగింది. దాసరి నారాయణరావు స్టోరీ డిపార్ట్‌మెంట్‌లో తెర వెనుక ఉండి పని చేసిన వారిలో రామలక్ష్మి కూడా ఒకరు. ఆమె 1970లలో సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా పని చేశారు.

స్త్రీ పక్షపాతి

రామలక్ష్మి నిత్య జీవితంలోనే కాదు రచనా జీవితంలోనూ ఆధునికురాలు. ఛాందసాలు లేని జీవనం గడపాలని, భార్యాభర్తలు స్నేహమయ జీవనాన్ని అనుభవించాలని, స్త్రీలకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలని ఆ రోజుల్లోనే తన కథలలో చెప్పారామె. 1954లో ఆమె తన తొలి కథా సంపుటి 'విడదీసే రైలుబళ్లు' వెలువరించారు. ఈ సంపుటిలోని 'చీలిన దారులు' అనే కథలో ఒక జంట పెళ్లి చేసుకోకుండా సహజీవనం ప్రారంభిస్తారు. పెళ్లి ప్రేమను చంపేస్తుంది అని ఆ కథలో రాసి అప్పటికి తెలియని సహజీవనాన్ని ప్రతిపాదించారామె. 'తొణికిన స్వప్నం', 'ఒక జీవికి స్వేచ్ఛ', 'అద్దం' తదితరాలు ఆమె ఇతర కథా సంపుటాలు. భార్యాభర్తలు స్నేహితులుగా ఉండాలని సూచిస్తూ 1970లలో ఆమె రాసిన 'పార్వతి కృష్ణమూర్తి కథలు' పాఠకాదరణ పొందాయి. ఇందులో భార్య అరమరికలు లేకుండా భర్తతో తన అభిప్రాయాలను చెబుతుంది. స్నేహాన్ని, చొరవను ప్రదర్శిస్తుంది. భార్యంటే భర్త చెప్పినట్టుగా పడుండాలనే నాటి ధోరణికి ఈ పాత్ర పూర్తి భిన్నం. రామలక్ష్మి రాసిన కథల్లో 'అదెక్కడ' విశిష్టమైనది. ఆ కథలో ముఖ్య పాత్ర తన పేరు మర్చిపోతుంది. దాని కారణం భర్త, పిల్లలు అందరూ 'అది' అని పిలుస్తూ ఉండటమే. చివరకు ఆమె ఒకరోజు ఇంట్లో నుంచి వెళ్లిపోతుంది. భర్త 'అదెక్కడ' అని ఎందరిని అడిగినా కనిపించదు. పురుషుడు మోసం చేస్తే స్త్రీ సింగిల్ మదర్‌గా జీవించగలదనే సందేశం ఇస్తూ కథలు రాశారు. బేలగా ఉండే స్త్రీలను అలాంటి పాత్రలను రామలక్ష్మి హర్షించలేదు. స్త్రీలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా తమ జీవితాన్ని మలుచుకోవాలని కోరుతారు.

ఆమె రచనలను ఈ తరానికి మళ్లీ చేరువ చేయాల్సి ఉంది.

కళ





● విజేత కుమార్

ఫుట్‌బాల్ చెప్పిన కథ

మార్పు అనేది సామాజిక ఉద్యమాలతోనే కాదు...సరదాగా మొదలయ్యే ఆటలతో కూడా సాధ్యపడుతుందని నిరూపించింది రాజస్థాన్‌కు చెందిన మహిళా జన్ అధికార్ సమితి. ఫుట్‌బాల్ ఆటతో అమ్మాయిల ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పు, చైతన్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది కికింగ్ బాల్స్...

రాజస్థాన్‌లో అనేక ప్రాంతాల్లో బాల్యవివాహాలు సర్వసాధారణం. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాల్యవివాహాలకు అడ్డకట్టవేయడానికి మహిళా జన్ అధికార్ సమితి అమ్మాయిల కోసం ఊళ్లలో 'ఫుట్‌బాల్ క్లబ్'లను ఏర్పాటు చేసింది.

బాల్యవివాహాల నిరోధానికి, ఫుట్‌బాల్ ఆటకు సంబంధం ఏమిటి? అనే సందేహం సహజంగానే వస్తుంది. అయితే ఆ ఫుట్‌బాల్ క్లబ్‌లు ఆట మెలకువలకు మాత్రమే పరిమితం కాకుండా పరివర్తన కేంద్రాలుగా మారడమే కొసమెరుపు.

ఆట ఆడటం కోసం సాయంత్రం ఎంతో మంది అమ్మాయిలు గ్రౌండ్‌కు వస్తారు. ఆట పుణ్యమా అని వారి మధ్య స్నేహం పెరిగింది. ఆట అయిపోయిన తరువాత రకరకాల కబుర్లు చెప్పుకునేవారు. అన్ని విషయాలతో పాటు బాల్యవివాహాల టాపిక్ కూడా వచ్చేది.

అంతమాత్రాన పెద్దలను వ్యతిరేకించగలరా? తరాల సంప్రదాయాన్ని కాదనగలరా?

'అవును....అనగలరు' అని ఎందరో అమ్మాయిలు నిరూపించారు. 'చదువు తరువాతే పెళ్లి' అని తల్లిదండ్రులతో గట్టిగా చెప్పారు.

కట్ చేస్తే...

ముంబైలో ఉంటున్న విజేత కుమార్ బ్రాండెడ్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు రూపొందించడంలో మంచి పేరు తెచ్చుకుంది. తన తొలి షార్ట్ ఫిల్మ్ 'బ్లాజ్' న్యూయార్క్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బెస్ట్ షార్ట్ ఫిల్మ్' అవార్డ్ అందుకుంది.

కొంత కాలం క్రితం విజేత తన స్వస్థలం రాజస్థాన్‌లోని అజ్మీర్‌కు వెళ్లింది. ఒక సాయంత్రం పూట బాల్య జ్ఞాపకాలను పలకరించడానికి తాను చదువుకున్న స్కూలుకు వెళ్లింది. అక్కడ ఆడపిల్లలు చాలా సీరియస్‌గా ఫుట్‌బాల్ ఆడుతుంటే అబ్బురపడింది.

ఆసక్తిగా ఆ అమ్మాయిలను పలకరించింది విజేత.

'స్కూల్ పూర్తయిన తరువాత ఇంటికి వెళితే ఇక బయట అడుగుపెట్టడం అంటూ ఉండేది కాదు. అలాంటిది ఫుట్‌బాల్ ఆట వల్ల రోజూ సాయంత్రం గ్రౌండ్‌కు రాగలుగుతున్నాను' అని తనకు లభించిన స్వేచ్ఛ గురించి చెప్పింది ఒక అమ్మాయి.

ఫుట్‌బాల్ ఆట వల్ల తమలో పెరిగిన

> 'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

ఆత్మవిశ్వాసం, నలుగురితో కలిస్తే వచ్చే ధైర్యం, బాల్యవివాహాలపై వ్యతిరేకత గురించి మరో అమ్మాయి వివరంగా చెప్పింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

'వావ్' అనుకోవడమే కాదు డాక్యుమెంటరీ తీయాలని కూడా అనుకుంది విజేత. అనేకానేక సందేహాలతో తొలుత వారు కెమెరా ముందుకు రావడానికి నిరాకరించారు. అయితే విజేతకు వారితో స్నేహం పెరిగాక, తన మీద నమ్మకం ఏర్పడిన తరువాత 'కికింగ్ బాల్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపుదిద్దుకుంది.

పిల్లలతో కలిసి ఈ డాక్యుమెంటరీని చూసింది విజేత. 'కికింగ్ బాల్స్' పిల్లలకు నచ్చింది. ఆ తరువాత ప్రపంచ ప్రేక్షకులకు కూడా నచ్చింది.

బ్యూటిప్స్

ఏమి చేయకూడదంటే...

అందానికి చిట్కాలు పాటించడానికి ముందు ఏమేం చేయకూడదో తెలుసుకుంటే మంచిదేమో! ఇవన్నీ తెలిసినవే, అయినా ముఖ్యంగా నిర్లక్ష్యం చేసేదిక్కడే.



- మొటిమలను గిల్లితే, మచ్చలు పడతాయి. వీటిని పోగొట్టుకోవడానికి చాలా కష్టపడాలి. గిల్లినప్పుడు మొటిమల నుండి వెలువడిన స్రావం ముఖం మీద ఎక్కడ తగిలితే అక్కడ కూడా మొటిమలు వస్తాయి.
- ఫంక్షన్‌కు వెళ్లే ముందు మేకప్ వేసుకుంటాం, కానీ తిరిగి వచ్చాక తుడిచేయడానికి బద్ధకించి అలాగే నిద్ర పోతాం. కొబ్బరినూనెతో తుడుచుకునేంత ఓపిక లేకపోతే కనీసం గోరువెచ్చని నీటిలో కాటన్ ముంచి అయినా మేకప్ క్లీన్ చేయాలి.
- మేకప్ సామగ్రిని ప్రతి ఆరునెలలకొకసారి అప్‌డేట్ చేసుకోవాలి. ఎక్స్‌పైరీ డేట్ చెక్ చేసుకుని, వాటిని కిట్ నుండి తొలగించాలి.
- మేకప్‌లో ఫౌండేషన్ ఇంపార్టెంట్. దీన్ని జాగ్రత్తగా వేసుకోవాలి. స్కిన్ కలర్‌కు సూటయ్యే షేడ్ వాడాలి. అవసరమైన మేరకే వాడాలి.
- హెయిర్ కండిషనర్ వాడేటప్పుడు చిన్న జాగ్రత్త కావాలి. జుట్టు కుదుళ్లకు తగలకుండా అప్లై చేయాలి. జుట్టు పొడిబారినప్పుడు మాత్రమే కండిషనర్ వాడాలి.

ఇంటిప్స్

సహజమైన రూమ్ ఫ్రెషనర్

- అరకప్పు టేబుల్ సాల్ట్ తీసుకుని, అందులో గులాబీ రేకులను వేయాలి. వీటితోపాటు ఒక స్పూన్ లవెండర్ ఆయిల్ లేదా ఆల్మండ్ ఆయిల్ వేయాలి. అంతే! గది సువాసనలతో నిండిపోతుంది.
- దీన్ని మరింత సులువుగా చేయాలంటే వొలిచిన నారింజ లేదా కమలా పండు మీద టేబుల్ స్పూన్ సాల్ట్‌ను చల్లి ఒక మూలన పెడితే సరి!
- సింక్ మెరవడానికి: ఖరీదైన క్లెన్సర్ జోలికి పోకుండా సింక్ పరిశుభ్రంగా... కొత్త దానిలా కనిపించాలంటే... నిమ్మరసంలో కొద్దిగా టేబుల్ సాల్ట్ వేసి సింక్‌ను తుడిస్తే చాలు... చూస్తుండగానే సింక్ కొత్తదానిలా మెరుస్తుంది.



● పచ్చదనాల పొదరిల్లు

మొక్కలో మొక్కనై!

మందారాలు 16 రంగులున్నాయి.
జామ చెట్లు ఏడురకాలున్నాయి.
అరటి పండ్ల చెట్లు ఐదు రకాలు.
వేప, సీమచింత, కానుగ...
మర్రి, రావి, జువ్వి, కొబ్బరి...
కుండీల్లో ఒదిగిపోయాయి.
రణపాల, కొండపిండి...
ఇన్సులిన్ ప్లాంట్, కప్పురిల్ల...
ఔషధమొక్కల లిస్ట్ ఇది.
ఇవన్నీ ఉన్నది నర్సరీలో కాదు.
మొక్కల్ని పిల్లల్లా పెంచే మంజుల ఇంట్లో.
మనం తినే పంటలు పండించుకుంటున్నాం.
పీల్చే గాలిని కూడా 'పెంచుకుందాం' అంటోందామె.

''ఆమెకు గ్రీన్ ఇండియా చాలెంజ్ విసిరిన వాళ్లు లేరు. తనకు తానుగా తీసుకున్న చాలెంజ్ కూడా కాదు. ఆమె మనసు కోరుకున్న ముచ్చట. పచ్చదనంతో ఆమె పాతికేళ్ల ప్రస్థానానికి ప్రతిరూపం ఈ ఇల్లు. ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, గంగపట్నం గ్రామంలో 65 అంకణాల స్థలంలో ఉన్న ఈ ఇంటి పేరు 'జీఆర్‌కే గార్డెన్'. గేటు ముందు నిలబడి చూస్తే ఇల్లు కనిపించదు. అల్లిబిల్లిగా అల్లుకున్నట్లున్న చెట్లు, తీగలను తొలగించి చూస్తే తప్ప గోడలు కనిపించవు. ఎన్ని మొక్కలున్నాయి? ఎన్ని రకాలున్నాయి? అని లెక్కపెట్టాలంటే సాధ్యమయ్యేటట్లు కనిపించలేదు. ఆ వివరాలన్నీ ఈ మొక్కల తల్లి మంజుల చెప్పాల్సిందే.

సేకరణ చిన్న పని కాదు!

''నేను ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌ని. ఉద్యోగంలో పిల్లల్ని చూసుకోవడం, ఇంట్లో మొక్కల్ని పెంచుకోవడమే నా లైఫ్. పండ్ల మొక్కలు దేశీవిదేశీ అన్నీ కలిపి వందకు పైగా ఉన్నాయి. తీగజాతితో కలిపి పూల మొక్కలు వందల్లో ఉన్నాయి. బాటిల్స్, కుండీలు, డ్రమ్ములు మూడు వేలకు పైగా ఉన్నాయి. నా దగ్గర పేపర్ వైన్ మొక్క కూడా ఉంది. యూ ట్యూబ్‌లో మ్యాడ్ గార్డెనర్ మాధవి గారి గార్డెన్ నుంచి తీగజాతులు తెప్పించుకున్నాను. హైదరాబాద్ నర్సరీ మేళాల నుంచి సేకరించాను. బెంగళూరు నుంచి కూడా తెచ్చుకున్నాను. మొక్కలు ఎన్ని కొంటున్నానో లెక్క చూసుకోకుండా కొనేస్తాను. కానీ బస్సు వాళ్లను రిక్వెస్ట్ చేసి వాటిని ఇంటికి తెచ్చుకోవడం చాలా కష్టమయ్యేది. స్వయంగా వెళ్లడం కుదరని నర్సరీలకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో అక్కడ ఉన్న మొక్కలను చూసి నా దగ్గర లేనివేవో చెప్పి తెప్పించుకుంటున్నాను. యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్యాల మొక్కలన్నీ ఉన్నాయి, కానీ లవంగాల తీగ మాత్రం దొరకలేదు.

> ### ఎనిమిదిళ్లు మారాను!
>
> మొక్కల కోసం మార్కెట్‌లో దొరికే కుండీలు చాలవని పెద్ద పెద్ద సిమెంట్ కుండీలు కూడా నేనే స్వయంగా చేసుకున్నాను. ఇల్లు మారిన ప్రతిసారీ ఈ కుండీలను తీసుకెళ్లడం ఎంత కష్టమయ్యేదో. అలా ఎనిమిదిళ్లు తిప్పాను. నా కష్టం చూసి మా నాన్న ఈ ఇల్లు అమ్మకానికి వచ్చిన సంగతి తెలిసి వెంటనే కొన్నారు. అప్పుడు కూడా 'నీకు ఇల్లు' అని చెప్పలేదు. 'నువ్వు మొక్కలు పెంచుకోవడానికి ఇల్లు' అని చెప్పారు. నాన్న గుర్తుగా నాటిన మామిడి చెట్టు చూడండి ఎంత ఎదిగిందో చూడండి.
>
> 
>
> **– గుడి మంజుల,** మొక్కల ప్రేమికురాలు

సీతాఫల కుటుంబం

సీతాఫలం మనకు బాగా తెలుసు. నా దగ్గర రామాఫలం, లక్ష్మణఫలం, హనుమఫలం కూడా ఉన్నాయి. కుండీల్లో కాసే పనస నుంచి యాపిల్ మూడు రకాలు, కివీ, అవొకాడో కూడా పెంచుతున్నాను. ఓ సారి ఎవరితోనో మాట్లాడుతూ 'మా పాప కంటే ముందు మొక్కలనే చూసుకుంటాన'ని చెప్పాను. ఆ మాటను గుర్తు చేసి మరీ దెప్పుతుంటుంది మా అమ్మాయి. తానిప్పుడు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. మా వారు కృష్ణపట్నం పోర్టులో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్. ఆయనకు ఇంటి నిండా మొక్కలున్నాయని మాత్రమే తెలుసు. మొక్కల పేర్లు కూడా తెలియదు. ఆయన మొక్కల సరదా అంతా సెల్ఫీలు తీసుకుని వాట్సాప్ డీపీలు పెట్టుకోవడం వరకే. మొక్కల పని అంతా నేను, మా అమ్మ చూసుకుంటాం. ఉదయం రెండు గంటల సేపు నేను టెర్రస్ మీద పని చేస్తాను. నేను, మా వారు డ్యూటీలకు వెళ్లిన తర్వాత మా అమ్మ మూడు గంటల సేపు కింద ఉన్న మొక్కల పని చూసుకుంటుంది. సాయంత్రం వచ్చిన తర్వాత కూడా నాకు గంట– రెండు గంటల సేపు ఎరువు కలపడం వంటి ఏదో ఒక పని ఉంటుంది.

చెట్లమ్మ

మా ఇంటి ఇరుగుపొరుగు వాళ్లు 'టెర్రస్ మీద ఇంత బరువు పెడుతున్నావు. ఇల్లు జాగ్రత్త' అంటూ ఉంటారు. ఇల్లు పాడయితే మరో చిన్న ఇల్లు కట్టుకుంటాను. మొక్కలు పోతే మళ్లీ మొక్కలు పెరగాలంటే ఎన్నో ఏళ్లు పడుతుందని చెబుతాను. నీ చుట్టుపక్కల ఉండడం మాకూ మేలే. మేము పెంచకపోయినా నువ్వు పెంచిన మొక్కల గాలిని పీల్చుకుంటున్నాం అని నవ్వుతారు. మా చెల్లి కొడుకైతే నన్ను చెట్లమ్మ అనే పిలుస్తాడు. ప్రతి ఇల్లూ మొక్కల్ని పెంచితే గాలి ఎందుకు కలుషితమవుతుంది? దారికి అడ్డు వస్తోందని, మరేదో పనులకు ఇబ్బందవుతోందని... ఎన్నో ఏళ్లు పెరిగిన చెట్టుని నిలువునా నరికేస్తుంటారు. పెరిగిన చెట్టుని నరకడం కాదు, ఒక చెట్టుని పెంచి చూడండి అని గొంతెత్తి అరవాలనిపిస్తుంటుంది'' అని మొక్కల మీద తన ప్రేమను వ్యక్తం చేశారు గుడి మంజుల.

– వాకా మంజులారెడ్డి

సత్యమేవ జయతే

సాక్షి

'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ ముఠాకక్షల జోలికి వెళ్లరు'

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 342

శనివారం 4-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆనందం ఆస్ట్రేలియాదే...

మూడో టెస్ట్‌లో భారత్‌పై తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం -15లో



వారాంతాన బుల్ రంకెలు

సెన్సెక్స్ 900 పాయింట్లు ప్లస్. నిఫ్టీకి 272 పాయింట్ల లాభం -15లో



రాజధాని కంటే రాజ్‌భవన్ దగ్గర..


సీఎస్ శాంతికుమారికి గవర్నర్ తమిళిసై చురకలు

- పదవీ బాధ్యతలు చేపట్టినా అధికారికంగా కలవలేదని ఆక్షేపణ
- కనీసం మర్యాదపూర్వకంగానైనా కలవలేదని మండిపాటు
- తాను ఇంకా ఆమోదించని బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకు వెళ్లిన నేపథ్యంలో ట్విట్టర్ వేదికగా గవర్నర్ ఘాటు విమర్శలు
- రాజ్‌భవన్‌ను పైరవీల కేంద్రంగా మార్చొద్దని గవర్నర్‌కు మంత్రి జగదీశ్‌రెడ్డి హితవు -2లో

'షా'రొస్తున్నారు..!

తెలంగాణ పోరు అమిత్ షా సారథ్యంలోనే.. అసెంబ్లీ ఎలక్షన్ల ఇన్‌చార్జిగా బాధ్యతలు

- కర్ణాటక ఎన్నికలు ముగిశాక పూర్తి సమయం రాష్ట్రానికే.. అసెంబ్లీ పోరు ముగిసేదాకా ఇక్కడే నివాసం?
- వ్యూహాల రూపకల్పన నుంచి క్షేత్రస్థాయి ప్రచారం దాకా పర్యవేక్షణ
- రాష్ట్ర నేతల మధ్య సమన్వయ లేమికి పరిష్కారం దిశగా చర్యలు
- పార్టీలో చేరికలను వేగవంతం చేయడంపై దృష్టి
- అన్ని నియోజకవర్గాల్లో రథయాత్రలు చేపట్టేందుకు ఏర్పాట్లు
- ప్రజల్లో బీజేపీకి ఆదరణ పెరిగిందంటున్న పార్టీ వర్గాలు
- ఇంత అనుకూల పరిస్థితిని ఎట్టిపరిస్థితుల్లో చేజార్చుకోకుండా జాగ్రత్తలు



సాక్షి, హైదరాబాద్

తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేయడం లక్ష్యంగా కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా నేరుగా కదన రంగంలోకి దిగుతున్నారు. బీజేపీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఎన్నికల వ్యూహాల రూపకల్పన నుంచి క్షేత్రస్థాయిలో ప్రచారం దాకా పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం అసెంబ్లీ ఎన్నికల పోరు ముగిసేదాకా అమిత్‌షా హైదరాబాద్‌లోనే మకాం వేసి పార్టీ శ్రేణులను ఉరుకులు, పరుగులు పెట్టించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా రాష్ట్ర పార్టీ ముఖ్య నేతల మధ్య సమన్వయ లేమి, ఆధిపత్య పోరు సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపట్టనున్నారని వివరించాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఆయన మిగతా 12వ పేజీలో ▶



శుక్రవారం విశాఖలో ప్రారంభమైన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వేదికపై ఏపీ సీఎం వైఎస్ జగన్, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ

అపార వనరులు.. యువ నాయకుడు
-రిలయన్స్ గ్రూపు అధినేత ముఖేశ్ అంబానీ

విశాఖ–భోగాపురం ఆరులేన్ల రహదారి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

పెట్టుబడులకు స్వర్గధామం
- ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఏపీకి పారిశ్రామిక దిగ్గజాల భరోసా

13 లక్షల కోట్లు

విశాఖ 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'కు అనూహ్య స్పందన

340 ఒప్పందాల ద్వారా 6 లక్షల ఉద్యోగాలు

- తొలి రోజు రూ.11.87 లక్షల కోట్ల విలువైన 92 ఒప్పందాలు
- నేడు 1.15 లక్షల కోట్ల విలువైన 248 ఒప్పందాలు
- సీఎం జగన్ పాలనా దక్షతను కొనియాడిన ప్రముఖులు
- రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై నాలుగు ఆడియో విజువల్స్ ప్రదర్శన
- వేదికపై ఉన్నంత సేపు సీఎంతో ముఖేష్ అంబానీ చర్చలు

13లో

400 కోట్లతో పౌర విమానయాన పరిశోధన కేంద్రం



పౌర విమానయాన రంగంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన పరిశోధన సంస్థను హైదరాబాద్‌లో నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.400 కోట్లకుపైగా అంచనా వ్యయంతో బేగంపేట విమానాశ్రయంలో శ్రీకారం చుట్టింది. - వివరాలు 2లో▶

ఇంటికీ ట్రాఫిక్ 'సిగ్నల్' పడాల్సిందే!

- కొత్తగా భారీ భవనాలు, సముదాయాల నిర్మాణానికి ట్రాఫిక్ 'టీఐఏ' తప్పనిసరి.. మార్గదర్శకాలను సిద్ధం చేసిన జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ విభాగం!
- అమల్లోకి వస్తే దేశంలోని తొలి కార్పొరేషన్‌గా హైదరాబాద్

2లో

క్లుప్తంగా...

హజ్ యాత్రికులకు పాస్‌పోర్టు స్పెషల్ డ్రైవ్ నేడు

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లాలనుకునే యాత్రికుల కోసం పాస్‌పోర్టు స్పెషల్ డ్రైవ్‌ను ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్నట్టు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హజ్ దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 10వ తేదీ గడువుగా నిర్ణయించినట్టు తెలిపారు. దరఖాస్తులను వేగంగా పరిశీలించేందుకు బేగంపేట పాస్‌పోర్టు సేవా కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకురావాలని ఆయన సూచించారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తే పక్షంలో సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయంలో అదనపు కౌంటర్‌ను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

అత్యధిక ఎస్సీ సీట్లు గెలిచేలా కార్యాచరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 19 ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ స్థానాల్లో.. అత్యధిక సీట్లలో గెలుపొందేలా కార్యాచరణను రూపొందిస్తున్నట్టు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా తెలిపారు. శుక్రవారం జరిగిన ఎస్సీ మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఎస్సీ మోర్చా కార్యవర్గ సమావేశంలో ఆయా అంశాలపై లోతుగా చర్చించి ప్రణాళిక సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. బీజేపీ తరపున ఈ వర్గాలను చేరుకునేలా ముందుకెళ్లనున్నట్టు తెలిపారు.

దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఆస్ట్రేలియా బృందం

సాక్షి, హైదరాబాద్: భారత్, ఆస్ట్రేలియన్ ఆర్మీ అధికారుల మధ్య సమన్వయం పెంచేందుకు నిర్వహిస్తున్న సంయుక్త శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆస్ట్రేలియన్ ఆర్మీ అధికారులు గురువారం దుండిగల్ ఇందులో భారత్, ఆస్ట్రేలియా నుంచి 15 మంది చొప్పున మొత్తం 30 మంది అధికారులకు శిక్షణ ఇస్తున్నారు. దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో మొదటి దశ శిక్షణను ఎయిర్‌ఫోర్స్ అకాడమీ ఎయిర్ వైస్ మార్షల్ బీఆర్ కృష్ణ ప్రారంభించారు.

రేవంత్ రెడ్డి భద్రతపై విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి భద్రత పిటిషన్‌పై విచారణను హైకోర్టు మార్చి 6వ తేదీకి వాయిదా వేసింది. తనకు భద్రత పెంచాలని రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరపున రూపేందర్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీపీ పంపిన సమాచారాన్ని ఆయన న్యాయమూర్తికి నివేదించారు. రేవంత్ పాదయాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో భద్రత చేపట్టాలని అక్కడి పోలీసులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. భద్రత కల్పిస్తే ఇక ఈ పిటిషన్‌పై వాదనలను కొనసాగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అయినా తదుపరి విచారణను మార్చి 6వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు చెప్పారు.

ఒలింపియాడ్‌లో నారాయణ విద్యా సంస్థలకు ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: హెచ్‌బీసీఎస్ఈ, భారత ప్రభుత్వం సంయుక్తంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్, ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌లో నారాయణ విద్యా సంస్థలకు చెందిన 38 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్స్ సింధూర నారాయణ, శరణినారాయణ తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగిన ఈ పోటీలో మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు 12 మంది, కెమిస్ట్రీ ఒలింపియాడ్‌కు తొమ్మిది మంది, ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు ఐదుగురు, సైన్స్ ఒలింపియాడ్‌కు ఏడుగురు, ఆస్ట్రానమీ ఒలింపియాడ్‌కు ఐదుగురు ఓరియంటేషన్ క్యాంప్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. సైన్స్ ఒలింపియాడ్‌లో తెలంగాణ నుంచి ఎంపికైన ఒక్కరు తమ విద్యాసంస్థకు చెందిన వారేనన్నారు.



ఇంటికీ ట్రాఫిక్ ‘సిగ్నల్’ పడాల్సిందే!

కొత్తగా భారీ భవనాలు, సముదాయాల నిర్మాణానికి ట్రాఫిక్ ‘టీఐఏ’తప్పనిసరి

ఆ ప్రాంతంలో ప్రస్తుత ట్రాఫిక్ రద్దీ, కొత్త నిర్మాణాలతో వచ్చే ఇబ్బందులతో నివేదిక

మార్గదర్శకాలు సిద్ధం

తొలుత 100- 250 అడుగుల రోడ్లపై నిర్మాణాలకు అమలు

తర్వాత మిగతా ప్రాంతాలకూ వర్తింపు

అమల్లోకి వస్తే ఈ చర్య తీసుకున్న తొలి కార్పొరేషన్‌గా హైదరాబాద్



ఏదో చిన్న రోడ్డులో భారీ అపార్ట్‌మెంట్ల సముదాయమో, షాపింగ్ మాల్‌నో నిర్మించారు.. వచ్చీ పోయే వాహనాలు, రోడ్డు పక్కనే పార్క్ చేసే వాహనాలు, జనంతో ట్రాఫిక్ సమస్య మొదలవుతుంది. ఆ రోడ్డులో వెళ్లే వాహనాలూ నిలిచిపోతాయి. మెయిన్ రోడ్డుపైనా ప్రభావం చూపిస్తుంది.. కానీ ఇకపై ఈ సమస్యకు చెక్ పడనుంది. కొత్తగా భారీ భవనాలు, సముదాయాలు నిర్మించాలంటే.. ఆ ప్రాంతంలో అవసరమైన స్థాయిలో రోడ్డు, ట్రాఫిక్ రద్దీ నియంత్రణ సదుపాయాలు ఉండాల్సిందే. లేకుంటే రోడ్డు విస్తరణ, పార్కింగ్ కోసం అవసరమైన ఏర్పాట్లకు సదరు నిర్మాణదారు బాధ్యత వహించాల్సిందే. - సాక్షి, హైదరాబాద్

వాహనాల రద్దీ ఇబ్బందితో..

ఇప్పటివరకు రోడ్ల వెడల్పును పరిగణనలోకి తీసుకొని పర్మిషన్లు మంజూరు చేసే స్థానిక సంస్థలు.. త్వరలోనే ట్రాఫిక్ రద్దీని కూడా అంచనా వేసి, దానికి అనుగుణంగా అనుమతులు మంజూరు చేయనున్నాయి. చాలా చోట్ల రోడ్ల వెడల్పుతో సంబంధం లేకుండా, పార్కింగ్ స్థలం లేకున్నా.. ఎత్తయిన భవనాలను, వాణిజ్య సముదాయాలను నిర్మిస్తున్నారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటోంది. ఈ క్రమంలో ఇటీవల హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్‌లను నివారించడం, కూడళ్లపై ఒత్తిడిని తగ్గించడంపై ట్రాఫిక్ పోలీసు విభాగం క్షేత్రస్థాయి పరిశీలన జరిపి.. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. భవన నిర్మాణ అనుమతుల సమయంలోనే సదరు ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ నివారణ, క్రమబద్ధీకరణకు వీలుగా ‘ట్రాఫిక్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (టీఐఏ)’ను కూడా సమర్పించేలా నిబంధన తేవాలని ప్రతిపాదించింది. దీనికి సంబంధించి జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ విభాగం కలిసి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించినట్టు తెలిసింది. దీని ప్రకారం ఇకపై నిర్మాణ అనుమతులు జారీ చేసే ముందే.. భవన నిర్మాణ ప్లానింగ్‌లో సెట్‌బ్యాక్, పార్కింగ్ స్థలం, గ్రీనరీ, వర్షపు నీటి గుంతల ఏర్పాటుతో పాటు ‘టీఐఏ’నివేదికనూ పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇది అమల్లోకి వస్తే.. దేశంలో టీఐఏ ఆధారంగా నిర్మాణ అనుమతులు జారీచేసే తొలి కార్పొరేషన్‌గా హైదరాబాద్ నిలవనుంది.



ప్రస్తుతం అనుమతులు ఇలా..

ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో రోడ్డు వెడల్పు.. మాస్టర్‌ప్లాన్‌లోని ప్రతిపాదిత రోడ్డు వెడల్పులను పరిగణనలోకి తీసుకొని ప్రణాళిక విభాగం నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తుంది. నిర్మాణ ప్రాంతాన్ని బట్టి ప్రస్తుతం అగ్నిమాపకశాఖ, జలమండలి, పర్యావరణం, వాల్టా, నీటి పారుదల శాఖ, విమానాశ్రయం, డిఫెన్స్, రైల్వే విభాగాల నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాల (ఎన్‌ఓసీ)ను జత చేయాల్సి ఉంటుంది.

ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు..



ప్రస్తుతం పార్కింగ్ స్థలం లేకున్నా వాణిజ్య భవనాలకు ఎన్‌ఓసీలను మంజూరు చేస్తున్నారు. ఫలితంగా ఆ భవనాల నుంచి వచ్చే వాహనాలు, బయట పార్క్ చేసేవాటితో ట్రాఫిక్ సమస్య వస్తోంది.అందువల్ల ట్రాఫిక్ పోలీసుల అనుమతి ఉంటేనే ఎన్‌ఓసీలు జారీ చేయాలి. 45, 60 అడుగులకుపైన వెడల్పుండే రోడ్ల మీద కట్టేవాటికి, 25 అంతస్తులపైన ఉండే అన్ని భవనాలకు ఈ విధానాన్ని అమలు చేయడం ఉత్తమం. - కె.నారాయణ్ నాయక్, జాయింట్ సీపీ, సైబరాబాద్ ట్రాఫిక్

కొత్త విధానంలో ఇలా..

- ఇక ముందు ప్రస్తుత పత్రాలకు అదనంగా నిర్మాణదారులు టీఐఏను సమర్పించాల్సి ఉంటుంది. ఈ నివేదిక కోసం ‘ఎంప్యానల్డ్ ట్రాఫిక్ కన్సల్టెంట్’ద్వారా అవసరమైన పత్రాలు జత చేస్తూ దరఖాస్తు సమర్పించాలి. ఒకవేళ రోడ్డు చిన్నగా ఉంటే.. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో సదరు ప్రాంతంలో రోడ్డు వెడల్పు కోసం భవన యజమాని అదనపు స్థలాన్ని కేటాయించాలి. లేదా లింక్ రోడ్ల నిర్మాణానికి అయ్యే వ్యయంలో కొంత వాటా భరించాల్సి ఉంటుంది. అయితే ఈ అంశంపై మరింత స్పష్టత రావాల్సిన అవసరం ఉందని ఓ అధికారి తెలిపారు.
- తొలి దశలో 100 అడుగుల నుంచి 250 అడుగుల వెడల్పు ఉండే రహదారులను ఆనుకొని నిర్మించే భవనాలు/ సముదాయాలకు ‘టీఐఏ’నిబంధనలను వర్తింపజేయనున్నారు. కార్యాలయాలు, షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్‌లు, ఆస్పత్రులు, విద్యా సంస్థల భవనాల స్వరూపం, వ్యాపార కార్యకలాపాలను బట్టి టీఐఏను సమర్పించాల్సి ఉంటుంది. తర్వాత భారీ నివాస భవనాలకూ వర్తింపజేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

మరో ఎన్‌వోసీతో మరింత జాప్యం

ఇప్పటికే హైరైజ్ భవనాలకు నిర్మాణ ఫీజులతోపాటు ఎక్స్‌టర్నల్ బెటర్‌మెంట్ చార్జీలు, ఇంపాక్ట్ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఆ సొమ్మును సదరు ప్రాంతంలో డ్రైనేజీ, వాటర్, విద్యుత్, రోడ్ల వంటి మౌలిక వసతుల కల్పన కోసం మాత్రమే వినియోగించాలి. కానీ ప్రభుత్వం సొమ్మును ఇతర అవసరాలకు మళ్లిస్తోంది.



ఇప్పుడు కొత్తగా ట్రాఫిక్ ఎన్‌ఓసీ పేరుతో అదనపు చార్జీలు వసూలు చేయడం సరికాదు. ఇప్పుడు పదుల సంఖ్యలో ప్రభుత్వ విభాగాల ఎన్‌ఓసీల కోసమే నెలల కొద్దీ సమయం పడుతోంది. కొత్తగా మరోటి అంటే జాప్యం ఇంకా పెరుగుతుంది. - సి.శేఖర్‌రెడ్డి, మాజీ జాతీయ అధ్యక్షుడు, క్రెడాయ్

బందిపోటు దొంగలు.. దండుపాళ్యం ముఠాలు

- మాఫియాగా మారి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు
- హాథ్ సే హాథ్ జోడో యాత్రలో రేవంత్‌రెడ్డి
- కేసీఆర్‌తో పాటు రసమయిపై ధ్వజమెత్తిన పీసీసీ చీఫ్



మానకొండూర్ సభలో కార్యకర్తలు బహూకరించిన నాగలితో రేవంత్‌రెడ్డి

మానకొండూర్: తెలంగాణలో తొమ్మిదేళ్ల పాలనలో అక్కడ సీఎం కేసీఆర్, ఇక్కడ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బందిపోటు దొంగల్లాగా, దండుపాళ్యం ముఠాలుగా సాండ్, ల్యాండ్, మైన్స్, వైన్స్ చాటున దోచుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి మానకొండూర్‌లో జరిగిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... సోనియా గాంధీ 2004లో తెలంగాణ ప్రకటన కరీంనగర్‌లోనే చేశారని గుర్తు చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ ప్రాంత యువకులకు మేలు చేశాడా, ప్రాజెక్టుల కోసం కొట్లాడాడా?, వంద పడకల ఆసుపత్రి తెచ్చిండా అని ప్రశ్నించారు. చివరికి కళాకారుల నియామకాల్లో అవినీతికి పాల్పడ్డాడని హైకోర్టు పిలిచి ఆయన చెంపలు వాయించి కొత్త నియామకాలు చేపట్టమందని గుర్తు చేశారు. కేసీఆర్, కేటీఆర్‌లకు నేనేమీ తక్కువ కాదన్నట్లు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తనూ ఓ ఫాంహౌస్ కట్టుకుని అక్రమంగా నీళ్లు తీసుకెళ్లేందుకు పక్కోళ్ల భూములు అక్రమించారని రేవంత్ ఆరోపించారు. ఎమ్మెల్యే ఆఫీసు ముందు ఒక దళిత బిడ్డ శ్రీనివాస్ కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని చనిపోయాడంటేనే ఇక్కడి పరిస్థితులు అర్థం చేసుకోవచ్చన్నారు. సమస్యలు పరిష్కరించాలని అడిగిన వాళ్లపై ఒక ఎమ్మెల్యే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టుతున్నాడని.. ఇంత దుర్మార్గం ఇంకొకటిటి లేదని రేవంత్ వ్యాఖ్యానించారు.

యాతరో... యాతర పోటాపోటీల జాతర

కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారే పోటాపోటీగా యాత్రలు

- ఇప్పటికే జోరుగా హాథ్ సే హాథ్ జోడో యాత్రలు చేస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్
- మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మరో యాత్ర.. వర్సిటీల్లో మధుయాష్కీ సిద్ధం
- ‘పీపుల్స్ మార్చ్’ పేరుతో చేపట్టేందుకు భట్టి.. బైక్ యాత్ర చేస్తానన్న వెంకటరెడ్డి
- ఠాక్రే సమక్షంలో ప్రారంభించిన ఉత్తమ్.. మరిన్ని పోటాపోటీ యాత్రలు కూడా..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరికి వారే యమునా తీరే రీతిలో వ్యవహరిస్తున్నారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో చేపడుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రల నిర్వహణలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు పోటీలు పడుతున్నారు. తొలుత రాష్ట్ర వ్యాప్తంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో యాత్రలు నిర్వహించాలనుకున్నా... కొన్ని అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఆయన తాత్కాలిక షెడ్యూల్ రూపొందించుకుని హాథ్‌సే హాథ్ జోడో యాత్రలు చేస్తున్నారు. ఇప్పుడు ఆయనకు పోటీగా కొందరు రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు షెడ్యూల్ రూపొందించుకుని ఇతర నియోజకవర్గాల్లో యాత్రలకు సిద్ధమవుతుండడం గమనార్హం.

ఎవరి 'దారి'వారిదే..

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి పోటీగా శుక్రవారం రాష్ట్రంలో మరో యాత్ర ప్రారంభమయింది. ‘తెలంగాణ కాంగ్రెస్ పోరు యాత్ర’పేరుతో మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఈ యాత్రలను ప్రారంభించారు. ఏఐసీసీ అనుమతితో బాసర పుణ్యక్షేత్రం నుంచి హైదరాబాద్ వరకు తాను యాత్ర చేస్తానని ఇప్పటికే ప్రకటించిన ఏలేటికి కాంగ్రెస్ సీనియర్లు కూడా మద్దతిస్తున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు ఈ యాత్రలో పాల్గొనడం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో చర్చకు తావిస్తోంది. మహేశ్వర్‌రెడ్డి కంటే ముందే సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కూడా యాత్రకు ప్లాన్ చేశారు. ఆయన కూడా రేవంత్‌కు సమాంతరంగా బాసర పుణ్యక్షేత్రం నుంచి హైదరాబాద్‌కు యాత్ర చేయాలనుకున్నారు. కానీ, ఇప్పుడు ఏలేటి ఆ యాత్రకు ఉపక్రమించారు. అయితే, భట్టి ఇప్పటికే పీపుల్స్ మార్చ్ పేరుతో తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న మధిర నియోజకవర్గంలో పాదయాత్ర గతంలోనే పూర్తి చేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో భాగంగా మళ్లీ ‘పీపుల్స్ మార్చ్’పేరుతో రాష్ట్రంలోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర చేసేందుకు ఆయన సిద్ధమవుతున్నారని తెలుస్తోంది.



మాణిక్‌రావ్ ఠాక్రే చేతుల మీదుగా..

మరోవైపు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ కూడా తనదైన శైలిలో హాథ్ సే హాథ్ జోడో యాత్రకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలోని విద్యార్థి లోకం మద్దతు కాంగ్రెస్ పార్టీకి కూడగట్టేందుకు గాను ఆయన విశ్వవిద్యాలయాల్లో ఈ యాత్ర చేయాలనే యోచనలో ఆయన ఉన్నారు. ఇందుకు సంబంధించిన రూట్‌మ్యాప్ కూడా తయారవుతోంది. మరోవైపు టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా తనతో పాటు తన సతీమణి ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో యాత్రకు ఉపక్రమించారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఈ యాత్రలను ప్రారంభించడం గమనార్హం. ఇక, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాల్లో తాను బైక్ యాత్ర చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. వాస్తవానికి రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఆయా నియోజకవర్గాల నేతలందరూ రెండు నెలల పాటు పాదయాత్ర చేయాల్సి ఉంది. అయితే ఢిల్లీ పెద్దలు చెప్పిన దానికి భిన్నంగా ఈ యాత్రలు జరుగుతుండడం గమనార్హం.

కరీంనగర్‌లో 9న సభ

హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో భాగంగా ఈనెల 9న కరీంనగర్‌లో భారీ బహిరంగసభ నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని అప్పట్లో కరీంనగర్‌లో సభలోనే సోనియాగాంధీ హామీ ఇచ్చి అమలు చేసిన నేపథ్యంలో ఆ సభ జరిగిన ప్రదేశంలోనే భారీ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల సీఎంలను కూడా ఆహ్వానించనున్నారు.

రేవంత్‌కు సీనియర్లు దూరంగా..

సీఎల్పీ నేత మల్లు భట్టి, మాజీ ఎంపీ వి.హనుమంతరావులు రేవంత్ యాత్రకు హాజరై అందరం కలిసే ఉన్నామని చెప్పే ప్రయత్నం చేశారు. కానీ, ఆ తర్వాత సీనియర్ నేతలు ఆయన యాత్ర వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మొత్తంమీద ఏఐసీసీ ఉద్దేశానికి భిన్నంగా రాష్ట్రంలో యాత్రలు జరుగుతున్నాయని, రాష్ట్ర కాంగ్రెస్ కీలక నేతలంతా కలిసికట్టుగా ఉన్నామన్న భావన ప్రజల్లో కలిగించేందుకు సిద్ధంగా లేరనే చర్చ జరుగుతోంది. ఇక, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి యాత్రపై రేవంత్‌రెడ్డి స్పందిస్తూ హాథ్ సే హాథ్ జోడో యాత్రలు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో చేయాలని ఏఐసీసీ చెప్పిందని, చేయకపోతేనే ఏఐసీసీ చర్యలు తీసుకుంటుందని వ్యాఖ్యానించారు.

రాజధాని కంటే రాజ్‌భవన్ దగ్గర..

సీఎస్ శాంతికుమారికి గవర్నర్ తమిళిసై చురకలు

- పదవీ బాధ్యతలు చేపట్టినా అధికారికంగా కలవలేదని ఆక్షేపణ
- రాజ్‌భవన్, ప్రభుత్వం మధ్య మరింత ముదురుతున్న వివాదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు మళ్లీ తలెత్తాయి. శాసనసభ ఆమోదించి పంపిన 10 బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా ఆలస్యం చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. ‘ఢిల్లీ కంటే రాజ్‌భవన్ దగ్గర’ అంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఉద్దేశించి శుక్రవారం ట్విట్టర్ వేదికగా చురకలంటించారు. ‘ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అధికారికంగా రాజభవన్‌ను సందర్శించలేదు. సీఎస్‌కు ఆ మాత్రం సమయం లేదా? ప్రొటోకాల్ లేదు... కనీసం మర్యాద కోసమైనా కలవొచ్చు కదా? స్నేహపూర్వక అధికారిక పర్యటనలు, సంప్రదింపులు ఎంతో ఉపయోగపడేవి. కానీ మీకు అలాంటి ఉద్దేశమేదీ లేదు. మళ్లీ గుర్తుచేస్తున్నా... ఢిల్లీ కంటే రాజ్‌భవన్‌దగ్గర’అని గవర్నర్ తమిళిసై ట్వీట్ చేశారు.

వివాదం చల్లారేలా లేదు

రాజ్‌భవన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వివాదం కొనసాగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల సమయంలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చి హైకోర్టుకు నివేదించడం, ఆ తరువాత బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం సాఫీగా సాగడం, ద్రవ్య వినిమయ బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర వేయడం వెంటవెంటనే జరిగిపోయాయి. కానీ పెండింగ్‌లో పెట్టిన 10 బిల్లులకు మాత్రం గవర్నర్ ఆమోదం తెలపకుండా మిన్నకున్నారు. బడ్జెట్ సమావేశాల్లో కనబరిచిన సుహృద్భావ వాతావరణం కొనసాగుతుందని భావించినా.. ప్రస్తుత పరిణామాలతో ప్రభుత్వానికి, రాజ్‌భవన్‌కు మధ్య వివాదం మరింత ముదురుతున్నదే తప్ప చల్లారే పరిస్థితులు కనిపించట్లేదు.

అభివృద్ధిని అడ్డుకునేలా గవర్నర్ తీరు

రాజకీయ దురుద్దేశంతోనే బిల్లులపై సంతకాలు పెట్టడం లేదు: జగదీశ్‌రెడ్డి



గ్యాస్ ధర పెంపుపై నల్లగొండలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ: గవర్నర్ తమిళిసై రాజకీయ దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించడం లేదని మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. బిల్లుల ఆమోదం కోసం ప్రభుత్వం న్యాయపరంగా ముందుకు పోతుందన్నారు. రాజ్‌భవన్ పైరవీలకు కేంద్రంగా మారకూడదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే విధంగా గవర్నర్ చర్యలు ఉన్నాయని మండిపడ్డారు. వంట గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా శుక్రవారం నల్లగొండలో నిర్వహించిన ధర్నాలో, తర్వాత విలేకరుల సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. మోదీ ప్రధాని అయినప్పుడు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర బ్యారెల్ 100 డాలర్లు ఉండగా.. దేశంలో గ్యాస్ సిలిండర్ ధర 350 రూపాయలే ఉందన్నారు. ఇప్పుడు కూడా క్రూడాయిల్ ధర 100 డాలర్లే ఉన్నా.. సిలిండర్ ధర రూ.1,150 పెంచారని విమర్శించారు. ప్రధాని మోదీ పేదలను దోచి తన దోస్తులైన అంబానీ, అదానీలకు పంచుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా విఫలమైందని, దేశ ప్రజలు బీఆర్‌ఎస్‌ను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వెంట ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రూ. 400 కోట్లతో ‘పౌర విమానయాన పరిశోధనా కేంద్రం’

- బేగంపేట విమానాశ్రయంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు
- జూలై నుంచి పరిశోధనలు ప్రారంభించడమే లక్ష్యంగా పనులు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మరో పరిశోధనా సంస్థ రూపుదిద్దుకుంటోంది. పౌర విమానయాన రంగంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన పరిశోధనా సంస్థను హైదరాబాద్‌లో నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.400 కోట్లకుపైగా అంచనా వ్యయంతో బేగంపేట విమానాశ్రయంలో సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (సీఏఆర్‌వో)కు శ్రీకారం చుట్టింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ కేంద్రంలో ముమ్ముందు విమానయాన రంగంలో చోటుచేసుకోనున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా పరిశోధనలు జరగనున్నాయి. ‘గృహ–5’ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈ పరిశోధనా కేంద్రంలో ఈ ఏడాది జూలై నుంచి పరిశోధనలు ప్రారంభించడమే లక్ష్యంగా పనులను వేగవంతం చేశారు. భారతదేశంలో మొదటిసారిగా నిర్మిస్తున్న ఈ కేంద్రంలో విమానాశ్రయాలు, ఎయిర్ నావిగేషన్ సేవలకు సంబంధించిన పరిశోధనా సౌకర్యాలు, ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కమ్యూనికేషన్స్, డొమైన్ సిమ్యులేటర్, నెట్‌వర్క్ ఎమ్యులేటర్, విజువలైజేషన్ – అనాలసిస్ ల్యాబ్స్, సర్వైలెన్స్(నిఘా) ల్యాబ్స్, నావిగేషన్ సిస్టమ్స్ ఎమ్యులేషన్ – సిమ్యులేషన్ ల్యాబ్స్, సైబర్ సెక్యూరిటీ – థ్రెట్ అనాలసిస్ ల్యాబ్స్, డేటా మేనేజ్‌మెంట్ సెంటర్, ప్రాజెక్ట్ సపోర్ట్ సెంటర్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ – టూల్స్ సెంటర్, నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెంటర్‌సహా పలు పరిశోధనలు జరగనున్నాయి.



తెలంగాణ పోరుయాత్రలో పాల్గొన్న దామోదర రాజనర్సింహ, మహేశ్వర్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్, మదన్‌మోహన్ తదితరులు

కాంగ్రెస్‌తో చేతులు కలపండి

- మీ కష్టాలు దూరమవుతాయ్
- తెలంగాణ పోరుయాత్రలో పార్టీ సీనియర్ల పిలుపు
- ప్రజల కష్టాలను గాలికొదిలేసిన బీఆర్‌ఎస్ సర్కార్
- పేదలకు అన్నిరకాలుగా సేవలందించిన పార్టీ కాంగ్రెస్సే

నిర్మల్: ప్రజల పక్షాన పోరాడేది కాంగ్రెస్ మాత్రమేనని, కాంగ్రెస్‌తో చేతులు కలిపితే ప్రజల కష్టాలు దూరమవుతాయని ఆ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. చేసిన వాగ్దానాలు నెరవేర్చుకోలేని స్థితిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలను పారదోలాలంటే హస్తంతో చేతులు కలపాలని పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా భైంసాలో శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ తెలంగాణ పోరుయాత్రను నేతలు ప్రారంభించారు. స్థానిక శివాజీ చౌక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం కుభీర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ కోదండరెడ్డి, ఐటీ సెల్ చైర్మన్ మదన్‌మోహన్, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఈ తెలంగాణ పోరు యాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ యాత్ర ద్వారా రాహుల్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. అలాగే బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని, రానున్న ఎన్నికల్లో గెలిచిన తరువాత కాంగ్రెస్ ప్రజలకు ఏం చేస్తుందో వివరిస్తామని చెప్పారు.

మైనార్టీలు కలిసిరావాలి..

రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేసిందని భట్టి విక్రమార్క చెప్పారు. ప్రస్తుత బీఆర్‌ఎస్ సర్కారు ప్రజల కష్టాలను గాలికొదిలేసిందని విమర్శించారు. చదువుల తల్లి కొలువైన బాసరలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు నెలలపాటు రోడ్డెక్కితే ఇక్కడి ఎమ్మెల్యేలు, ఎంపీ, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కేంద్రం, తెలంగాణలో బీజేపీ రాకుండా మైనార్టీలు కాంగ్రెస్‌తో చేతులు కలపాలని పిలుపునిచ్చారు. పేదలకు అన్ని రకాలుగా సేవలందించిన పార్టీ కాంగ్రెస్సేనని దామోదర రాజనర్సింహ వివరించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన చరిత్ర కాంగ్రెస్‌దని అన్నారు. జీవన్‌రెడ్డి తదితరులు కూడా ప్రసంగించారు.


Reliance
Growth is Life
వచ్చేసింది,
ఇండియా యొక్క
కొత్త పొదుపుల
బజార్
అత్యధిక పొదుపులు,
ప్రతి రోజూ, ప్రతి సారి
SMART BAZAAR
SMART SUPERSTORE
కనీసం 5%
ఎమ్ఆర్‌పి పై
+ ప్రతిరోజు అదనపు డిస్కౌంట్
*కిరాణా సరుకులన్నిటిపై
చక్కెర 1 kg ₹9*
ప్రతిరోజు
*₹1499 మరియు అంతకంటే మించిన షాపింగ్‌పై
ఇండియా గేట్ బాస్మతి రైస్ రోజానా 5 kg + సన్‌రిచ్ సన్ ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ 5 ℓ కంబైన్డ్
ఎమ్ఆర్‌పి ₹1577
ఆదా చేసుకోండి ₹498
మా ధర ₹1079
గుడ్ లైఫ్ డైలీ రైస్ 30 kg
ఎమ్ఆర్‌పి ₹1650
ఆదా చేసుకోండి ₹401
మా ధర ₹1249
(₹41.63/kg)
ఆశీర్వాద్ సుపీరియర్ ఎమ్‌పి ఆటా 5 kg
ఎమ్ఆర్‌పి ₹318
ఆదా చేసుకోండి ₹59
మా ధర ₹259
తూర్ / అర్హార్ దాల్ (కందిపప్పు) 2 kg
ఎమ్ఆర్‌పి ₹300
ఆదా చేసుకోండి ₹62
మా ధర ₹238
(₹119/kg)
విజయ నెయ్యి 1 ℓ
ఎమ్ఆర్‌పి ₹610
ఆదా చేసుకోండి ₹71
మా ధర ₹539
ఫార్చ్యూన్ సన్‌లైట్ సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ 1 ℓ
ఎమ్ఆర్‌పి ₹185
ఆదా చేసుకోండి ₹56
మా ధర ₹129
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g
ఎమ్ఆర్‌పి ₹549 / ₹499
ఆదా చేసుకోండి ₹234 / ₹100
మా ధర ₹315/ ₹399
బిస్కెట్స్ పెద్ద ప్యాక్ 350 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹140
BUY ANY 1 GET ANY 1 FREE
బూస్ట్ 1 kg
ఎమ్ఆర్‌పి ₹599 మొదలుకుని
మా ధర ₹445 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹154
కెల్లాగ్స్ కార్న్‌ఫ్లేక్స్ 1.2 kg
ఎమ్ఆర్‌పి ₹480 మొదలుకుని
మా ధర ₹320 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹160
మెక్కేన్ 360 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹135 మొదలుకుని
BUY 2 GET 1 FREE
లక్స్ 150 g x 3 యూనిట్ / డెటాల్ 125 g x 3 + 1 యూనిట్ / పియర్స్ / డవ్ సోప్ 125 g x 4 + 1 యూనిట్ (సెలెక్ట్ వేరియంట్స్)
ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹198 మొదలుకుని
BUY 2 GET 1 FREE
క్లినిక్ ప్లస్ / ట్రెసెమె / డవ్ షాంపు 580 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹555 మొదలుకుని
BUY 1 GET 1 FREE
సర్ఫ్ ఎక్సెల్ ఈజీ వాష్ డిటర్జెంట్ పౌడర్ 5 kg
ఎమ్ఆర్‌పి ₹770 మొదలుకుని
మా ధర ₹570 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹200
విమ్ లెమన్ డిష్‌వాష్ లిక్విడ్ 2 ℓ
ఎమ్ఆర్‌పి ₹445 మొదలుకుని
మా ధర ₹345 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹100
లైజాల్ ఫ్లోర్ క్లీనర్ 2 ℓ (సిట్రస్ / ఫ్లోరల్)
ఎమ్ఆర్‌పి ₹440 మొదలుకుని
మా ధర ₹400 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹40
ఫ్రీ లైజాల్ 500 ml (కిట్ ప్యాక్)
JOYO RATAN
ప్లెయిన్ బకెట్ 16 ℓ
ఎమ్ఆర్‌పి ₹230 మొదలుకుని
మా ధర ₹99
HAPPY LIVING raymond DREAMLINE WELSPUN
డబుల్ బెడ్ షీట్ / బాత్ టవల్ శ్రేణి
ఎమ్ఆర్‌పి ₹599
BUY 1 GET 2 FREE
Prestige
డెకోర్ బ్లాక్ 3 పీసెస్ నాన్ స్టిక్ కుక్‌వేర్ సెట్
ఎమ్ఆర్‌పి ₹3740
మా ధర ₹1599
లూస్ స్టీల్ డిన్నర్ వేర్ (సెలెక్ట్ రేంజ్)
ఎమ్ఆర్‌పి ₹49 మొదలుకుని
BUY 1 GET 1 FREE
కుర్తాస్ ₹399 మొదలుకుని
టి షర్ట్స్ ₹199 మొదలుకుని
షార్ట్స్ ₹129 మొదలుకుని
ఈ హోలీని సంబరంగా జరుపుకోండి
హోలీ గులాల్ 250 g (5 రంగులు గల ప్యాక్)
ఎమ్ఆర్‌పి ₹150
మా ధర ₹69
హోలీ వాటర్ గన్స్ / పిచ్కారీ
ఎమ్ఆర్‌పి ₹145 మొదలుకుని
మా ధర ₹73 మొదలుకుని
50%
శ్రీ గురుజీ కేసరియ / బాదం ఠండాయి 1 ℓ (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹550 మొదలుకుని
మా ధర ₹420 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹130
7 అప్ / మిరిండా ఆరెంజ్ / పెప్సి 2.25 ℓ (సెలెక్ట్ వేరియంట్స్)
ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹99 మొదలుకుని
BUY ANY 2 GET ANY 1 FREE
ప్యారీస్ వైట్ లేబుల్ సల్ఫర్ ఫ్రీ షుగర్ 5 kg
ఎమ్ఆర్‌పి ₹300
ఆదా చేసుకోండి ₹101
మా ధర ₹199
(₹39.80/kg)
వద్ద కూడా లభ్యం
SMART POINT
fresh Signature
RuPay Instant discount
Flat ₹200 Flat ₹400
Min. Txn of ₹1500
మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి
నియమ నిబంధనలు వర్తిస్తాయి. ఆఫర్లు 5 మార్చి 2023 వరకు చెల్లుతాయి.

ఇంద్రియ సముదాయమును చక్కగా వశపరచుకొనినవారు, సకల భూతముల హితమునే కోరుచుండువారు, సర్వప్రాణులను సమభావముతో చూచువారు యోగులు.

– భగవద్గీత

సాక్షి

శనివారం, మార్చి, 4

ఈసీపై ఎన్నదగిన తీర్పు

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడటం, వాటికి విశ్వసనీయత కల్పించటం ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు అత్యంత కీలకం. ఈ కర్తవ్యనిర్వాహణలో తలమునకలు కావాల్సిన ఎన్నికల సంఘం (ఈసీ) స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆ పని పూర్తిచేస్తున్నదన్న అభిప్రాయం ప్రజల్లో కలిగిస్తే విశ్వసనీయత దానంతటదే ఏర్పడుతుంది. అందుకే ఎన్నికల సంఘం కూర్పు విషయంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం ఏకగ్రీవంగా వెలువరించిన తీర్పు హర్షించదగ్గది. ఈ తీర్పు ప్రకారం ఇకపై ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండే త్రిసభ్య కమిటీ ఎన్నికల కమిషనర్‌ల నియామకాలను ఖరారు చేయాల్సివుంటుంది. ఇంతవరకూ అనుసరిస్తున్న విధానం వేరు. కేంద్ర పాలకుల ఇష్టారాజ్యంగా ఆ నియమాకాలుంటున్నాయి. ఎన్నికల సంఘం విధులు, అధికారాల విషయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. విస్తృతాధికారాలుండే ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికలు జరగాలని, అందుకు అనుగుణమైన అధికారాలు దానికుండాలని రాజ్యాంగ నిర్ణాయక సభలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల నిర్వహణ, నియంత్రణ, అవసరమైన మార్గదర్శకాల ఖరారు కోసం ఎన్నికల సంఘం ఉండాలని రాజ్యాంగంలోని 324 అధికరణ మొదలుకొని 329వ అధికరణ వరకూ నిర్దేశిస్తున్నాయి.

అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్‌లను ఏవిధంగా ఎంపిక చేయాలన్న అంశంలో రాజ్యాంగం ఏమీ చెప్పలేదు. ఈ అధికరణలపై రాజ్యాంగ నిర్ణాయక సభలో చర్చ జరిగినప్పుడు ఎంపిక ప్రక్రియను పార్లమెంటుకే విడిచిపెట్టాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. నిర్దిష్టంగా ఉండే నిబంధనలకే తూట్లుపొడవటం అలవాటైన దేశంలో స్పష్టత కొరవడితే చెప్పేదేముంది? ఇది సహజంగానే అధికారంలో ఉండేవారికి వరమైంది. తమకు అనుకూలురైనవారిని ఆ సంఘంలో నియమించటం ఒక సంప్రదాయంగా స్థిరపడింది. అందువల్లే ఎన్నికలు ముంచుకొచ్చినపుడల్లా అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధాలు రివాజుగా మారాయి. ఎన్నికలు ప్రకటించటం దగ్గర్నుంచి ఎన్నికల తేదీల ఖరారు, ఎన్నికల నిర్వహణ వరకూ అన్నీ వివాదాస్పదమే అవుతున్నాయి. పారదర్శకత లోపించటమే ఇందుకు కారణం. గడువు పూర్తయిన రెండు రాష్ట్రాల్లో ఒక రాష్ట్రానికి మాత్రమే ఎన్నికల ప్రకటన వెలువరించి, మరో రాష్ట్రం గురించి మౌనం పాటించారన్న విమర్శలు ఒకపక్క... ప్రచారసభల్లో అవతలి పార్టీ నేతలు ఏం మాట్లాడినా మౌనంవహిస్తూ తమపై మాత్రం దూకుడుగా చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు మరోపక్క తరచు ఈసీ ఎదుర్కొనాల్సివస్తోంది. కొన్ని సందర్భాల్లో అదిచ్చే వివరణలు అసంబద్ధంగా ఉండటం కూడా కనబడుతూనే ఉంది. కేంద్రంలోని పాలకపక్షం తన విధేయులను ఎన్నికల సంఘంలో నియమించటం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని విపక్షాలు ఆరోపించటం కూడా మామూలే. యూపీఏ పాలనలో ప్రధానంగా బీజేపీనుంచి ఇలాంటి ఆరోపణలు వినిపిస్తే ఇప్పుడు బీజేపీయేతర పక్షాలు ఆ పాత్ర పోషిస్తున్నాయి. ఎవరు అధికారంలోకొచ్చినా కమిషనర్ల ఎంపిక ప్రక్రియ మార్చాలన్న ఆలోచనకే దూరంగా ఉంటున్నారు. కొత్త చట్టం తీసుకొస్తే అది తమకే గుదిబండవుతుందని, తమ పాచికలు పారవని భావిస్తున్నారు. వాస్తవానికి జస్టిస్ ఏపీ షా నేతృత్వంలోని 20వ లా కమిషన్ ఎన్నికల సంఘం కూర్పు, ఎన్నికల సంస్కరణల గురించి లోతుగా పరిశీలించి నివేదిక ఇచ్చింది. కమిషనర్‌ల ఎంపికకు ఒక ప్రత్యేక కమిటీ ఉండాలని సూచించింది. కానీ ఇంతవరకూ దాని ఊసే లేదు.

ఎన్నికల సంఘం తటస్థ పాత్ర పోషిస్తున్నదని పార్టీలకు పూర్తి నమ్మకం కుదిరినప్పుడే ఆ ఎన్నికలపై ప్రజానీకంలో కూడా విశ్వసనీయత ఏర్పడుతుంది. ఆరోపణలు, ప్రత్యారోపణలకు అవకాశం ఉండదు. ఎన్నికల సంఘం తాను సర్వస్వతంత్రంగా, స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటున్నానన్న భరోసా అందరిలోనూ కలగజేస్తే మెజారిటీ ప్రజానీకం నిర్భయంగా ఓటేయగలుగుతారు. మొదట్లో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) ఒక్కరే ఎన్నికల సంఘానికి ప్రాతినిధ్యంవహిస్తే 1987 నాటి రాష్ట్రపతి ఎన్నికల సందర్భంలో అప్పటి సీఈసీ ఆర్‌వీఎస్ పేరిశాస్త్రి వ్యవహరించిన తీరుతో ఆందోళనపడ్డ నాటి ప్రధాని రాజీవ్ గాంధీ 1989 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈసీని ఇద్దరు సభ్యుల కమిషన్‌గా మార్చారు. కానీ ఎన్నికల అనంతరం వీపీ సింగ్ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం దాన్ని తిరగదోడింది. ఆ తర్వాత పదవి కోల్పోయిన కమిషనర్ ధనోవా సుప్రీంకోర్టుకెళ్లినా లాభం లేకపోయింది. తదనంతరకాలంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం అప్పటి సీఈసీ శేషన్ దూకుడు చూసి కీడు శంకించి త్రిసభ్య కమిషన్‌గా దాన్ని మార్చింది. కొత్తగా ఎంఎస్ గిల్, జీవీజీ కృష్ణమూర్తిలను తీసుకుంది. ఎన్నికల సంఘం చట్టాన్ని సవరించి ముగ్గురికీ ఒకే రకమైన అధికారాలు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి హోదా కల్పించారు. అయితే అంతా మారినట్టేనా? లేదని ఇన్ని దశాబ్దాల అనుభవాలు పదే పదే నిరూపించాయి. ఒకరున్నా, ఇద్దరున్నా, ముగ్గురున్నా ఈసీకి నిందలు తప్పటం లేదు. నిర్ణయ ప్రక్రియలో పారదర్శకత కూడా అంతంతమాత్రం. సుప్రీంకోర్టు చెప్పడానికి ముందే ప్రభుత్వాలు దీన్ని గ్రహిస్తే బాగుండేది. కమిషనర్‌ల ఎంపిక ప్రక్రియపై కొత్త చట్టం తీసుకురావాలని, అంతవరకూ తమ మార్గదర్శకాలు అమల్లో ఉంటాయని తాజాగా ధర్మాసనం ప్రకటించింది. ఈ తీర్పు స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చట్టం తీసుకొస్తుందని, ఇకపై ఎన్నికల సంఘం తటస్థత విషయంలో అనుమానాలకూ, అపోహలకూ ఆస్కారం ఉండదని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.ద్వాదశి ఉ.11.57 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: పుష్యమి రా.7.03 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.6.20 నుండి 7.55 వరకు, అమృతఘడియలు: ఉ.11.43 నుండి 1.43 వరకు, శనిత్రయోదశి.

సూర్యోదయం : 6.21
సూర్యాస్తమయం: 6.03
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

మళ్లీ వీళ్లే పోటీ పడితే?

అభిప్రాయం



గ్యారీ అబెర్నాతీ

అమెరికాలో 2024 అధ్యక్ష ఎన్నికలు తిరిగి ట్రంప్, బైడెన్ మధ్యే జరిగితే ఆ పోటీ నిర్జీవంగా ఉంటుంది. ఓటమి ఫలితాన్ని తిరస్కరించిన ట్రంప్ పట్ల చాలామంది రిపబ్లికన్లు కూడా సుముఖంగా లేరు. అదే సమయంలో డెమొక్రాట్లు కూడా మరొక అభ్యర్థిని వెతుక్కోవడం మంచిది. ఎందుకంటే బైడెన్ కానీ, ట్రంప్ కానీ తమ పార్టీలను ఉత్సాహపరిచే స్థితిలో లేరు. కానీ ఒకవేళ బైడెన్ కాకపోతే సామ్యవాద శైలితో అమెరికాను మరింతగా ముంచే ఉదారవాది డెమొక్రాటిక్ పార్టీ నామినీ కావొచ్చు. అప్పుడు నేను రిపబ్లికన్ పార్టీ నామినీకే ఓటేస్తాను. ఆ నామినీ ట్రంప్ అయితే కూడా నా అభిప్రాయం ఇదేనా? ఇది న్యాయమైన ప్రశ్న.

2024లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష ప్రాథమిక ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు భావిస్తున్న మేరీలాండ్ మాజీ గవర్నర్ లారీ హోగన్... టాప్ రేడియో హోస్ట్, రాజకీయ పండితుడు హ్యూ హెవిట్‌తో చేసిన సంభాషణతో వార్తల్లోకెక్కారు. అధ్యక్ష అభ్యర్థి కోసం రిపబ్లికన్ పార్టీ జరిపే ప్రాథమిక ఎన్నికల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తిరిగి గెలిచినట్లయితే తాను 'అసమ్మతితో' మద్దతిస్తానని హోగన్ చెప్పారు. అంతకుముందు ఆయనే 2020లో అభ్యర్థుల జాబితాలో లేని రోనాల్డ్ రీగన్‌కు అయినా ఓటు వేస్తాను గానీ, ట్రంప్‌కి ఓటు వేసేది లేదని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత గందరగోళ స్థితిలో తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకున్నారు. ట్రంప్‌కు మద్దతివ్వను కానీ రిపబ్లికన్ పార్టీ నామినీకి మద్దతిస్తాననీ, అయితే ఆ అభ్యర్థి ట్రంప్ కారని ఆశిస్తాననీ చెప్పారు.

ఈ ప్రకటనలో స్పష్టత లేదు కానీ, హోగన్ మాటలు... రిపబ్లికన్ ప్రాథమిక పోటీల్లో ట్రంప్ తిరిగి నిలబడినట్లయితే పరిస్థితి ఏమిటని చాలామంది అమెరికన్లలో నెలకొని ఉన్న డోలాయమాన స్థితిని ప్రతిఫలిస్తున్నాయని చెప్పాలి. ట్రంప్‌ను ద్వేషించేవారు అడగొచ్చు. ''అసలు దేనికి ఈ డోలాయమానం? ప్రజాస్వామ్యాన్ని కూలదోయడానికి ప్రయత్నించినవాడిని ఎవరైనా ఎందుకు పరిగణించాలి?'' ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ అనుసరించబోయే తీవ్ర వామపక్ష వాద విధానాల కన్నా ట్రంప్ వాగాడంబరమే ఎక్కువ చిర్రెత్తించేవాళ్లు మాత్రమే ఇలా సింపుల్‌గా అనేయగలరు.

కొన్ని తక్షణ సమస్యలు

ఈ రెండు అంశాలు నన్ను తీవ్రంగా కలత పెడుతున్నాయి. కానీ ఒక రిపబ్లికన్‌గా నేను దీనికోసం 2024 వరకు వేచి ఉండలేను. బైడెన్ మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడనట్లయితే, సామ్యవాద శైలి అథోజగత్తులో మనందరినీ మరింతగా ముంచేసే ఉదారవాద రాజకీయ నాయకుడు డెమొక్రటిక్ పార్టీ నామినీ కావొచ్చు. నేను మాత్రం తప్పకుండా రిపబ్లికన్ పార్టీ నామినీకే ఓటు వేస్తాను. ఆ నామినీ ట్రంప్ అయితే కూడా నా అభిప్రాయం ఇలాగే ఉంటుందా? ఇది న్యాయమైన ప్రశ్న.

తన అధ్యక్ష పదవీ కాలం పొడవునా, ట్రంప్ తన దూకుడు ప్రవర్తన ద్వారా నన్ను ఎంతో నిస్పృహకు గురిచేశారు. కానీ ఆయనకు నా మద్దతు చెక్కుచెదరలేదు. ఎందుకంటే నేను రాజకీయ నేతలను వారి ప్రవర్తనను బట్టి చూడను. వారి ఫలితాలను మాత్రమే పట్టించుకుంటాను.

అయితే 'ట్రంప్ ఎప్పటికీ వద్దు' అనే ప్రచారంలో నేను ఇంతకు ముందూ లేను, ఇకపై కూడా ఉండబోను. కొంతమంది పైస్థాయి రిపబ్లికన్లు 2016 నుంచి ట్రంప్‌పై ఆగ్రహంగా ఉన్నారు. ట్రంప్ నేతృత్వంలోని క్షేత్రస్థాయి ఉద్యమం (దీనికి నేను సంతోషించాను) తమ నుంచి పార్టీని లాగేసుకుందని వీరికి కోపం. అయితే 2020 అధ్యక్ష ఎన్నికల్లో తనను ప్రజలు తిరస్కరించడాన్ని ట్రంప్ ఆమోదించకపోవడం, ఆ తర్వాత 2021 జనవరి 6న జరిగిన హింసాత్మక ఘటనల వల్ల ట్రంప్‌తో రిపబ్లికన్ పార్టీ తెగతెంపులు చేసుకోవాలని నేను అభిప్రాయపడాల్సి వచ్చింది.



అయితే లోపభూయిష్టమైన రాజకీయ ఎంపికలు తరచుగా ఉన్నతమైన ఆదర్శాలతో ఘర్షిస్తుంటాయి. ఇతర విసుగు చెందిన ట్రంప్ మద్దతుదారులతో తాజాగా మాట్లాడుతున్నప్పుడు, ''నామినేషన్ ఆయన గెల్చుకుంటే ఏమవుతుంది?'' అనే ప్రశ్న తలెత్తుతుంది. అప్పుడు సాధారణంగా గాఢ నిశ్శబ్దం ఆవరిస్తుంది. ''బైడెన్‌కు వోటు వేయడం ఒక్కటే దేశభక్తియుత చర్యగా ఉంటుంది'' అని వీరిలో చాలా మంది నొక్కి చెబుతారు. అయితే అది అంత సులభమైన విషయం కాదు.

అధ్యక్షుడిగా ఆశ్చర్యకరంగా ప్రభుత్వ పెద్ద విజన్‌కు ఛాంపియన్‌గా నిలిచిన బైడెన్‌ను నేను తీవ్రంగా వ్యతిరేకిస్తాను. ఆ విజన్‌ను ఆయన తన స్టేట్ ఆఫ్ ది యూనియన్ ప్రసంగంలోనూ పునరుద్ఘాటించారు.

సబ్సిడీలతో, పన్ను మినహాయింపులతో ప్రత్యామ్నాయ 'శుభ్రమైన' శక్తివనరులకు ప్రభుత్వం ఆసరా ఇస్తున్నప్పుడు– సరసమైన శిలాజ ఇంధనాల ధర్లపై బైడెన్ చేస్తున్న యుద్ధం నాకు చికాకు తెప్పిస్తుంటుంది. ఆయుధాలను కలిగి ఉండటంపై అమెరికా రాజ్యాంగపు రెండో సవరణను మరింతగా అతిక్రమించే, అబార్షన్ హక్కులను క్రమబద్ధీకరించాలనే అభ్యర్థికి నేను ఓటు వేయలేను.

చట్టబద్ధమైన వలసలను సులభతరం చేయడాన్ని నేను బలపరుస్తాను. అలాగని అమెరికా సరిహద్దులను సురక్షితంగా ఉంచే బాధ్యత పట్ల బైడెన్ ప్రభుత్వం ప్రమాదకరమైన నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని అనుకుంటున్నాను.

'నిరసన ఓటు' లేదు

కాబట్టి 2020లో మూడో పార్టీ అభ్యర్థి కోసం తమ ఓటు వేస్తానని చెప్పిన హోగన్ వంటి రిపబ్లికన్లతో నేను జట్టు కట్టలేను. దీనివల్ల వారి మనస్సాక్షికి ఉపశమనం కలిగిందేమో గానీ వాస్తవంలో దానితో ఉపయోగం లేకపోగా బైడెన్ ఎన్నిక కావడానికి తోడ్పడింది. పైగా పాత అమెరికా పథకాలు 'న్యూ డీల్', 'గ్రేట్ సొసైటీ' వంటి వాటి గురించి చరిత్రకారులు పోల్చేటటువంటి భారీ ప్రభుత్వ విస్తరణకు అది దారితీసింది. అందుకే ఈ చర్చ ట్రంపా? బైడెనా? అని తిరిగి అక్కడికే వచ్చి నట్లయితే, 'నిరసన ఓటు'పై మన స్వాతంత్ర్యాన్ని వృథా చేయకుండా – కఠినమైన, అసౌకర్యమైన నిర్ణయాన్ని అయినా సరే... తీసుకోవడం పౌరులుగా మనందరి విధి.

ట్రంప్, బైడెన్ తిరిగి పోటీపడటం జరిగినట్లయితే– చట్టబద్ధమైన ఎన్నిక ఫలితాన్ని తిరస్కరించిన వ్యక్తి (తిరిగి అదే పని చేయగలడు కూడా), ఫెడరల్ కోర్టు బెంచ్‌లో సాంప్రదాయిక ఆలోచనలున్న న్యాయమూర్తులను నియమిస్తూనే సామాజిక, ఆర్థిక, సరిహద్దు విధానాలను కఠినంగా చేపట్టగల వ్యక్తి... ప్రగతిశీల విధానాలు అవలంబిస్తూ, సమస్య తర్వాత సమస్యతో దేశానికి తీవ్ర నష్టం చేస్తున్న వ్యక్తి మధ్య ఒకరిని నేను ఎంచుకోవాల్సి ఉంటుంది.

డెమొక్రాట్లు కూడా మరొక అభ్యర్థిని వెతుక్కోవడం తెలివైన పని. ఇటీవలే 'ఏబీసీ' న్యూస్ పోల్ నివేదించినట్లుగా బైడెన్ కానీ, ట్రంప్ కానీ తమ సొంత పార్టీలను విస్తృతంగా ఉత్సాహపరిచే స్థితిలో లేరు.

ఊహాత్మకమైన పోటీ

బైడెన్, ట్రంప్ మధ్య తిరిగి పోటీ జరుగుతుందని ఊహిస్తే గనక, ఇదే పోల్ ప్రకారం 48 శాతం ఓటర్లు ట్రంప్‌కు, 45 శాతం మంది బైడెన్‌కు అనుకూలంగా ఉంటున్నారు. ఇక స్వతంత్రులతో కలిపి పరిగణిస్తే– ట్రంప్‌కు 50 శాతం మద్దతు లభించగా బైడెన్‌కు 41 శాతం మంది మాత్రమే మద్దతు తెలిపారు. ట్రంప్ మద్దతుదారులే కాకుండా కోట్లాదిమంది అమెరికన్లు కూడా ఇప్పుడు బైడెన్ పాలన పట్ల సంతోషంగా లేరు. పైగా ఎన్ని లోపాలున్నప్పటికీ, మరోసారి ట్రంప్‌కు అవకాశం ఇవ్వడం పట్ల కూడా వీరు సుముఖంగా ఉన్నారు.

కానీ ఈ నిర్జీవ పోటీనే మనం ఎదుర్కోవాల్సిన వాస్తవమా? అయితే రిపబ్లికన్ పార్టీ ప్రైమరీ ఓటర్లు ట్రంప్‌ను కాకుండా మరొకరిని అధ్యక్ష పదవికి ఎంచుకుంటారని నేను ఇప్పటికీ ఆశావాదంతో ఉన్నాను. రిపబ్లికన్ పార్టీ ఎన్నుకునే అధ్యక్ష అభ్యర్థి రిపబ్లికన్లను మాత్రమే కాకుండా, వివిధ వర్గాల అమెరికన్లను కూడా ఉత్సాహపరిచేట్టుగా ఉండాలి.

వ్యాసకర్త సంపాదకుడు, కాలమిస్ట్
('ద వాషింగ్టన్ పోస్ట్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పళ్ల రాజు



ఎండాకాలానికి సిద్ధంగా లేనుగానీ, మామిడిపళ్ల కోసం మాత్రం ఎదురుచూస్తున్నాను. ఏమంటారు?

– రణవీర్ బ్రార్, చెఫ్

నేర్వని గుణపాఠాలు



ఉత్తరాఖండ్‌లో రిషీకేశ్ నుంచి శ్రీనగర్‌కు వేస్తున్న సొరంగ రైల్వే ట్రాకు వల్లే మళ్లీ భూపాతం సంభవించింది. జోషీమఠ్ కుంగిపోవడం నుంచి మోదీ ప్రభుత్వం ఏ పాఠాలూ నేర్చుకోలేదని దీనివల్ల స్పష్టమవుతోంది.

– సీమా సేన్‌గుప్తా, కాలమిస్ట్

మాకు కావాలో దేశం



కైలాసంను ఐక్యరాజ్యసమితి గుర్తించి, వైకుంఠాన్ని కనీసం పట్టించుకోకపోవడం పట్ల ఒక వైష్ణవుడిగా చాలా బాధ పడుతున్నాను. ఎవరైనా వైష్ణవ గురువు త్వరగా ఈ లోటు తీర్చుతారని నమ్ముతున్నాను. విష్ణు పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్నా.(కైలాసం పేరుతో వివాదాస్పద గురువు నిత్యానంద ఒక 'దేశం' నెలకొల్పడం పట్ల వ్యంగ్యం.)

– టి.ఎం. కృష్ణ, గాయకుడు

ప్రజాస్వామికంగా...



నేను తర్వాతి డిన్నర్‌కు వెళ్దామని అనుకున్నప్పుడు భారత ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నేతను అడుగుతాను. వాళ్లే రెస్టారెంట్‌ను ఎంపిక చేయాలి.

– సంధ్యా రవిశంకర్, సంపాదకురాలు

మొత్తం నష్టపోయాం



వార్తల్లో వచ్చే ప్రతిదీ దయచేసి నమ్మవద్దు. స్టాకుల విషయంలో నాకూ, మారియాకు (భార్య మారియా గోరెట్టి) ఉన్న జ్ఞానం శూన్యం. సలహా తీసుకుని 'శారదా'లో పెట్టుబడులు పెట్టాం. మరెందరి లాగానో మా కష్టార్జితమైన మొత్తం డబ్బును నష్టపోయాం.

– అర్షద్ వార్సీ, నటుడు

తప్పనిసరి పాఠం



ఆరోగ్య అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంలో అత్యంత తక్కువ జ్ఞానం, సంసిద్ధత ఉండటం చూస్తే బాధ కలుగుతోంది. (బ్యాడ్మింటన్ ఆడుతూ కుప్పకూలిన 38 ఏళ్ల శ్యామ్ యాదవ్‌కు 'సీపీఆర్' చేసివుంటే బతికేవాడేమోనన్న అర్థంలో.) సీపీఆర్ అనేది ఎంత విలువైనదో, అది ఎలా ఒకరి జీవితాన్ని కాపాడగలదో సామాజిక మాధ్యమాల్లో తగినంత చైతన్యం ఉంది. సీపీఆర్‌ను పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా నేర్పాల్సిన సమయం ఇదే.

– సంగీతా రెడ్డి, ఆరోగ్య రంగ పర్సనాలిటీ

అక్కర్లేని పోరు



కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒప్పందలలో ఉన్నాయి – కేంబ్రిడ్జిలో రాహుల్ ఉపన్యాసం గొప్పగా ఉంది. అది ఓట్లు తేగలదని కాంగ్రెస్ నమ్మింది. అది మరిన్ని ఎక్కువ ఓట్లు తమకు తేగలదని బీజేపీ నమ్మింది. విన్-విన్ సందర్భం! మరి మనం ఎందుకు పోట్లాడుకుంటున్నట్టు?

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యంగ్య వ్యాఖ్యాత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ప్రగతిశీల పాత్రికేయ సమున్నతుడు

సందర్భం




జయసూర్య

1962లో మార్క్సిస్టు పార్టీ అవతరణ దశలో, మార్క్సిస్టు పార్టీ వారపత్రిక 'జనశక్తి' స్థాపనకు పార్టీ నాయకత్వం డిక్లరేషన్ తీసుకుని ఏబీకే ప్రసాద్ (అన్నె భవానీ కోటేశ్వర ప్రసాద్) దానిని ప్రారంభించారు. అనతి కాలంలోనే జనశక్తి పార్టీ క్యాడర్‌లోనే కాక, తెలుగునాట పార్టీయేతర ప్రజలలో కూడా ఎక్కువ ప్రాచుర్యం సాధించింది. బొమ్మారెడ్డి, సత్యమూర్తి (శివసాగర్), వై. కోటేశ్వర రావు, శ్రీహరి తదితరుల సారథ్యంలోని జనశక్తి ప్రధాన సంపాదకునిగా ఏబీకే ప్రసాద్ వ్యవహరించేవారు. ఆయన ప్రధానంగా సంపాదకీయాలతో పాటు సిద్ధాంత వ్యాసాలు రాసేవారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాల ప్రభావం కారణంగా సిద్ధాంతపరమైన వ్యాసాలతో, వార్తా విశేషాలతో పార్టీ కార్యకర్తలను, ప్రజలను ఆకట్టుకున్న 'జనశక్తి' తెలుగు నాట రాజకీయాలలో ప్రముఖ పాత్ర వహించింది. వార పత్రిక గానే గాక ద్వైవార పత్రికగా, దినపత్రికగానూ సంవత్సరాల తరబడి సంచలనం సృష్టించింది. భారత చైనా వివాదం, ఘర్షణలు తలెత్తినపుడు... కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నాటి పరిస్థితులను సాకుగా చూపి చాలా మంది మార్క్సిస్టు పార్టీ నాయకులతో పాటూ ఏబీకేనూ అరెస్టు చేసి జైలులో పెట్టింది. ఏడాదికి పైగా జైలులో ఉండి విడుదలైన కొద్ది రోజులకే రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమంలో తీవ్రమైన పరిస్థితులు తలెత్తి... విప్లవ వర్గం అవతరించింది. తొలినుంచి 'జనశక్తి' పత్రికా నిర్వహణలో చురుకుగా పాల్గొంటున్న ఏబీకే చీలిక వర్గాల ఒత్తిళ్ళు సరిపడక పార్టీ పరమైన రాజకీయాల నుంచి దూరమయ్యారు. అయినా మార్క్సిజం మూల సూత్రాల నుంచి ఆయన దూరం కాలేదు.

'జనశక్తి' నుంచి తప్పుకున్న తరువాత ఆంధ్ర జ్యోతి సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు నుంచి పిలుపు రావడంతోనే ఏబీకే పత్రికా ప్రస్థానం మలుపు తిరిగింది. ఇంతలో ప్రభుత్వం పార్వతీ పురం కుట్ర కేసులో ఇరికించింది. రెండున్నరేళ్లు కోర్టు చుట్టూ తిరిగి ఆ కేసు నుంచీ బయటపడ్డారు. విలేఖరి స్థాయి నుంచి 'ఎడిటర్-ఇన్-చీఫ్' వరకూ అరవై ఏళ్ల పత్రికా జీవితంలో ఎదిగారు. నిబద్ధత, ఎవరికీ తలవంచని ప్రవృత్తి, జనసామాన్యం సంక్షేమం పట్ల నిరంతర నిమగ్నత, సోషలిస్టు సమాజ లక్ష్యం ఏబీకేను ఇప్పటికీ నడిపిస్తున్నాయి. 'జనశక్తి', 'విశాలాంధ్ర', 'ఈనాడు', 'ఆంధ్రప్రభ', 'ఆంధ్ర భూమి', 'ఉదయం', 'ఆంధ్రజ్యోతి', 'వార్త', 'ఆంధ్రప్రదేశ్', 'మాభూమి', 'సుప్రభాతం' వంటి పత్రికలకు సంపాదకునిగా మార్గ దర్శకత్వం వహించిన ఏకైక మేధా సంపన్నునిగా ఆయనకు గుర్తింపు లభించింది.

తెలుగు పత్రికలలో అచ్చమైన తెలుగు పదాలకు, నుడికారాలకు, సామెతలకు; సందర్భానుసారంగా శీర్షికలు, వాక్యాలలో స్థానం కల్పించి... మాతృభాషకు ఎంతో సేవ చేశారు. అక్కరకు వచ్చే తెలుగు పదాలను తోసిపుచ్చడం ఆత్మహత్యాసదృశం అన్నారు. ప్రామాణిక భాషనే కాదు, ప్రామాణిక భాషను సంపన్నవంతం చేసే ప్రాదేశిక పద సంపదను పత్రికా రంగంలో ప్రవేశపెట్టారు. సంపాదకీయానికి విషయ పరిజ్ఞానం, విశ్లేషణ, సాధికారత, భాష ... ఈ నాలుగు లక్షణాల ఆవశ్యకతను గుర్తించి, నార్ల ఒరవడిని పుణికిపుచ్చుకుని ప్రతిభావంతమైన సంపాదకీయాలు రాశారు. అధికార భాషా సంఘం చైర్మన్‌గానూ ఆయన వ్యవహరించారు.



పత్రికా రచయితగానే కాకుండా గ్రంథకర్తగా 'నిబద్ధాక్షరి', 'సాహిత్యకీయాలు', 'యూనివర్సిటీలలో జ్యోతిష్యం అవసరమా?', 'పరాధీన భారతం', 'సిరా సరాగాలు', 'దారి తప్పిన రూపాయి', 'యుద్ధ నేరస్థులు', 'అంతా బాగుంది', 'అబద్ధాలు-ఆర్భాటాలు' 'ఆఫ్ఘనిస్తాన్‌పై సూపర్ టెర్రరిజం ధ్వంసరచన', 'కళంకిత సావర్కర్', 'సర్వ సమర్పణం', 'రుణాంధ్రప్రదేశ్' వంటి ఎన్నో రచనలు వెలుగుచూశాయి.

సంపాదకీయాలు పేరిట నాలుగు గ్రంథాలు వచ్చాయి. సతీష్ చందర్‌తో కలిసి 'వార్త పలుకుబడి', టంకశాల అశోక్‌తో కలిసి 'నిజాలు, నిష్ఠూరాలు' పేరుతో నాలుగు సంపుటాలు; కన్నాభిరాన్, ఆర్.ఎస్. రావులతో కలిసి 'పీపుల్స్‌వార్ ప్రభుత్వ చర్చలు దృక్పథాలు, దృక్కోణాలు' వెలువడ్డాయి. ఆత్మకథ రచించే ప్రతిపాదన రూపు దిద్దుకొంటోంది. ఆయన 'పరాధీన భారతం' దేశ వ్యాపితంగా ప్రశంసలందుకుంది.

88 ఏళ్ల వయసులో డా॥ ఏబీకే ప్రసాద్ వృద్ధాశ్రమంలో ఉన్నా పత్రికా కార్యాలయంలో ఉన్నట్టే మార్క్సిస్టు ప్రగతిశీల సోషలిజం భావజాలంతో అనుక్షణం జీవిత గమనంలో అనేక సమకాలీన సంఘటనలకు స్పందిస్తూ రచనలు కొనసాగిస్తూ ఉన్నారు. ఆయన వంటి పాత్రికేయులు, వర్తమాన మీడియాకు అత్యవసరమని ప్రస్తుత రాజకీయ, పాత్రికేయ రంగం స్థితిగతులు స్పష్టం చేస్తున్నాయి.


వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్ : 90149 48336

(ప్రముఖ సీనియర్ పత్రికా సంపాదకులు ఏబీకే ప్రసాద్‌కు 'రాజా రామమోహన్ రాయ్ నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్' ప్రదానం సందర్భంగా)

బుద్ధి సూక్ష్మత

మనిషికి 'తత్కాలవృత్తియైన బుద్ధి' అంటే అవసరానికి ఉపయోగపడే బుద్ధి తగిన ఫలితం అందిస్తుంది. కానీ 'తలచినపుడె బుద్ధి తలకొనకుండిన హానివచ్చుగాన' అనగా అవసరానికి ఆదుకోని బుద్ధి వలన ఆపదే కాబట్టి, అది తెలివిలేనితనంతో సమానమైనదే అంటాడు ఎఱ్ఱయ కవి 'సకలనీతి కథా నిదానము'లో ఒకచోట. ఇందుకు దృష్టాంతంగా చెప్పుకోదగిన ఒక పాత కథ ఉంది.

పూర్వం ఒక ఊరిలో ఒక రైతు కుటుంబం ఉండేది. జీవితమంతా కష్టపడి దాచిన సొమ్ము ఒక వెయ్యి వరహాలు చేరింది అతని దగ్గర. అప్పట్లో అది పెద్ద మొత్తమే. ఆ మొత్తాన్ని చాలా జాగ్రత్తగా దాచి పెట్టి రోజూ చూసుకుని ఆనందపడుతూండేవాడు. రోజులు అలా గడుస్తూండగా అతనికి ముసలితనం వచ్చి, ఏదో తెలియని వ్యాధి అతని శరీరంలోకి చేరింది. ఎక్కువ రోజులు బతికే అవకాశం లేదని అతనికి అర్థం కాగానే, దాచి ఉంచిన డబ్బుమూట మీద అతనికి దిగులు పెరిగిపోసాగింది.



జ్యోతిర్మయం

అతనికి ఇద్దరు కొడుకులున్నారు. ఇద్దరూ బుద్ధిగా ఉంటూ శ్రమచేసి జీవనం సాగించేవారే. అయినప్పటికీ ఆ ఇద్దరిలో ఎవరు తాను దాచి ఉంచిన ధనరాశికి అర్హుడైనవాడో తెలుసుకోవడానికి ఒక పరీక్ష పెట్టాలనుకున్నాడు. ఆ రాత్రి జాగ్రత్తగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి నిద్ర పోయాడు. ఆ మరునాడు నిద్ర మేలుకోగానే ఇద్దరు కొడుకులనూ పిలిచి, ఒక్కొక్కరికి ఐదు వరహాలు ఇచ్చి, ఆ ధనంతో ఏమి కొనగలరో కొని, ఇంటిని పూర్తిగా నింపి చూపించమని అడిగాడు. చిన్నవాడు వెంటనే ఒక చెరకు గానుగ కొట్టుకు వెళ్ళి, రెండు బండ్ల చెరకు చెత్త తెచ్చి, అరగంటలో ఇంటినంతా నింపి చూపించాడు తండ్రికి.

తమ్ముడి తొందరపాటుతనంతో పాటు, తండ్రి మనసులో ఆలోచన తెలిసినవాడైన పెద్దకొడుకు, సాయంత్రమైన దాకా వేచి ఉండి, చీకట్లు ఊరిని కమ్మేస్తూ ఉండగా, ఇంటికి దగ్గరలోని ఒక అంగడికి వెళ్ళి, ఒక నూనెలో ముంచిన దివిటీని ఒక వరహా ఖర్చుతో కొని తెచ్చి, తండ్రి, తమ్ముడు చూస్తూ ఉండగా దివిటీని వెలిగించి, ఆ దేదీప్యమానమైన వెలుగులో ఇంటిని మొత్తాన్నీ నింపి, ఇంటిని నింపడానికి తనకు ఒక వరహా సరిపోయిందని, మిగతా నాలుగు వరహాలు తిరిగి తండ్రికే ఇచ్చాడు. తండ్రి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. పెద్దవానికే సొమ్ము బాధ్యతతో పాటు, తమ్ముడి బాధ్యతను గూడా అప్పగించాడు. అన్న తెలివికి తమ్ముడు కూడా ఆనందించి, అన్నకు విధేయుడై ఉంటూ సుఖపడ్డాడు.

అలా అవసరమైనప్పుడు ఉపయోగపడే బుద్ధి అన్ని సందర్భాలలోనూ విజయాన్ని అందించేదిగా ఉంటుంది.

– వెంకట్ భట్టు

వినయ్‌కి అండగా ఉంటాం: మంత్రి హరీశ్

• 'సాక్షి' కథనానికి స్పందన



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సైన్స్‌ఫేర్ ఈవెంట్‌లో కెమికల్ మీద పడి గాయపడిన ఆరో తరగతి విద్యార్థి వినయ్‌కి అన్ని విధాలా అండగా ఉంటామని వైద్య, ఆరోగ్య శాఖమంత్రి టి.హరీశ్‌రావు హామీ ఇచ్చారు. 'అయ్యో వినయ్.. ఆదుకునేవారే లేరా?' శీర్షికన శుక్రవారం సాక్షి ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. వినయ్ చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెంటనే తన సిబ్బందిని పంపించారు. ఆ తర్వాత బాలుడికి చికిత్స అందిస్తున్న వైద్యులతో మంత్రి స్వయంగా మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వినయ్ తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వినయ్ ఆరోగ్యం మెరుగై సాధారణ స్థితికి వచ్చే వరకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చికిత్స ముగిసే వరకు తోడుగా ఉండి, ప్రభుత్వ అంబులెన్స్‌లోనే ఇంటివరకు పంపిస్తామని, ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫిబ్రవరి 28న జరిగిన ప్రమాదంలో వినయ్ గాయపడగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రబీ సేకరణ లక్ష్యం 1.58 కోట్ల టన్నులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రస్తుత రబీ సీజన్‌లో 1.58 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే ఖరీఫ్‌లో మొత్తంగా 7.13 కోట్ల మెట్రిక్ టన్నుల మేర సేకరించినట్లు వెల్లడించింది. ధాన్యం సేకరణ ద్వారా కోటి మంది రైతులకు లబ్ధి జరగ్గా, రూ.1.46 లక్షల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో బదిలీ చేసినట్లు వివరించింది. ప్రస్తుతం రబీలో నిర్ణయించిన సేకరణ లక్ష్యాలతో కలిపి మొత్తంగా ఈ ఏడాదిలో 9 కోట్ల మెట్రిక్ టన్నులకు మించి సేకరణ చేయనున్నట్లు తెలిపింది.

యువశక్తి వర్క్‌షాప్ ఏప్రిల్‌కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'కొత్తగూడెం యువశక్తి' పేరుతో నిర్వహించాల్సిన యంగ్ లీడర్స్ వర్క్‌షాప్‌ను ఏప్రిల్‌కు వాయిదా వేసినట్లు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. వర్క్‌షాప్‌ను ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించడం తెలిసిందే. కానీ ఔత్సాహికుల విజ్ఞప్తి మేరకు ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 8, 9 తేదీల్లో సింగరేణి ఉమెన్స్ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహిస్తామని డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

యాదాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



అష్టోత్తర శతఘటాభిషేకంలో భాగంగా కలశాలకు పూజలు చేస్తున్న అనువంశిక ధర్మకర్త, ఆలయ ఈవో, అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్రీస్వామి అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకం జరిపించారు. రాత్రి 9.30గంటలకు ఆలయంలో శ్రీస్వామి వారికి శృంగార డోలోత్సవం ఘనంగా జరిపించి ఉత్సవాలకు ముగింపు పలికారు. కాగా బ్రహ్మోత్సవాల సందర్భంగా గత నెల 21వ తేదీ నుంచి శుక్రవారం వరకు రద్దు చేసిన నిత్య కల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, సేవలను శనివారం నుంచి పునః ప్రారంభించనున్నారు.

'సువర్ణ' వాహనంపై రామయ్యకు తిరువీధి సేవ



హనుమత్ వాహనంపై స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి ప్రవాసాంధ్ర వాసవీ అసోసియేషన్ వారు అందించిన సువర్ణ తాపడ ద్వాదశ వాహనాలకు శుక్రవారం ఆలయంలో ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించారు. అనంతరం వాహనాలపై సీతాలక్ష్మణ సమేతుడైన రామచంద్ర స్వామి వారి ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గజ, అశ్వ, చంద్రప్రభ, సూర్యప్రభ, గరుడ, శేష, హనుమత్, కల్పవృక్ష, హంస, సింహ, సార్వభౌమ వాహనాలతో స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు భక్త రామదాసు చేయించిన వాహనాలతోనే స్వామివారి ఉత్సవాలు నిర్వహించామని తెలిపారు. ఈ ఏడాది శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేకం ఉత్సవాలకు కొత్త వాహనాలనే వినియోగిస్తామని స్పష్టం చేశారు.



ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలి

• రైతులు అధిక దిగుబడులు సాధించాలి
• కిసాన్ అగ్రి షో ప్రారంభించిన మంత్రి నిరంజన్‌రెడ్డి
• వినూత్న ఆవిష్కరణలు వ్యవసాయ స్వరూపాన్ని మారుస్తున్నాయని వెల్లడి
• విదేశీ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు పండించాలని సూచన



హైటెక్స్‌లో కిసాన్ అగ్రి షోను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ మాదాపూర్: సాగులో నూతన పద్ధతులు, ఈ రంగంలో వినూత్న ఆవిష్కరణలు రైతులకు ఉపయోగకరంగా ఉంటూ వ్యవసాయ రంగ స్వరూపాన్ని మారుస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు. పంటల సాగుకు అనేక రాయితీలను అందిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో కిసాన్ అగ్రి షో–2023ను కిసాన్ ఫోరమ్ ప్రైవేట్ లిమిటెడ్ కన్వీనర్ నిరంజన్ దేశ్‌పాండేతో కలిసి మంత్రి ప్రారంభించారు. నగరంలో ఇంత భారీ స్థాయిలో అగ్రి ఎక్స్‌పో జరగడం ఇదే మొదటిసారని నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఇక్కడ ప్రదర్శిస్తున్న పలు ఆవిష్కరణలను చూస్తుంటే.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ కచ్చితంగా వ్యవసాయ పరిశ్రమల్లో ఒక మార్పు తీసుకురాగలదని అనిపిస్తోందని అన్నారు. వినూత్న ఆవిష్కరణలను, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని అధిక దిగుబడులను పొందాలని రైతులకు సూచించారు. మనకు అవసరమైన పంటలతో పాటు విదేశీ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను పండించాలని కోరారు. దేశంలో పప్పు దినుసులు, వంటనూనెల కొరత నేపథ్యంలో విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడాన్ని ఆయన గుర్తు చేశారు. దేశ, ప్రపంచ అవసరాలకు సరిపడే విధంగా రైతాంగం తమ పంటలను పండించేలా కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టాలని మంత్రి కోరారు.

నూతన సాంకేతికతల వినియోగానికి..

హైదరాబాద్‌లో ఈ తరహా భారీ వ్యవసాయ ప్రదర్శన నిర్వహించడంపై నిరంజన్ దేశ్ పాండే హర్షం వ్యక్తం చేశారు. వ్యవ సాయ రంగంలో నూతన సాంకేతికతల వినియోగానికి ఈ ప్రదర్శన బాట వేయగలదన్నారు. 20కి పైగా అగ్రి స్టార్టప్స్ నూతన సాంకేతికతలను ఇక్కడ ప్రదర్శిస్తున్నాయని తెలిపారు.

ఆకట్టుకుంటున్న స్టాళ్లు..

అగ్రి ఇన్‌పుట్, నీటి నిర్వహణ, పరికరాలు, ఉపకరణాలు, విత్తనాలు, ప్లాంటింగ్ మెటీరియల్‌కు సంబంధించిన స్టాళ్లు ఆకట్టుకుంటున్నాయి. భారీ యంత్రాలు, ఉపకరణాలను ప్రదర్శనకు ఉంచారు. భారతీయ వాతావరణానికి తగినట్లుగా అభివృద్ధి చేసిన ఎన్నో వినూత్న వ్యవసాయ సాంకేతికతలను ప్రదర్శిస్తున్నారు.

160కి పైగా కంపెనీల అనుసంధానం

అగ్రి స్టార్టప్స్ ప్రత్యేక విభాగమైన స్పార్క్, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్), రాష్ట్ర వ్యవసాయ వర్సిటీల క్లస్టర్ జ్ఞాన కేంద్రం సహా పెద్ద సంఖ్యలో ప్రధాన పరిశ్రమలు ఈ షోకు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. మూడురోజుల పాటు కొనసాగే ఈ ఎక్స్‌పోలో 150కి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు. ఈ వేదిక ద్వారా 160కి పైగా కంపెనీలు అనుసంధానం కాగలవని అంచనా. జ్ఞాన కేంద్రం వద్ద రైతులు తెలంగాణకు పనికొచ్చే నూతన సాంకేతికతల గురించిన సమాచారాన్ని తెలుసుకోగలుగుతారని చెప్పారు.

మార్క్‌ఫెడ్‌ను బలోపేతం చేయాలి: మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మార్క్‌ఫెడ్‌ను బలోపేతం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మార్క్‌ఫెడ్ 'నూతన వ్యాపార ప్రతిపాదనలపై' శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ డిమాండ్‌ను బట్టి పత్తి, కందులు, మొక్కజొన్న, మిరపకాయలు, పసుపు పంటల సేకరణకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కందులను పప్పుగా మార్చి మార్కెటింగ్ చేసే అవకాశాలు పరిశీలించాలన్నారు. ఆదిలాబాద్‌లోని మార్క్‌ఫెడ్ సొంత ప్రెస్సింగ్ యూనిట్‌లో పత్తి సేకరణ, పత్తి బేళ్ల మార్పిడికి అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. వేరుశనగ ప్రాసెసింగ్ ప్లాంట్లు, వేరుశనగ ఉత్పత్తులను సిద్ధం చేయడానికి, అధ్యయనం కోసం గుజరాత్ రాష్ట్రాన్ని సందర్శించాలన్నారు. కచ్చితమైన హామీ ప్రాతిపదికన వాణిజ్య సేకరణ ద్వారా అవసరమైన మొక్కజొన్న సరఫరా కోసం ఇతర రాష్ట్రాలతో ఒప్పందం కుదుర్చుకునే అంశాలను పరిశీలించాలని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డితదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలవి దొంగాటలు

• బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ఆలంపూర్‌లో ముస్లింలతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆలంపూర్: ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే బీఆర్ఎస్, బీజేపీ దొంగాటలు ఆడుతున్నాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలో బీఎస్పీ బహుజన రాజ్యాధికార యాత్ర శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆలంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో సంపూర్ణ మెజార్టీ ఉన్నప్పటికీ బీసీ రిజర్వేషన్‌ను 27 నుంచి 50 శాతానికి ఎందుకు పెంచడం లేదని సీఎం కేసీఆర్‌ను నిలదీశారు. బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వానికి వస్తున్న అడ్డంకులేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల గురించి ఎమ్మెల్యేలెవరైనా మాట్లాడితే వారిని ప్రగతిభవన్‌లోకి అడుగు పెట్టనీయరని, అందుకే వారు క్యాంపు కార్యాలయాలకే పరిమితమయ్యారని అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం నేపథ్యంలో ఎమ్మెల్సీ కవితకు మహిళారిజర్వేషన్లు గుర్తుకు వచ్చాయని, అందుకే నిరాహార దీక్ష చేస్తానని అంటున్నారని అన్నారు. తెలంగాణలో 2014 నుంచి 2018 వరకు ఒక్క మహిళామంత్రి లేరని, అప్పుడు ఎందుకు కవితకు నిరాహార దీక్ష ఆలోచన రాలేదని ప్రశ్నించారు. బీఎస్పీ కేవలం మహిళల గురించే కాదు బీసీలు, మైనార్టీ, ఎస్టీల రిజర్వేషన్ల కోసం కూడా పోరాడుతుందన్నారు. రూ.3 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల కోసం ఒక శాతం కంటే తక్కువగా నిధులు కేటాయించడం శోచనీయమని అన్నారు. ముస్లింలపై సానుభూతి వ్యక్తం చేసే పార్టీలు ఎందుకు ఈ విషయం గురించి మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహిళా కన్వీనర్ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలకు పరీక్షలు

• వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి తేదీలను వెల్లడించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్

సాక్షి, హైదరాబాద్: వివిధ శాఖల్లో ఉద్యోగ నియామకాలకు సంబంధించి అర్హత పరీక్షల నిర్వహణ తేదీలను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెల్లడించింది. నోటిఫికేషన్‌లో ప్రకటించిన తేదీలకు అనుగుణంగా పరీక్షలను నిర్వహించనున్నట్టు కమిషన్ స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పశుసంవర్ధక శాఖ పరిధిలో 185 వీఏఎస్(వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్), ఉద్యాన వన శాఖ పరిధిలో 22 హెచ్‌ఓ పోస్టులు, రవాణా శాఖలో 113 ఏఎంవీఐ పోస్టులకు ఈనెల మార్చి, వచ్చే నెల ఏప్రిల్‌లో పరీక్షలు జరగనున్నాయి. వీఏఎస్ ఉద్యోగాలకు రెండ్రోజుల పాటు పరీక్షలు నిర్వహించనుండగా.. హెచ్‌ఓ, ఏఎంవీఐ పోస్టులకు ఒక రోజు ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరుగుతాయి. మరిన్ని వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను చూడాలని టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

పోస్టు	ఖాళీలు	పరీక్ష తేదీ
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(క్లాస్ ఏ అండ్ బీ) (పశు సంవర్ధక శాఖ)	185	15-03-23 (ఉదయం, మధ్యాహ్నం) 16-03-23(ఉదయం)
హార్టికల్చర్ ఆఫీసర్ (ఉద్యానవన శాఖ)	22	04-04-23(ఉదయం, మధ్యాహ్నం)
అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (రవాణా శాఖ)	113	23-04-23(ఉదయం, మధ్యాహ్నం)

వెబ్‌సైట్‌లో గ్రేడ్-1 సూపర్‌వైజర్ మెరిట్ అభ్యర్థుల జాబితా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(గ్రేడ్-1 సూపర్‌వైజర్) ఉద్యోగాలకు సంబంధించి అర్హత పరీక్ష ఆధారంగా మెరిట్ అభ్యర్థుల జాబితాను టీఎస్ పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో ఎంపిక చేసిన తర్వాత ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఎంపిక జాబితా విడుదల చేయనున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది.

ప్రీతి ఘటనపై వివరాలివ్వండి

• కేఎంసీ ప్రిన్సిపాల్‌కు గవర్నర్ లేఖ
• కళాశాలలో ర్యాగింగ్ నిరోధానికి ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలని ఆదేశం

ఎంజీఎం: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ) పీజీ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని గవర్నర్ తమిళిసై కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌దాస్‌ను ఆదేశించారు. ప్రీతి ఆత్మహత్యకు ముందు కేఎంసీ, ఎంజీఎం ఆస్పత్రిలో ఏం జరిగింది? ప్రీతికి కౌన్సెలింగ్ నిర్వహించిన వైద్యులు ఎవరు? ప్రీతి ఆత్మహత్యకు అనస్తీషియా తీసుకోవడమే కారణమా? ఎంజీఎంలో ఎలాంటి వైద్యం అందించారు? ఎవరి సూచన మేరకు ఆమెను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు? అనే అంశాలను కూడా నివేదించాలని ఆదేశించారు. అలాగే, ఐదేళ్ల కాలంలో కళాశాలలో ఏమైనా ర్యాగింగ్ ఘటనలు జరిగాయా? కళాశాలలో ర్యాగింగ్ జరగకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.. లాంటి వివరాలు కూడా ఇవ్వాలని గవర్నర్ లేఖలో పేర్కొన్నారు. గవర్నర్ ఆదేశాల మేరకు అన్ని వివరాలను నివేదిస్తామని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ పేర్కొన్నారు.

ఎంజీఎంలో రెఫరల్ వైద్యమా?

ఉత్తర తెలంగాణ జిల్లాలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో రెఫరల్ వైద్యం పేరుతో హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే విషయంపై గవర్నర్ లేఖలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఆస్పత్రిలో సదుపాయాలు, వైద్యుల కొరత ఉందా? అనే అంశంపైనా ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, బాధితులను హైదరాబాద్‌కు తరలించే విధానంపైనా నివేదిక పంపాలని కోరారు.



క్లుప్తంగా...

ఎస్‌ఎస్‌బీ డీజీగా రశ్మీ శుక్లా



న్యూఢిల్లీ: సరిహద్దు భద్రతా దళం సశస్త్ర సీమా బల్(ఎస్‌ఎస్‌బీ) డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి రశ్మీ శుక్లా(57) నియమితులయ్యారు. 1988 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐపీఎస్ రశ్మీ శుక్లా ప్రస్తుతం సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) అదనపు డీజీగా ఉన్నారు. శుక్లా నియామకానికి కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని సిబ్బంది వ్యవహారాల శాఖ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈమె 2024 జూన్ 30వ తేదీ వరకు విధుల్లో ఉంటారని తెలిపింది. నేపాల్, భూటాన్ సరిహద్దుల భద్రతను ఎస్‌ఎస్‌బీయే చూసుకుంటుంది.

ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వండి

షిల్లాంగ్: మేఘాలయలో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమివ్వాలని నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) చీఫ్, తాజా మాజీ సీఎం కాన్రాడ్ సంగ్మా రాష్ట్ర గవర్నర్ ఫగు చౌహాన్‌ను కోరారు. రాష్ట్ర అసెంబ్లీలోని 60 మంది సభ్యులకు గాను 32 మంది ఎమ్మెల్యేల మద్దతు తనకుందని తెలిపారు. వీరి సంతకాలతో కూడిన లేఖను గవర్నర్‌కు అందజేశామన్నారు. శుక్రవారం ఆయన రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. 'ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్దతు నాకుంది. మద్దతిస్తామని బీజేపీ ఇప్పటికే తెలిపింది. హిల్ స్టేట్ డెమోక్రటిక్ పార్టీ, స్వతంత్రులు కూడా మా వెంట ఉన్నారు' అని చెప్పారు. కొత్త ప్రభుత్వం ఈ నెల 7న ప్రమాణం చేయనుందని, ప్రధాని మోదీ కూడా ఈ కార్యక్రమానికి వస్తారని తెలిపారు. కాగా, ఎన్‌పీపీ యేతర, బీజేపీయేతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామంటూ అంతకుముందు టీఎంసీ, కాంగ్రెస్, యూడీపీ, పీడీఎఫ్‌లు హడావుడి చేశాయి. ఫిబ్రవరి 27వ తేదీన 59 సీట్లకు జరిగిన ఎన్నికల్లో ఎన్‌పీపీ సొంతంగా 26, మిత్రపక్షం యూడీపీ 11 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్, టీఎంసీలు చెరో ఐదు స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ రెండు సీట్లను దక్కించుకుంది.

సోనియా గాంధీకి అస్వస్థత

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా (76) అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం గురువారం ఢిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రిలో చేరారు. సోనియా జ్వరంతో బాధపడుతున్నారని, ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. సోనియాకు అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఆమె ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని వెల్లడించారు.

బీజేపీ పవర్ ప్లే..



భారతీయ జనతా పార్టీ దేశాన్ని చుట్టేస్తోంది. ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రధాని మోదీ ఇమేజ్‌ని పెట్టుబడిగా పెట్టి, డబుల్ ఇంజిన్ నినాదంతో రాష్ట్రాల్లో పాగా వేస్తోంది. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లో గురువారం వెలువడిన ఎన్నికల ఫలితాలు కమలం దళంలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అభివృద్ధి, శాంతి స్థాపన లక్ష్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల్ని ఎదుర్కొని, అధికార వ్యతిరేకతను ఎదురొడ్డి త్రిపుర, నాగాలాండ్‌లో అధికారాన్ని నిలబెట్టుకుంది. మేఘాలయలో కూడా ఒకప్పటి మిత్రపక్షం కాన్రాడ్ సంగ్మాకు చెందిన నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ)కి మద్దతు ఇచ్చి అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు రాష్ట్రాల్లోనూ అధికారంలోకి రావడం ద్వారా 2024లో జరగనున్న లోక్ సభ ఎన్నికలకు బలమైన పునాదులు వేసుకుంటోంది.

నాగాలో శాంతి మంత్రం..

నాగాలాండ్‌లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఉద్యమం చేస్తున్న నాగాలతో శాంతి చర్చలు జరుపుతూ వారి సమస్యను పరిష్కరిస్తామని నచ్చజెప్పడంలో బీజేపీ విజయం సాధించింది. మరోవైపు కాంగ్రెస్, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) పరిమితమైన సీట్లలో పోటీ చేశాయి. 60 అసెంబ్లీ స్థానాల్లో ఎన్‌పీఎఫ్ 22 స్థానాల్లో పోటీ చేస్తే, కాంగ్రెస్ 23 స్థానాల్లో పోటీకే పరిమితమైంది. నాగా సమస్యని ఎన్‌డీపీపీతో కలిసి సమష్టిగా పరిష్కరిస్తామని బీజేపీ ఇచ్చిన హామీలు తిరిగి ఆ కూటమి అధికారాన్ని నిలబెట్టుకునేలా చేశాయి.

అసోం నుంచి త్రిపుర వరకు

- 2016లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అసోం అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి కాంగ్రెస్ 15 ఏళ్ల పరిపాలనకు తెర దించింది.
- 2017లో మణిపూర్‌లో బీజేపీ విజయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ మాజీ సభ్యుడు ఎన్. బైరాన్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు.
- 2018లో త్రిపుర ఎన్నికల్లో బీజేపీ 25ఏళ్ల లెఫ్ట్ పాలనకు తెరదించి అధికారంలోకి వచ్చింది
- అదే ఏడాది బీజేపీ మేఘాలయ, నాగాలాండ్‌లలో ప్రాంతీయ పార్టీలతో చేతులు కలిపి అధికారంలోకి వచ్చింది.
- 2019లో అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 41 స్థానాలను కైవశం చేసుకొని విజయ ఢంకా మోగించింది.
- 2021లో అసోంలో మళ్లీ అధికారాన్ని కాపాడుకుంది.
- 2022లో బీజేపీ మణిపూర్‌లో కూడా తిరిగి అధికారంలోకి వచ్చింది.
- 2023లో త్రిపుర, నాగాలాండ్‌లలో అధికారాన్ని నిలబెట్టుకుంది. మేఘాలయలో కూడా అధికారంలో భాగస్వామ్యం కావడానికి ప్రయత్నాలు మొదలు పెట్టింది.

ఎలా పట్టు సాధించింది ?

ఈశాన్య రాష్ట్రాల్లో అసోం, త్రిపురలో హిందూ జనాభా ఎక్కువ. మిగిలిన రాష్ట్రాల్లో గిరిజనులు, క్రిస్టియన్లదే పట్టు. ఆయా రాష్ట్రాల్లో అత్యధికులు బీఫ్ తింటారు. ఇంగ్లిష్ మాట్లాడతారు. దీంతో ఇతర పార్టీలు బీజేపీ హిందూత్వ, హిందీ ఎజెండాను పదే పదే ఎత్తి చూపుతూ కాషాయ దళాన్ని ఇరుకున పెట్టాలని చూశాయి. అయినప్పటికీ ఈశాన్యంలో కాషాయ జెండా రెపరెపలాడింది. త్రిపుర లో శాంతి స్థాపన, అభివృద్ధికే బీజేపీ మొదట నుంచి ప్రాధాన్యం ఇస్తూ వచ్చింది. మౌలిక సదుపాయాలు, హైవేల నిర్మాణం, సురక్షిత మంచి నీరు, ఉచిత రేషన్, విద్యుత్ సౌకర్యం వంటివన్నీ బీజేపీ వైపు ప్రజలు మొగ్గు చూపడానికి కారణాలే. ఎన్నికలకు కాస్త ముందు ప్రభుత్వ ఉద్యోగులకు 12% డీఏ ప్రకటించి వారిని తమ వైపు తిప్పుకుంది. కేంద్రంలో అధికారంలో ఉండడంతో నాగాలాండ్‌లో కూడా శాంతి చర్చలు చేసి వారి సమస్య పరిష్కారానికి హామీలు ఇచ్చింది. ఎన్‌డీపీపీతో పొత్తుతో అధికారాన్ని మళ్లీ నిలబెట్టుకుంది. కొద్ది రోజుల క్రితం మేఘాలయ బీజేపీ చీఫ్ ఎర్నెస్ట్ మావ్రీ బీఫ్ తినడం రాష్ట్ర ప్రజల జీవనశైలిలో ఒక భాగమంటూ వ్యాఖ్యానించి ఈశాన్య రాష్ట్రాల్లో బీఫ్ తినడాన్ని బీజేపీ అడ్డుకోదన్న సందేశాన్ని ఇచ్చారు. మైనార్టీ వ్యతిరేక పార్టీ అని విపక్షాలు ప్రచారం చేసినప్పటికీ నాగాలాండ్‌లో 15% నుంచి 19 శాతానికి ఓటు షేర్‌ను పెంచుకోగలిగింది. మేఘాలయలో 9% ఓట్లను రాబట్టింది.

అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికల జరగడానికి ఏడాది ముందు ముఖ్యమంత్రుల్ని హఠాత్తుగా మార్చి పరిస్థితుల్ని అనుకూలంగా మార్చుకునే వ్యూహంలో బీజేపీ విజయం సాధిస్తోంది. త్రిపురలో కాంగ్రెస్–లెఫ్ట్ కూటమి, తిప్రా మోథాలను దీటుగా ఎదుర్కొని అధికార వ్యతిరేకతను ఎదురొడ్డడానికి ముఖ్య కారణం నాలుగేళ్ల పాటు సీఎంగా ఉన్న విప్లవ్‌దేవ్‌ను పది నెలల క్రితం మార్చడమే. ఆయన స్థానంలో మిస్టర్ క్లీన్‌గా పేరున్న

పక్కా వ్యూహంతో సీఎంల మార్పు

మాణిక్ సాహాను సీఎంను చేయడంతో అధికార వ్యతిరేకత తుడిచిపెట్టుకుపోయింది. గతంలో ఉత్తరాఖండ్‌లో ఇద్దరు సీఎంలను, గుజరాత్‌లో సీఎంను మార్చి నెగ్గింది. హిమాచల్‌లోనూ సీఎంను మార్చాలని ఎన్నో గళాలు వినిపించినా జైరామ్ ఠాకూర్‌నే కొనసాగించి ఈ ఏడాది మొదట్లో జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలైంది. చిన్న నియోజకవర్గాలున్న త్రిపురలో అభివృద్ధిని చేసి చూపించడంతో పాటు సీఎంను మార్చడం కూడా బీజేపీకి కలిసి వచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మోదీ ఈశాన్య రాష్ట్రాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండటం కూడా ఒక కారణం.

వాజ్‌పేయి హయాంలోనే అభివృద్ధికి బీజం

- 2016లో అసోంతో మొదలైన బీజేపీ జైత్రయాత్ర 2023 వచ్చినా ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కోసం వాజ్‌పేయి హయాంలో తొలి బీజం పడింది. కేంద్రంలో మంత్రులతో కమిటీని కూడా ఏర్పాటు చేసి కొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అప్పుడు మొదలైన అభివృద్ధి పథం 2014లో నరేంద్ర మోదీ ప్రధాని మంత్రి అయ్యాక పరుగులు తీసింది. అభివృద్ధి కంటికి కనిపించేలా సాగింది.ప్రజల్లో మంచి పట్టు ఉన్న కాంగ్రెస్ నాయకుడు హిమాంత బిశ్వ శర్మ 2015లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి రావడంతో ఈశాన్య రాష్ట్రాల్లో కమలదళానికి పట్టు పెరిగింది. ప్రస్తుతం అసోం ముఖ్యమంత్రి అయిన శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటైన నార్త్ ఈస్ట్ డెమొక్రాటిక్ అలయెన్స్(ఎన్‌డీపీఏ)తో కాంగ్రెస్‌ను వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలన్నీ జత కట్టాయి. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు నుంచే బిశ్వ శర్మ మూడు రాష్ట్రాల్లోనూ విస్తృతంగా పర్యటిస్తూ తమకు అనుకూలంగా ఉండే చిన్న పార్టీలను ఎన్‌డీపీఏ గూటికి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. డబుల్ ఇంజిన్ నినాదంతో బీజేపీ తనకు అనుకూలంగా ఉండే ప్రాంతీయ పార్టీలను కలుపుకొని పోతూ ఒక్కో రాష్ట్రంలో అధికారాన్ని కొల్లగొడుతూ వచ్చింది. ఎన్. బైరాన్ సింగ్, ప్రేమ ఖాండూ వంటి నాయకులు కాంగ్రెస్‌ను వీడడంతో ఆ పార్టీ ఉనికి కూడా కోల్పోసాగింది. ఎన్‌డీపీఏ కంటే ముందే ఆరెస్సెస్ ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజన తండాల్లో పని చేస్తూ పట్టు పెంచుకోవడం బీజేపీకి కలిసి వచ్చింది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

కొత్త శిఖరాలకు మన పర్యాటకం

- కావాల్సిందల్లా విభిన్న ఆలోచనలు, దీర్ఘకాలిక విజన్
- మారుమూల పల్లెలకూ పర్యాటక పటంలో చోటు
- దేశంలో టూరిజం అభివృద్ధికి ఎన్నెన్నో అవకాశాలు
- వెబినార్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ: విభిన్నంగా ఆలోచించడం, దీర్ఘకాలిక దార్శనికత(విజన్) మన పర్యాటక రంగాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ రంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని వ్యాఖ్యానించారు. మన దేశంలోని మారుమూల గ్రామాలు సైతం ఇప్పుడు పర్యాటక పటంలో కొత్తగా చోటు సంపాదించుకుంటున్నాయని హర్షం వ్యక్తం చేశారు. 'మిషన్ మోడ్‌లో పర్యాటకాభివృద్ధి' పేరిట శుక్రవారం నిర్వహించిన వెబినార్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. భారత భాషల్లో, ఐక్యరాజ్యసమితి గుర్తించిన భాషల్లో మన పర్యాటక ప్రాంతాల సమాచారాన్ని అందించేలా అప్లికేషన్లు(యాప్‌లు) తయారు చేయాలని సూచించారు. టూరిస్ట్ సైట్ల వద్ద బహుళ భాషల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

కలిసి పనిచేస్తే అనుకున్నది సాధ్యమే

'నూతన పని సంస్కృతి'తో మన దేశం ముందుకు సాగుతోందని నరేంద్ర మోదీ వివరించారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌కు ప్రజల నుంచి మంచి ప్రశంసలు దక్కాయని అన్నారు. బడ్జెట్ అనంతరం వెబినార్లు నిర్వహించడం గతంలో ఎప్పుడూ జరగలేదని గుర్తుచేశారు. ఆ ప్రక్రియకు ఈ ఏడాదే శ్రీకారం చుట్టామని చెప్పారు. బడ్జెట్‌కు ముందు, బడ్జెట్ తర్వాత కూడా ప్రజలందరినీ ఇందులో భాగస్వాములను చేస్తున్నామని, వారితో కలిసి పనిచేసేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. వెబినార్లలో ప్రజల నుంచి ఎన్నో సలహాలు సూచనలు అందుతున్నాయని తెలిపారు. అందరం చేతులు కలిపి పనిచేస్తే అనుకున్న ఫలితాలు సాధించడం కష్టమేమీ కాదని సూచించారు. మన పర్యాటకాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చాలంటే దీర్ఘకాలిక ప్రణాళికతో పని చేయాలన్నారు. కోస్టల్ టూరిజం, బీచ్ టూరిజం, మాంగ్రూవ్ టూరిజం, హిమాలయన్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం, వైల్డ్‌లైఫ్ టూరిజం, ఎకో–టూరిజం, హెరిటేజ్ టూరిజం, ఆధ్యాత్మిక టూరిజం, వెడ్డింగ్ డెస్టినేషన్స్, స్పోర్ట్స్ టూరిజం అభివృద్ధికి మన దేశంలో ఎన్నెన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

యాత్రలతో దేశ ఐక్యత బలోపేతం

మతపరమైన చరిత్రాత్మక ప్రాంతాలు, కట్టడాలకు సరికొత్త హంగులు అద్ది, పర్యాటకులకు అమితంగా ఆకర్షించవచ్చని ప్రధానమంత్రి వెల్లడించారు. వారణాసిలో కాశీ విశ్వనాథ్ ధామ్‌ను బ్రహ్మాండంగా తీర్చిదిద్దామని అన్నారు. గతంలో ఏడాదికి 80 లక్షల మంది పర్యాటకులు వారణాసికి వచ్చేవారని, గత ఏడాది 7 కోట్ల మందికిపైగా వచ్చారని తెలిపారు. పునర్నిర్మాణానికి ముందు కేదార్‌నాథ్‌కు ఏటా 5 లక్షల మంది వచ్చారని, ఇప్పుడు 15 లక్షల మంది సందర్శిస్తున్నారని పేర్కొన్నారు. టూరిజం అనేది సంపన్నులకు మాత్రమేనన్న అభిప్రాయం కొందరిలో ఉందని, అది సరైంది కాదని మోదీ చెప్పారు. మన దేశంలో యాత్రలు చేయడం సంప్రదాయంగా కొనసాగుతోందన్నారు. చార్‌ధామ్ యాత్ర, ద్వాదశ జ్యోతిర్లింగ యాత్ర, 51 శక్తిపీఠాల యాత్రను ప్రధాని ప్రస్తావించారు.

లోటుపాట్లు సవరించుకోవాలి

విదేశీ యాత్రికులు భారత్‌కు క్యూ కడుతున్నారని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు. వారు మన దేశంలో సగటున 1,700 డాలర్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. అమెరికాలో విదేశీ యాత్రికుల సగటు వ్యయం 2,500 డాలర్లుగా, ఆస్ట్రేలియాలో 5,000 డాలర్లుగా ఉందన్నారు. అధికంగా ఖర్చు చేయడానికి సిద్ధపడే విదేశీయులకు మన దేశంలోని వసతులను పరిచయం చేయాలన్నారు. భారత్ అనగానే గుర్తొచ్చేలా కనీసం 50 పర్యాటక ప్రాంతాలను అద్భుతంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ రంగంలో లోటుపాట్లను సరిదిద్దుకోవాలని చెప్పారు.

ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి భారత్‌తో కలిసి పని చేస్తాం

వాషింగ్టన్: జీ20 సదస్సు ఆతిథ్య దేశంగా భారత్ ప్రత్యేకమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అమెరికా అభిప్రాయపడింది. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించడానికి రష్యాతో తనకున్న చిరకాల సత్సంబంధాలను భారత్ వినియోగించుకోవాలని చెప్పింది. ఈ సంక్షోభాన్ని వీలైనంత త్వరగా ముగించడానికి తాము కూడా సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. జీ20 విదేశాంగ శాఖ మంత్రుల సమావేశం ఉక్రెయిన్ యుద్ధంపై ఏకాభిప్రాయానికి రావడంలో విఫలమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి నెడ్ ప్రైస్ విలేకరులతో మాట్లాడుతూ జీ20 సదస్సు ప్రారంభమయ్యే లోపు ఉక్రెయిన్ యుద్ధంపై ఒక పరిష్కార మార్గం దొరుకుతుందని ఆశిస్తున్నట్టుగా తెలిపారు. ఇందుకోసం విదేశాంగ మంత్రుల సమావేశంలో భారత్ ఒక దారి చూపించిందని ఈ ఏడాది కాలంలో ఇంకా చేయాల్సింది చాలా ఉందని అన్నారు.

నోట్ల కట్టలు.. గుట్టలు గుట్టలు..



కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే కుమారుడి అవినీతి బాగోతం


బెంగళూరు: ఒక కాంట్రాక్టర్ నుంచి రూ. 40 లక్షలు లంచం తీసుకుంటూ లోకాయుక్తకు అడ్డంగా దొరికిపోయారు బీజేపీ ఎమ్మెల్యే కె.మాడాళ్ విరూపాక్షప్ప కుమారుడు ప్రశాంత్. లోకాయుక్త అధికారులు జరిపిన సోదాల్లో అతని ఇంట్లో గుట్టలుగా నోట్ల కట్టలు లభ్యమయ్యాయి. రూ.6 కోట్లకు పైగా స్వాధీనం చేసుకున్నట్టు శుక్రవారం అధికారులు వెల్లడించారు. కర్ణాటకలోని దావణగెరె జిల్లా చెన్నగిరి ఎమ్మెల్యే మాడాళు విరూపక్షప్ప కుమారుడు ప్రశాంత్ బెంగళూరు నీటి సరఫరా, మురుగు నీటి బోర్డుకు చీఫ్ అకౌంటెంట్‌గా ఉన్నారు. మైసూర్ శాండల్ సబ్బులు తయారు చేసే ప్రభుత్వ అధీనంలోని కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ (కేఎస్‌డీఏల్)కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తన తండ్రి విరూపాక్షప్ప కార్యాలయంలోనే ఒక కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ గురువారం సాయంత్రం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అక్కడికక్కడే ప్రశాంత్‌ను అరెస్ట్ చేసిన అధికారులు మూడు సంచుల్లో రూ1.7 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రశాంత్ నివాసంలో జరిపిన సోదాల్లో రూ.6 కోట్లకు పైగానగదును స్వాధీనం చేసుకున్నారు. ముడివస్తువుల కొనుగోలు టెండర్ ఇప్పిస్తామని చెప్పి తన తండ్రి తరఫున లంచంలో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ తీసుకుంటూ ఉండగా ప్రశాంత్‌ని అదుపులోకి తీసుకున్నట్టుగా లోకాయుక్త అధికారులు చెబుతున్నారు. ఎఫ్ఐఆర్‌లో కూడా నిందితుల్లో నంబర్ వన్‌గా ఎమ్మెల్యే విరూపాక్షప్ప పేరుని, ప్రశాంత్‌ని నంబర్ 2గా చేర్చారు. కర్ణాటక అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార బీజేపీ ఎమ్మెల్యే కుమారుడి లంచాల బాగోతం ఆ పార్టీని ఇరుకున పడేసింది. బీజేపీ ప్రభుత్వం 40% కమీషన్ తీసుకుంటోందని తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని, ఈ ఘటనే దీనికి నిలువెత్తు నిదర్శనమని పీసీసీ అధ్యక్షుడు డి.కె. శివకుమార్ అన్నారు.

కేఎస్‌డీఎల్ చైర్మన్‌గా రాజీనామా

ఈ పరిణామాల మధ్య విరూపాక్షప్ప కేఎస్‌డీఎల్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైకి రాసిన రాజీనామా లేఖలో లోకాయుక్త దాడులతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తనపై వచ్చిన ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తున్నట్టుగా ఆ లేఖలో స్పష్టం చేశారు. మరోవైపు పోలీసులకు దొరక్కుండా వెళ్లిపోయిన ఎమ్మెల్యే విరూపాక్షప్ప ముందస్తు బెయిల్‌కి దరఖాస్తు చేసుకున్నారు.

మంచు తుపానులో కాలిఫోర్నియా విలవిల

టోర్నడోల తాకిడితో టెక్సాస్, లూసియానాల్లో చీకట్లు



కాలిఫోర్నియాలో ఓ ఇంటి చుట్టూ గుట్టలుగా పేరుకుపోయిన మంచు

లాస్‌ఏంజెలిస్/డాలస్: అమెరికాలోని కాలిఫోర్నియాను వారం రోజులుగా భారీ మంచు తుపాను వణికిస్తోంది. కాలిఫోర్నియా, ఒరెగాన్‌లలో ఈ శతాబ్దంలోనే అత్యధికంగా ఏడడుగుల మేర మంచుకురిసింది. కొన్ని రిసార్టు ప్రాంతాల్లో 10 అడుగుల మేర మంచు పేరుకుపోయిందన్నారు. అనూహ్య మంచు తుపానుతో కాలిఫోర్నియాలోని శాన్ బెర్నార్డినో కొండ ప్రాంతాల్లో ప్రజలు అత్యవసరాలు, ఆహారం, మందులు, పాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ మంచుమయం కావడంతో బయటకు వచ్చే వీలులేకపోయింది. కొండప్రాంతాల నివాసితులు రోడ్లపైకి రావొద్దని హెచ్చరించారు. ఇళ్లు, వాహనాలు మంచు గుట్టల మధ్య కూరుకుపోయాయి. రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. రెండిళ్లలో పేలుళ్లు సంభవించినట్లు, మంచు భారంతో ఇళ్లపైకప్పులు కూలినట్లు, కొన్ని ఇళ్లలో గ్యాస్ లీకేజీ జరిగినట్లు సమాచారం ఉందని సిబ్బంది తెలిపారు. అత్యవసర వైద్య సాయం అవసరమైన వారిని రెడ్‌క్రాస్ షెల్టర్‌కు తరలించారు. కరెంటు తీగలు తెగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నెవాడా సరిహద్దుల్లో ఉన్న సాక్రమెంటో, లేక్ టహో ప్రాంతాల్లో మంచుతుపాను శనివారం మరింత తీవ్ర మవుతుందని నిపుణులు హెచ్చరించారు. కాలిఫోర్నియాలోని 13 కౌంటీల్లో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. అయితే, మంచు తుపాను కారణంగా కాలిఫోర్నియా ప్రాంతంలో దుర్భిక్ష పరిస్థితులు తొలిగినట్లేనని అధికారులు చెప్పారు.

పెనుగాలుల విధ్వంసం

టోర్నడో తుపాను దెబ్బకు టెక్సాస్, లూసియానాల్లో అంధకారం అలుముకుంది. టెక్సాస్‌లోని డాలస్, ఫోర్ట్ వర్త్ చుట్టుపక్కల ప్రాంతాల్లో గంటకు 145 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. ప్రజలు ఇళ్లు వదిలి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. డాలస్‌లో భారీగా చెట్లు నేలకూలాయి. వాహనాలు పల్టీలు కొట్టాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయని పోలీసులు తెలిపారు. డాలస్–ఫోర్ట్‌వర్త్, డాలస్ లవ్ ఫీల్డ్ విమానాశ్రయాల్లో 400 విమానాలు రద్దయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో టెక్సాస్‌లోని సుమారు 3.40 లక్షల వినియోగదారులు గురువారం రాత్రి చీకట్లోనే గడిపారు. వాతావరణ విభాగం హెచ్చరికలతో డాలస్, ఫోర్ట్‌వర్త్ తదితర ప్రాంతాల్లో విద్యాసంస్థలను మూసివేశారు.

రణక్షేత్రంలో క్రీడా సరదా

గల్వాన్ లోయలో క్రికెట్ ఆడిన భారత జవాన్లు



న్యూఢిల్లీ: 2020 జూన్ 15. తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయ. భారత్, చైనా సరిహద్దులోని పెట్రోలింగ్ పాయింట్(పీపీ)–14. సరిగ్గా అక్కడే ఇరు దేశాల సైనికుల నడుమ భీకర స్థాయిలో ఘర్షణ జరిగింది. పదునైన ఆయుధాలతో చైనా జవాన్లు దాడి చేయగా, దెబ్బకు దెబ్బ అన్నట్లుగా భారత సైనికులు దీటుగా బదులిచ్చారు. ఈ కొట్లాటలో తమ జవాన్లు ఎంతమంది బలయ్యారో చైనా ప్రభుత్వం ఇప్పటికీ బయటపెట్టలేదు. 40 మందికిపైగానే చనిపోయి ఉంటారని అంచనా. భారత్ వైపు నుంచి దాదాపు 20 మంది చనిపోయారు. రణక్షేత్రంగా రక్తంతో తడిసిపోయిన పీపీ–14 ఇప్పుడు క్రికెట్ మైదానంగా మారింది. పటియాలా బ్రిగేడ్‌కు చెందిన త్రిశూల్ డివిజన్ క్రికెట్ పోటీ నిర్వహించింది. సైనికులు సరదాగా క్రికెట్ ఆడారు. పీపీ–14కు కేవలం 4 కిలోమీటర్ల దూరంలో ఈ పోటీ జరిగింది. జవాన్లు క్రికెట్ ఆడుతున్న ఫొటోలను భారత సైన్యం శుక్రవారం ట్విట్టర్‌లో పోస్టు చేసింది. గడ్డ కట్టించే తీవ్రమైన చలిలో పూర్తి ఉత్సాహంతో ఈ పోటీ జరిగిందని వెల్లడించింది. అసాధ్యాన్ని సుసాధ్యం చేశామని ఉద్ఘాటించింది. జీ20 విదేశాంగ మంత్రుల సదస్సు సందర్భంగా గురువారం ఢిల్లీలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్ పరస్పరం కరచాలనం చేసుకున్నారు. ఆ మరుసటి రోజే గల్వాన్‌లో భారత సైనికులు క్రికెట్ పోటీ నిర్వహించుకోవడం విశేషం.

ఉగ్రవాదంపై 'క్వాడ్' కార్యాచరణ బృందం

న్యూఢిల్లీ: ఆధునిక యుగంలో కొత్త రూపు సంతరించుకుంటున్న ఉగ్రవాదాన్ని, హింసాత్మక తీవ్రవాదాన్ని కఠినంగా అణచివేయడానికి చేపట్టాల్సిన చర్యల కోసం 'వర్కింగ్ గ్రూప్ ఆఫ్ కౌంటర్–టెర్రరిజం' ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు 'క్వాడ్' దేశాల విదేశాంగ మంత్రులు ప్రకటించారు. 'క్వాడ్' కూటమిలో భాగమైన భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రులు ఎస్.జైశంకర్, ఆంటోనీ బ్లింకెన్, యోషిమస హయషీ, పెన్నీ వాంగ్ శుక్రవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ప్రపంచమంతటా ఉగ్రవాద భూతం విస్తరిస్తుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్ర మూకల ఆటకట్టించడానికి నాలుగు దేశాల కార్యాచరణ బృందం ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ వాణిజ్యానికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. చట్టబద్ధ పాలన, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, శాంతియుతంగా వివాదాల పరిష్కారానికి మద్దతు కొనసాగుతుందని తేల్చిచెప్పారు. జీ7 కూటమికి జపాన్, జీ20 కూటమికి భారత్ సారథ్యం వహిస్తుండడంతోపాటు ఈ ఏడాది ఆసియా–పసిఫిక్ ఎకనామిక్ కో–ఆపరేషన్(ఏపీఈసీ)కి అమెరికా ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో 'క్వాడ్' అజెండా అమలు కోసం సన్నిహితంగా కలిసి పనిచేయాలని తీర్మానించుకున్నట్లు వివరించారు. అనంతరం క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రులు ఢిల్లీలో 'రైజినా డైలాగ్'లో పాల్గొన్నారు.

భారత ప్రజాస్వామ్యంపై దాడి

- నాతోపాటు విపక్ష నాయకులపై 'పెగాసస్'తో నిఘా
- పార్లమెంట్, మీడియా, న్యాయ వ్యవస్థపై నిర్బంధం
- కేంబ్రిడ్జి యూనివర్సిటీలో రాహుల్ గాంధీ
- విదేశీ గడ్డపై దేశ ప్రతిష్టను దెబ్బతీయడం దారుణం
- రాహుల్‌పై బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ మండిపాటు



లండన్/న్యూఢిల్లీ: భారతదేశంలో ప్రజాస్వామ్యం దాడికి గురవుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో తనతోపాటు పలువురు రాజకీయ నాయకులు నిఘా నీడలో ఉంటున్నారని చెప్పారు. యూకేలోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ జడ్జి బిజినెస్ స్కూల్ 'విజిటింగ్ ఫెలో' అయిన రాహుల్ గాంధీ గురువారం సాయంత్రం వర్సిటీలో 'లెర్నింగ్ టు లిజనింగ్ ఇన్ ద 21 సెంచరీ' పేరిట నిర్వహించిన సదస్సులో ప్రసంగించారు. రాహుల్ ప్రసంగం వీడియోను కాంగ్రెస్ నాయకుడు శామ్ పిట్రోడా ట్విట్టర్‌లో షేర్ చేశారు. రాహుల్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ స్పైవేర్‌తో ప్రతిపక్ష నేతలపై ప్రభుత్వం నిఘా పెడుతోందని మండిపడ్డారు. తనతోపాటు చాలామంది నాయకుల ఫోన్లలో ఈ స్పైవేర్‌ను ఇన్‌స్టాల్ చేశారని ఆరోపించారు. నిఘా విభాగం అధికారులు ఈ విషయం స్వయంగా తనతో చెప్పారని గుర్తుచేసుకున్నారు. ఫోన్లలో మాట్లాడేదంతా రికార్డు చేస్తున్నామని, అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారని అన్నారు. ప్రతిపక్ష నాయకులపై ప్రభుత్వం నుంచి తీవ్రమైన ఒత్తిడి ఉందని దుయ్యబట్టారు.

ప్రశ్నిస్తే గొంతు నులిమేస్తున్నారు

భారత్‌లో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని, ఇందులో ఐదు కీలక అంశాలు ఉన్నాయని రాహుల్ గాంధీ వెల్లడించారు. అవి.. మీడియా, న్యాయ వ్యవస్థను చెరబట్టడం, నచ్చని వారిపై నిఘా పెట్టడం, బెదిరింపులకు గురిచేయడం, చట్టాలను అమలు చేయాల్సిన సంస్థల ద్వారా ప్రత్యర్థులను అణచివేయడం, మైనార్టీలు, దళితులు, గిరిజనులకు దాడులు, అసమ్మతి తెలియజేస్తే గొంతులు నొక్కేయడం. భారత ప్రజాస్వామ్యం దాడికి గురవుతోందన్న నిజం ప్రతి ఒక్కరికీ తెలుసని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్దేశించిన పార్లమెంట్, స్వేచ్ఛాయుత మీడియా, న్యాయ వ్యవస్థపై ఇప్పుడు నిర్బంధం కొనసాగుతోందని ఆరోపించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ మూల నిర్మాణాన్ని దెబ్బతీస్తున్నారని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ప్రశ్నిస్తే గొంతు నులిమేస్తున్నారని మోదీ సర్కారుపై నిప్పులు చెరిగారు.

దేశంపై విషం చిమ్మడమే రాహుల్ పని: అనురాగ్ ఠాకూర్

కేంబ్రిడ్జి వర్సిటీలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశీ గడ్డపై దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడడం ఏమిటని నిలదీశారు. రాహుల్‌తోపాటు విపక్ష నేతల ఫోన్లలో పెగాసస్ స్పైవేర్ నిజంగా ఉంటే.. సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీకి పరీక్ష కోసం ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీపై రాహుల్ గాంధీకి ఉన్న విద్వేషాన్ని అర్థం చేసుకోగలమని.. కానీ, దేశ ప్రతిష్టకు మరకలు అంటించేలా మాట్లాడడం దారుణమన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుండడంతో రాహుల్ గాంధీకి దిక్కుతోచడం లేదని, అందుకే విదేశాలకు వెళ్లి మన దేశంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు.

దేశ విభజనతో విడిపోయిన కుటుంబాన్ని.. 75 ఏళ్లకు ఫేస్‌బుక్ ఒక్కటి చేసింది..!

లాహోర్: 1947లో దేశ విభజనతో వేరు పడిన ఇద్దరు సిక్కు సోదరుల కుటుంబాలు 75 ఏళ్ల తర్వాత సోషల్ మీడియా సాయంతో ఎట్టకేలకు కలుసుకున్నాయి. కర్తార్‌పూర్ కారిడార్ వద్ద వీరి కుటుంబసభ్యులు ఆనందంతో పాటలు పాడుతూ ఒకరిపై ఒకరు పూలు చల్లుకున్నారు. గురువారం గురుదేవ్ సింగ్, దయాసింగ్ కుటుంబాల కలయికతో గురుద్వారా దర్బార్ సాహిబ్, కర్తార్‌పూర్ సాహిబ్‌ల వద్ద ఉద్విగ్నపూరిత వాతావరణం ఏర్పడింది. హరియాణా రాష్ట్రం మహేంద్రగఢ్ జిల్లా గోమ్లా గ్రామానికి చెందిన ఈ సోదరులు తమ తండ్రి స్నేహితుడైన కరీం బక్ష్‌తో కలిసి నివసించేవారు. దేశ విభజనతో కరీం బక్ష్ వీరిలో గురుదేవ్‌ను తన వెంట పాకిస్తాన్‌కు తీసుకెళ్లగా గోమ్లాలోనే మేనమామ వద్దే దయాసింగ్ ఉండిపోయారు. పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ ఝూంగ్ జిల్లాలో నివాసం ఏర్పరుచుకున్న కరీంబక్ష్ గురుదేవ్ పేరును గులాం మహ్మద్‌గా మార్చాడు. గురుదేవ్ కొన్నేళ్ల క్రితం చనిపోయారు. తన సోదరుడు దయాసింగ్ ఎక్కడున్నారో జాడ తెలపాలంటూ గురుదేవ్ భారత ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాశారని ఆయన కొడుకు మహ్మద్ షరీఫ్ తెలిపారు. ఎట్టకేలకు ఫేస్‌బుక్ ద్వారా ఆరు నెలల క్రితం తమ అంకుల్ దయాసింగ్ జాడ కనుక్కోగలిగామన్నారు. కర్తార్‌పూర్ సాహిబ్ వద్ద ఇరువురు కుటుంబాలు కలుసుకోవాలని నిశ్చయించుకున్నట్లు చెప్పారు. వీసా మంజూరు చేసి హరియాణాలోని తమ పూర్వీకుల నివాసాన్ని చూసుకునే అవకాశం కల్పించాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు కిలోమీటర్ల పొడవైన కర్తార్‌పూర్ కారిడార్‌తో భారతీయ సిక్కు యాత్రికులు పాక్ వైపు ఉన్న పవిత్ర దర్బార్ సాహిబ్ గురుద్వారాను వీసాతో అవసరం లేకుండా దర్శించుకునే అవకాశం ఉంది. కాగా, సోషల్ మీడియా సాయంతో భారత్, పాక్‌ల్లో ఉంటున్న సిద్దిక్(80), హబీబ్(78) అనే సోదరులు కూడా గత ఏడాది జనవరిలో కర్తార్‌పూర్ కారిడార్‌లో కలుసుకున్న విషయం తెలిసిందే.

'రెరా' చైర్‌పర్సన్‌గా సీఎస్ శాంతికుమారి


శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్‌పర్సన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇదివరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్‌కుమార్ కూడా రెరా చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే ఆయన్ను జనవరి 12న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కేటాయింపు సబబేనని, అక్కడకు వెళ్లిపోవాలని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో.. రెరా చైర్మన్ పదవి ఖాళీ అయింది. రెరా చైర్మన్‌తో పాటు సభ్యుల నియామకం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా జారీచేసింది. చైర్మన్, సభ్యుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 3 (శుక్రవారం)తో గడువు ముగిసింది. ఇప్పటికే పలువురు మాజీ సీఎస్‌లు, రిటైర్డ్ ఐఏఎస్‌లు, టౌన్‌ప్లానింగ్‌లో విశేష అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ ఎంపిక ప్రక్రియ ఓ కొలిక్కి రావడానికి కనీసం నెలరోజులు పడుతుందని భావిస్తున్నారు. కొత్త వారిని నియమించే ప్రక్రియ పూర్తయ్యే వరకు రెరా చైర్‌పర్సన్‌గా సీఎస్ శాంతికుమారిని నియమిస్తూ పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

గుండెపోటుతో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

కండ్లకోయ సీఎంఆర్ కాలేజీలో విషాదం



మేడ్చల్: వయసుతో పనిలేకుండా ప్రాణాలు తీస్తున్న గుండెపోటు 18 ఏళ్ల విద్యార్థిని బలిగొంది. రాష్ట్రంలో వరుసగా గుండెపోటుతో మరణిస్తున్న వారి జాబితాలో సచిన్ అనే విద్యార్థి చేరాడు. రాజస్తాన్‌కు చెందిన సచిన్ హైదరాబాద్ శివార్లలోని సుచిత్రలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతడు కండ్లకోయలోని సీఎంఆర్ 4 క్యాంపస్‌లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం కళాశాలకు వచ్చిన సచిన్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో తరగతి గది నుంచి బయటకు వచ్చి భవనం ఆవరణలో ఉండగా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. తనకు ఛాతీలో నొప్పి వస్తోందంటూ స్నేహితులకు చెబుతూనే అక్కడే కూలిపోయాడు. స్నేహితులు వెంటనే పక్కనే ఉన్న సీఎంఆర్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే సచిన్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సచిన్ మృతదేహాన్ని కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు అప్పగించింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని సీఐ రాజశేఖర్‌రెడ్డి చెప్పారు.

కనిపించని 'జీవా'

- ఆర్టీసీ సొంత నీటి బ్రాండ్ ఏమైంది? ● అట్టహాసంగా నెలన్నర క్రితం ప్రారంభం
- ప్రస్తుతం బస్టాండ్లు, బస్సులు, ఆర్టీసీ కార్యాలయాల్లో ప్రైవేటు బ్రాండ్ నీళ్లే వినియోగం



సాక్షి, హైదరాబాద్: బ్రాండెడ్ మంచినీటి సీసాల వినియోగంతో సాలీనా రూ.కోట్లలో అవుతున్న వ్యయాన్ని నియంత్రించడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందే ఉద్దేశంతో ఎంతో ఘనంగా ప్రారంభించిన ఆర్టీసీ సొంత నీటి బ్రాండ్ ఎక్కడా కానరావడం లేదు. జీవా బ్రాండ్‌ను ఆర్టీసీ నెలన్నర క్రితం ఎంతో అట్టహాసంగా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎంజీబీఎస్‌లో కార్పొరేట్ పద్ధతిలో ఆ బ్రాండ్‌ను రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. దాదాపు ఆరు నెలలు శ్రమించి రెండు సంస్థలతో ఒప్పందం చేసుకుని ఈ నీటిని మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు ఆర్టీసీ కృషి చేసింది. కానీ ఇప్పటివరకు ఇటు బస్టాండ్‌లలో కాని, ఆర్టీసీ బస్సుల్లో కానీ ఎక్కడా అది కనిపించటం లేదు. ఇప్పటికీ ప్రైవేటు బ్రాండెడ్ నీటినే వినియోగిస్తున్నారు. భారీగా వ్యయం చేయటంతోపాటు ప్రసార మాధ్యమాల ద్వారా ముమ్మరంగా ప్రచారం జరిగి ప్రజల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొన్న తర్వాత ఆ బ్రాండ్ కనిపించకపోవటం విశేషం.

- కేవలం బస్టాండ్లలోని దుకాణాల్లోనే కాకుండా క్రమంగా, మార్కెట్‌లోని ఇతర దుకాణాల్లో కూడా అందుబాటులోకి తెచ్చేలా చూడాలని నిర్ణయించారు. కానీ మార్కెట్‌లోని దుకాణాల్లో కాదు కదా కనీసం ఆర్టీసీ బస్సుల్లో కూడా అవి కనిపించడం లేదు. ఇక ఆర్టీసీ ప్రధాన కార్యాలయం బస్‌భవన్‌లో అధికారులకు కూడా అవి అందుబాటులో లేకుండా పోయాయి.

బస్సులు, ఆర్టీసీ కార్యాలయాల్లో ప్రైవేట్ బ్రాండ్ నీళ్లే..

ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు ఉచితంగా 500 మి.లీ. వాటర్ బాటిళ్లను అందిస్తారు. ఆర్టీసీ సొంతంగా జీవా పేరుతో నీటిని మార్కెట్‌లోకి తీసుకురావటంతో, ఇక బస్సుల్లో అవే నీళ్ల పంపిణీ జరుగుతాయని ప్రచారం చేసింది. కానీ తాజాగా బస్సుల్లో పంపిణీకి ఓ బడా బ్రాండెడ్ నీటి సీసాలు పెద్ద ఎత్తున డిపోలకు చేరాయి. ఇంతకాలం స్థానికంగా తయారయ్యే ఓ బ్రాండ్ సీసాలు పంపిణీ జరుగుతుండగా, తాజాగా ఓ అంతర్జాతీయ కంపెనీకి చెందిన బ్రాండ్ సీసాలు డిపోలకు చేరాయి. ప్రైవేటు బ్రాండెడ్ కంపెనీ నుంచి నీటి సీసాల కొనుగోలుకు సాలీనా రూ.5 కోట్ల వరకు ఖర్చవుతున్నట్టు సమాచారం.

డిమాండ్ ఉన్నా కానరావడం లేదు..

- ప్రకాశం, కాంతి అన్న అర్థంలో వినియోగించే జీవా (జెడ్ఐవీఏ) అన్న హిబ్రూ భాష నుంచి పుట్టిన పేరును ఖరారు చేసిన ఆర్టీసీ ఆ నీటి సీసాల డిజైన్‌లో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఇప్పటి వరకు ఏ కంపెనీ వినియోగించని రీతిలో డైమర్ కటింగ్స్ డిజైన్ ఉన్న సీసా ఆకృతిని ఎంపిక చేసింది. చూడగానే ఆకట్టుకునేలా ఉన్నందున, ఆర్టీసీ బ్రాండ్ తోడు కావటంతో సాధారణ ప్రజలు కూడా దాని మన్నికపై నమ్మకంతో కొనే అవకాశం ఏర్పడుతుందని దీంతో ఈ నీటి విక్రయాల ద్వారా సాలీనా రూ.20 కోట్ల ఆదాయం పొందే వీలుందని ఆర్టీసీ అంచనా వేసింది. ప్రస్తుతం వేసవి ప్రారంభం కావటంతో వాటర్ బాటిళ్ల విక్రయం ఊపందుకుంది. ఆర్టీసీ ప్రయాణికులు బస్టాండ్లలో నీటి సీసాలు కొని బస్సెక్కుతున్నారు. ఇలా మంచి డిమాండ్ ఉన్న సమయంలో కూడా ఆర్టీసీ నీళ్లు కనిపించడం లేదు.

తయారీ కంపెనీల నిర్వాకంతోనే..

ఎంతో గొప్పగా జీవా బ్రాండ్‌ను ప్రారంభించినప్పటికీ, ఆ నీటిని, సీసాలను రూపొందించేందుకు ఆర్టీసీ ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీల నిర్వాకం వల్లనే సమస్యలు తలెత్తాయని సమాచారం. సీసాల ఆకృతి గొప్పగా ఉన్నప్పటికీ, వాటి నాణ్యత అత్యంత తీసికట్టుగా ఉన్నట్టు తెలిసింది. దీంతో ఆ బ్రాండ్‌పై చెడ్డపేరు వస్తుందనే వాటి మార్కెటింగ్‌ను ఆపేసినట్టు తెలిసింది. నాణ్యమైన సీసాలు, నీళ్లు అందుబాటులోకి వచ్చిన తర్వాతనే ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది.

14 నుంచి ఏపీ అసెంబ్లీ

సాక్షి, అమరావతి: ఈ నెల 14వ తేదీన ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి శుక్రవారం నోటిఫికేషన్ జారీచేశారు. 14వ తేదీ ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయని అందులో పేర్కొన్నారు. తొలిరోజు ఉభయసభల సంయుక్త సమావేశంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. ఆ తర్వాత జరిగే బీఏసీ (బిజినెస్ అడ్వైజరీ కమిటీ) సమావేశంలో సభ ఎన్నిరోజులు నిర్వహించాలి, ఏ అంశాలపై చర్చించాలనే అంశాలను నిర్ణయించనున్నారు. శాసనసభలో రెండోరోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. శాసనమండలిలో రెండోరోజు సభ్యులు చల్లా భగీరథరెడ్డి, బచ్చుల అర్జునుడు మృతికి సంతాప తీర్మానం అనంతరం సమావేశం వాయిదా పడనుంది. మూడోరోజు నుంచి రెగ్యులర్‌గా మండలి సమావేశాలు జరుగుతాయి. 14 నుంచి 24వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.


తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి దర్శనమిచ్చారు.

6 నుంచి జీపీఎఫ్ఐ సమావేశాలు

- డిజిటల్ చెల్లింపుల్లో నూతన పద్ధతులపై చర్చ
- జీ20 సదస్సు చీఫ్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్ శ్రింగ్లా వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఆర్థికాంశాల్లో అందరినీ భాగస్వాములను చేసే లక్ష్యంతో సిద్ధం చేసిన యూపీఐ లాంటి వ్యవస్థలను అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని జీ20 సదస్సు చీఫ్ కో-ఆర్డినేటర్ హర్షవర్ధన్ శ్రింగ్లా తెలిపారు. జీ20 సదస్సు వేదికగా యూపీఐ సహా ఇతర అంశాల్లో భారత్ అనుభవాలు, మేలైన పద్ధతులు, వనరులను అందించేందుకు సిద్ధమని, దీనివల్ల పేద దేశాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ ఏడాది భారత్ అధ్యక్షతన జరుగుతున్న జీ20 సదస్సులో భాగంగా ఈ నెల 6, 7 తేదీల్లో గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూషన్ (జీపీఎఫ్ఐ) రెండో విడత సమావేశాలు జరగనున్నాయి. దానికంటే ముందు శని, ఆదివారాల్లో 'నాలెడ్జ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ ఫర్ ద ఎమర్జింగ్ ఎకానమీస్ ఆఫ్ ద గ్లోబల్ సౌత్' సమావేశాలు నిర్వహించనున్నారు. జీ20 దేశాలతో పాటు ఆసక్తిగల ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలూ ఇందులో పాల్గొననున్నాయి. ఆర్థిక అంశాల్లో అందరికీ చోటు కల్పించడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, కష్టనష్టాలపై అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ అనుభవాలను పంచుకొనేందుకు ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు హర్షవర్ధన్ శ్రింగ్లా తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమావేశం ప్రాముఖ్యత ఇతర వివరాలను వెల్లడించారు.

భారత్ తయారీ యూపీఐ పేమెంట్లపై సర్వత్రా ఆసక్తి...

భూదక్షిణార్థ గోళంలోని దేశాలతో ప్రధాని మోదీ ఇప్పటికే 'వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్' పేరుతో చర్చలు జరిపారని, ప్రజోపయోగం కోసం డిజిటల్ టెక్నాలజీ వాడకం అవసరాన్ని నొక్కి చెప్పారని హర్షవర్ధన్‌శ్రింగ్లా తెలిపారు. గ్లోబల్ సౌత్ ప్రాథమ్యాలు, గళం భారత్ గళమవుతుందని ప్రధాని స్పష్టం చేసినట్లు వివరించారు. ఈ నెల 6న చెల్లింపులు, రెమిటెన్సెస్‌లలో డిజిటల్ ఇన్నొవేషన్స్ అంశంపై జీపీఎఫ్ఐ సదస్సును నిర్వహించనున్నామని చెప్పారు. డిజిటల్ టెక్నాలజీల అమలుకు పెట్టే పెట్టుబడుల వల్ల ఉత్పాదకత పెంపుతోపాటు ఖర్చులు కూడా తగ్గుతాయని అభివృద్ధి చెందుతున్న దేశాలు గుర్తించాయని, ఈ నేపథ్యంలోనే భారత్ సిద్ధం చేసిన యూపీఐ పేమెంట్ల పద్ధతులపై సర్వత్రా ఆసక్తి నెలకొందన్నారు. ఈ ఏడాది జనవరిలో కోల్‌కతాలో నిర్వహించిన తొలి జీపీఎఫ్ఐ సమావేశాల ద్వారా కొన్ని సత్ఫలితాలను సాధించామని, ప్రపంచ దేశాల రుణభారాన్ని తగ్గించడం, స్వదేశాలకు చేసే చెల్లింపులకు అయ్యే ఖర్చులు తగ్గించడం, ఆయా దేశాలకు మేలు జరగాలంటే సక్రియాత్మక డిజిటల్ మౌలిక సదుపాయాల అవసరం వంటి అంశాల్లో సభ్యుల మధ్య అంగీకారం కుదిరిందని శ్రింగ్లా తెలిపారు. కోవిడ్ మహమ్మారి కాలంలో భారత్ 3700 కోట్ల డాలర్ల మొత్తాన్ని మధ్యవర్తుల అవసరం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందజేయడంపై అంతర్జాతీయ సంస్థలూ హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. విలేకరుల సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారు చంచల్ సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ

శ్రీశైలం రహదారిలో రియల్ జోరు



ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే కావాల్సింది మూడు అంశాలే. 1. మెరుగైన మౌలిక వసతులు, 2. రవాణా సౌకర్యాలు, 3. ఉద్యోగ అవకాశాలు. అంశాల వారీగా చూస్తే.. వెడల్పాటి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, మంచి నీటి సరఫరాలతో పాటు జాతీయ రహదారి... బస్సు, రైలు సౌకర్యంతో పాటు విమానాశ్రయ మార్గం... హార్డ్‌వేర్ పార్క్, ఫ్యాబ్‌సిటీ, ఫార్మాసిటీలతో లక్షలాది ఉద్యోగ అవకాశాలు.. ఇవీ శ్రీశైలం జాతీయ రహదారి ప్రత్యేకతలు. ఇంకేం కావాలి ఈ మార్గంలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతుందని చెప్పేందుకు.

- ఫార్మాసిటీతో ఊపందుకున్న స్థిరాస్తి వ్యాపారం
- కడ్తాల్, ఆమన్‌గల్, తలకొండపల్లి, కల్వకుర్తి ప్రాంతాలకు డిమాండ్
- వ్యక్తిగత గృహాలు, విల్లాలు, వీకెండ్ హోమ్స్ నిర్మాణాలు

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంతో శ్రీశైలం రహదారిలో మొదలైన అభివృద్ధి.. హార్డ్‌వేర్ పార్క్, ఫ్యాబ్ సిటీ, ఫార్మాసిటీలతో ఊపందుకుంది. ఈ మార్గం రెసిడెన్షియల్ జోన్‌లో ఉండటంతో నివాస సముదాయాల అభివృద్ధి శరవేగంగా జరుగుతుంది. ఐటీ తర్వాత అధిక శాతం మందికి ఉపాధి అవకాశాల్ని కల్పించేది ఫార్మా రంగమే. తెలంగాణ ప్రభుత్వం ముచ్చర్లలో 19 వేల ఎకరాల్లో ఫార్మా సిటీని అభివృద్ధి చేస్తున్న సంగతి తెలిసిందే. ఫార్మా సిటీ రాకతో శ్రీశైలం రహదారి అభివృద్ధి దశే మారిందని డ్రీమ్ స్కేప్ ఎండీ నాగరాజు తెలిపారు.

గత అనుభవాలే సాక్ష్యాలు..

ఐడీఏ బొల్లారం, పాశమైలారం తదితర ప్రాంతాల్లోని ఫార్మా పరిశ్రమల వల్ల మియాపూర్, మదీనాగూడ, చందానగర్, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాల వరకూ అభివృద్ధి విస్తరించింది. అలాగే గతంలో బేగంపేట్‌లో విమానాశ్రయం ఉన్నప్పుడు సనత్‌నగర్, బోయిన్‌పల్లి వంటి ప్రాంతాలకు ఎలాగైతే అభివృద్ధి చెందాయో.. శంషాబాద్ విమానాశ్రయం శ్రీశైలం రహదారికి చేరువలో ఉండటంతో ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఫార్మాసిటీని అనుసంధానిస్తూ రీజినల్ రింగ్ రోడ్డు కూడా రానుంది. ఇది షాద్‌నగర్ నుంచి తలకొండపల్లి మీదుగా ఫార్మాసిటీకి అనుసంధానమై ఉంటుంది. ఇప్పటికే శ్రీశైలం రహదారిలో ఫ్యాబ్ సిటీ, హార్డ్‌వేర్ పార్క్‌లున్నాయి. స్థిరాస్తి కొను గోళ్లు, పెట్టుబడులకు ఈ రహదారి సరైన ప్రాంతమని సూచిస్తున్నారు.



వీకెండ్ హోమ్స్ ఎంజాయ్..

పర్యావరణహితమైన గృహాలను కొనుగోలుదారులకు అందించాలనేది డ్రీమ్ స్కేప్ లక్ష్యం. ఇందులో భాగంగా శ్రీశైలం రహదారిలో 150 ఎకరాలలో మూడు వీకెండ్ హోమ్స్ ప్రాజెక్ట్‌లను అభివృద్ధి చేస్తుంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, రహదారులు వంటి మౌలిక వసతుల అభివృద్ధి పూర్తయింది. ప్రస్తుతం రిసార్ట్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొనుగోలుదారులకు రిసార్ట్‌లో సభ్యత్వం ఉచితం. వేప, రావి, మర్రి వంటి అటవీ జాతికి చెందిన చెట్లను పెంచుతున్నారు. దీంతో ఆక్సిజన్ శాతం ఎక్కువగా ఉంటుంది. అలాగే ప్రతి ప్లాట్‌లో పండ్లు, కూరగాయల మొక్కలను పెంచుతున్నారు. ప్రత్యేకంగా వర్షపు నీటి సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. పదేళ్ల పాటు గ్రీనరీ పెంపకం, నిర్వహణ బాధ్యత కంపెనీదే. 165 గజాల నుంచి ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి.

హాట్‌స్పాట్స్ ప్రాంతాలివే..

శ్రీశైలం రహదారిలో కందుకూరు, కడ్తాల్, ఆమన్‌గల్, తలకొండపల్లి, కల్వకుర్తి ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఆయా ప్రాంతంలో ధర గజానికి రూ.5 వేల నుంచి 8 వేల వరకున్నాయి. విల్లాల ధరలు రూ.కోటి పైమాటే. 2 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్ల ధరలు రూ.40 లక్షల నుంచి ఉన్నాయి. ప్రధాన నగరంలో 2 బీహెచ్‌కే ఫ్లాట్‌కు వెచ్చించే వ్యయంతో శ్రీశైలం రహదారిలో ఏకంగా విల్లానే సొంతం చేసుకోవచ్చు. 2015లో ఎకరం 10 లక్షలు ఉన్న శ్రీశైలం హైవేలో ప్రస్తుతం రూ.కోటి దాటిందని వర్ధన్ డెవలపర్స్ మేనేజింగ్ రెడ్డి లక్ష్మారెడ్డి తెలిపారు.

వ్యక్తిగత గృహాలు, విల్లాలకు డిమాండ్.

శ్రీశైలం రహదారిలో అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహాలు, విల్లా ప్రాజెక్ట్‌లకు డిమాండ్ ఉంది. డ్రీమ్ స్కేప్, వర్ధన్ డెవలపర్స్, మాతృభూమి, రాంకీ, మ్యాక్, ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై, విశాల్, హస్తిన రియాల్టీ, శిల్పా రాఘవ, ఆలయ్ ఇన్‌ఫ్రా వంటి నిర్మాణ సంస్థలు ఈ ప్రాంతంలో ప్రాజెక్ట్‌లు చేస్తున్నాయి. కందుకూరు నుంచి ఆదిభట్లకు 15 కి.మీ. దూరం. దీంతో ఆదిభట్లలోని ఐటీ, ఏరోస్పేస్ ఉద్యోగులు శ్రీశైలం రహదారిలో స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. 30 కి.మీ దూరంలో ఎల్బీనగర్, ఆదిభట్ల ప్రాంతాలుండడంతో విద్యా, వైద్యం, వినోద కేంద్రాలకూ కొదవేలేదు. కృష్ణా జలాల సరఫరా, విద్యుత్ ఉపకేంద్రంతో మౌలిక వసతులూ మెరుగ్గానే ఉన్నాయి.

రూ. కోటి ఆపైనే..

సాక్షి, హైదరాబాద్: రూ.కోటి, అంతకంటే ఎక్కువ ధర ఉండే లగ్జరీ గృహాలను కొనుగోలు చేయాలనే ఆసక్తి పెరిగింది. దీంతో నిర్మాణ సంస్థలు కూడా ప్రీమియం ప్రాజెక్ట్‌లను లాంచింగ్ చేసేందుకే ఆసక్తి చూపిస్తున్నారు. గతేడాది హైదరాబాద్‌లో విక్రయమైన ఇళ్లలో 44 శాతం, లాంచింగ్ అయిన యూనిట్లలో 48 శాతం రూ.కోటి, ఆపైన ధర ఉన్న ఇళ్లేనని ప్రాప్‌టైగర్.కామ్ నివేదిక వెల్లడించింది. గతేడాది నగరంలో 35,372 గృహాలు విక్రయమయ్యాయి. 2021లో అమ్ముడుపోయిన 22,239 యూనిట్లతో పోలిస్తే ఇది 59 శాతం ఎక్కువ. గతేడాది దక్షిణాది నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే గృహ విక్రయాలు ఎక్కువగా జరిగాయి. బెంగళూరులో 30,470, చెన్నైలో కేవలం 14,100 యూనిట్లు అమ్ముడుపోయాయి. 2022లో నగరంలో విక్రయమైన ఇళ్లలో 44 శాతం వాటా రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉన్న ప్రీమియం ఇళ్లదే. వరుసగా రెండో ఏడాది హైదరాబాద్‌లో గృహాల సరఫరా రికార్డు స్థాయిలో జరిగాయి. 2022లో నగరంలో 82,801 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. అంతకు క్రితం ఏడాదితో పోలిస్తే ఇది 70 శాతం ఎక్కువ. ఇందులో 48 శాతం గృహాలు రూ.కోటి, అంతకంటే ఎక్కువ ధర ఉన్న గృహాలే.

ఈ ప్రాంతాలకు డిమాండ్..

మియాపూర్, కూకట్‌పల్లి, కొండాపూర్, తెల్లాపూర్, కొల్లూరు, గుండ్లపోచంపల్లి, పుప్పాలగూడ, కోకాపేట వంటి ప్రాంతాలలో గృహ కొనుగోళ్లకు కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు.

క్లుప్తంగా...

సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీగా చారుసిన్హా

తొలి మహిళా ఐజీగా రికార్డు


చారు సిన్హా

సాక్షి, హైదరాబాద్: సీఆర్పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్) సదరన్ సెక్టార్ ఐజీగా 1996 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి చారు సిన్హా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రస్తుత ఐజీ మహేశ్‌చంద్ర లడ్హా నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. సీఆర్పీఎఫ్ సదరన్ సెక్టార్ ఐజీగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళా ఐపీఎస్ అధికారిగా కూడా చారు సిన్హా రికార్డు సొంతం చేసుకున్నారు. కేంద్ర సర్వీసులకు వెళ్లకుముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, చిత్తూరు, తూర్పుగోదావరి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లలో ఎస్పీగా పనిచేశారు. యూఎన్ మిషన్ కోసం కోసావ్‌లోనూ పనిచేశారు. అక్కడ స్థానిక ముస్లిం, క్రిస్టియన్ తెగల మధ్య వివాదాల పరిష్కారంలో కీలకంగా పనిచేశారు. ఏసీబీ డైరెక్టర్‌గా, అనంతపురం రేంజ్ డీఐజీ అనంతపురం, చిత్తూరు జిల్లా పరిధిలో శాంతిభద్రతల నిర్వహణలో అత్యంత కీలకంగా పనిచేశారు. తెలంగాణ కేడర్‌కు చెందిన చారుసిన్హా తన కెరీర్‌లో అత్యంతకీలకమైన పోస్టుల్లో పనిచేసి విజయవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అప్పటి వరకు మహిళా ఐపీఎస్‌లు నిర్వర్తించని బాధ్యతలతో తనపేరిట అరుదైన రికార్డులను నెలకొల్పారు. ఉగ్రవాద ప్రభావిత ప్రాంతమైన జమ్మూ సెక్టార్ ఐజీగా, శ్రీనగర్ సెక్టార్‌లో కలిపి మూడున్నరేళ్లపాటు విజయవంతంగా పనిచేశారు. అంతకు ముందు సీఆర్పీఎఫ్ బిహార్ కమాండ్ ఐజీగా నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లు చేపట్టారు.

సాత్విక్ ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్టు

నలుగురికి 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు

మణికొండ: శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి సాత్విక్ ఆత్మహత్య కేసులో నలుగురు నిందితులను నార్సింగి పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ కోర్టు ఈనెల 16వ తేదీ వరకు.. 14 రోజుల రిమాండ్ విధించింది. సాత్విక్ రాసిన సూసైడ్ లేఖ శుక్రవారం పోలీసులకు అందింది. ఆ లేఖలో పేర్కొన్న మేరకు కాలేజీ అడ్మిన్ ప్రిన్సిపల్ ఎ.నర్సింహాచారి/ఆచార్య, ప్రిన్సిపాల్ టి.శివరామకృష్ణారెడ్డి, వార్డన్ కె. నరేష్, వైస్ ప్రిన్సిపాల్ వి.శోభన్‌బాబును అరెస్టు చేశారు. సాత్విక్ తండ్రి నాగుల రాజప్రసాద్ ఫిర్యాదు మేరకు.. ఐపీసీ చట్టం 305 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మరో ఐదుగురు విద్యార్థులు కూడా కాలేజీ అధ్యాపకుల ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

గ్రూప్‌-1 మెయిన్స్‌కు 1:150 నిష్పత్తిలో ఎంపిక

సీఎంకు ఎమ్మెల్యే జగ్గారెడ్డి వినతి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటైన తొమ్మిదేళ్లకు తొలిసారి గ్రూప్‌–1 పరీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో కాకుండా.. 1:150 నిష్పత్తిలో నిరుద్యోగులకు అవకాశం ఇవ్వాలని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు శుక్రవారం ఆయన లేఖ రాశారు. వేలాదిమంది నిరుద్యోగులు గ్రూప్‌–1 పరీక్ష ప్రిలిమ్స్ రాశారని తెలిపారు. వయసురీత్యా చాలామంది అర్హత కోల్పోయే ప్రమాదంలో ఉన్నందున.. ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన వారిని 1:150 నిష్పత్తిలో మెయిన్స్ పరీక్షకు అనుమతించాలని ఆయన కోరారు. చాలా రాష్ట్రాల్లో ప్రధాన పోటీ పరీక్షలను ఆయా ప్రాంతీయ భాషల్లో నిర్వహిస్తున్నందున.. గ్రూప్‌–1 మెయిన్స్ పరీక్షను కూడా తెలుగులో నిర్వహించి గ్రామీణ నిరుద్యోగులకు అండగా నిలవాలని జగ్గారెడ్డి కోరారు.

'నదుల' సమావేశానికి ఛత్తీస్‌గఢ్‌ను ఆహ్వానించాలి

నీటిపారుదల ఈఎన్‌సీ మురళీధర్ లేఖ

సాక్షి, హైదరాబాద్: నదుల అనుసంధానానికి సంబంధించి ఈనెల 6న నిర్వహించనున్న టాస్క్‌ఫోర్స్ సమావేశానికి ఛత్తీస్‌గఢ్‌ను ఆహ్వానించకపోవడంపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్ లేఖరాశారు. గోదావరిలో ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని నీటిని నదుల అనుసంధానానికి వినియోగించుకోవడానికి ప్రతిపాదిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని పిలవకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ)కి లేఖ రాశారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. వారి నీటిని వినియోగించుకుంటూ.. వారిని చర్చలకు పిలకపోతే అర్థవంతం ఎలా అవుతుందని ప్రశ్నించారు. గోదావరి–కావేరీ నదుల అనుసంధానంపై ఇదివరకే తమ ప్రభుత్వ నిర్ణయాన్ని స్పష్టం చేసినట్లు వివరించారు. 75 శాతం డిపెండబిలిటీ (వందేళ్లలో 75 ఏళ్ల పాటు కచ్చితంగా వచ్చే వరదల ఆధారంగా లెక్కతీసి) ప్రకారం గోదావరిలో మిగులు జలాలు లేవని స్పష్టంచేశారు. కేవలం ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 141 టీఎంసీలు మాత్రమే ఉన్నాయన్నారు. తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని మురళీధర్ లేఖలో పేర్కొన్నారు.

రూ. 232 కోట్లు ఎగ్గొట్టి 'పరుగులు'!

- రాష్ట్రంలో త్రైమాసిక పన్ను ఎగ్గొట్టిన 2.17 లక్షల రవాణా వాహనాలు
- 3 నుంచి 18 నెలలుగా పెండింగ్‌లోనే పన్ను చెల్లింపులు
- ఎట్టకేలకు స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టిన రవాణాశాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 2,17,930 రవాణా వాహనాలు మూడు నెలలకోసారి చెల్లించాల్సిన త్రైమాసిక పన్ను ఎగ్గొట్టి రహదారులపై యథేచ్ఛగా పరుగులు తీస్తున్నాయి. ఏకంగా రూ. 232 కోట్లను కొన్ని నెలలుగా చెల్లించకుండానే దర్జాగా దూసుకెళ్తున్నాయి. వాటిలో కనిష్టంగా 3 నెలల కాలపరిమితి నుంచి గరిష్టంగా 18 నెలల వరకు పన్ను చెల్లించాల్సిన వాహనాలు వేలల్లోనే ఉన్నాయి. కొన్నిచోట్ల కోవిడ్ కాలం నుంచి కూడా పన్ను చెల్లించని వాహనాలు భారీగానే ఉన్నట్లు అంచనా.

హైదరాబాద్‌లోనే అధికం..

త్రైమాసిక పన్ను ఎగ్గొట్టి తిరుగుతున్న 2.17 లక్షల వాహనాల్లో అత్యధికంగా గ్రేటర్ హైదరాబాద్‌లోనే లక్షకుపైగా ఉన్నాయి. ఈ క్రమంలో చాలాకాలం తర్వాత అధికారులు కొరడా ఝుళిపించేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల రవాణా కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ పన్ను ఎగవేత వాహనాలపై సమీక్ష నిర్వహించారు. ఒకవైపు లక్ష్యానికి మించిన ఆదాయాన్ని ఆర్జించడంపట్ల ప్రశంసిస్తూనే పన్ను ఎగవేత వాహనాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రేటర్‌లోని మూడు జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు చెందిన రవాణా వాహనాలను తనిఖీ చేయాలని అధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు.

గ్రేటర్‌లో ఆటోలు మినహా...

సాధారణంగా వ్యక్తిగత వాహనాలకు ఒకసారి జీవితకాల పన్ను చెల్లిస్తే చాలు. కానీ రవాణా వాహనాలకు మాత్రం ప్రతి 3 నెలలకోసారి త్రైమాసిక పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వాహనాల సామర్థ్యం మేరకు దీనిని నిర్ణయిస్తారు. వెయిట్ గ్రాస్ వెహికల్ (డబ్ల్యూజీవీ) ప్రకారం వాహనం బరువుకు అనుగుణంగా త్రైమాసిక పన్ను కనిష్టంగా రూ. 535 నుంచి గరిష్టంగా రూ. 15,000 వరకు ఉంటుంది. గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు జీహెచ్ఎంసీలోని సుమారు 1.4 లక్షల ఆటోలను ఈ త్రైమాసిక పన్ను జాబితా నుంచి ప్రభుత్వం మినహాయించింది. మిగతా అన్ని రకాల రవాణా వాహనాలు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ జాబితాలో స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సులు, లారీలు, క్యాబ్‌ల వంటి వాహనాలు ఉన్నాయి. కోవిడ్ కాలంలో పన్ను చెల్లించని రవాణా వాహనదారులు... కోవిడ్ ఆంక్షలను సడలించాక చాలా వరకు చెల్లించారు. కొందరు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆర్టీఏ అధికారులు అప్పట్లో ఉదారంగా వ్యవహరించడం కూడా ఇందుకు కారణమైంది.

ఎంవీఐలకు పన్ను వసూలు టార్గెట్‌లు!

ఈ నెలాఖరు నాటికి బకాయిలు వసూలు చేయాలని రవాణా కమిషనర్ అధికారులను మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది. అలాగే వారికి టార్గెట్‌లు విధించారని తెలియవచ్చింది. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలోప్రతి ఎంవీఐకి రూ. 6 లక్షల చొప్పున టార్గెట్ విధించగా ప్రస్తుతం దాన్ని రూ. 7 లక్షలకు పెంచారని సమాచారం. ఈ లెక్కన ఆర్టీఏ కార్యాలయాల్లో పౌరసేవలు అందించే ఎంవీఐలు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రోజుకు పన్ను చెల్లించని 5 వాహనాలను జప్తు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లో ఉన్నవారు రోజుకు 10 వాహనాలను జప్తు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అయితే జప్తు చేసిన వాహనాలను నిలిపేందుకు సరైన పార్కింగ్ సదుపాయం లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఓ ఎంవీఐ పేర్కొన్నారు.

స్వచ్ఛందంగా ముందుకొస్తేనే ఊరట...

త్రైమాసిక పన్ను పెండింగ్ జాబితాలో ఉన్న వాహన యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్ను చెల్లిస్తే అపరాధ రుసుము ఉండదని అధికారులు చెబుతున్నారు. తనిఖీల్లో పట్టుబడితే మాత్రం 200 శాతం వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

బ్లాంక్ డీడీలతో దళారుల వసూళ్లు

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సీజ్ చేసిన వాహనాలపై పెనాల్టీతో సహా కట్టాల్సిన బకాయిల మొత్తానికి డీడీ తీసుకురావాలని అధికారులు చెబుతుండటంతో దళారులు రంగప్రవేశం చేస్తున్నారు. వారు అప్పటికే వివిధ మొత్తాలతో బ్యాంకుల నుంచి తెచ్చిన ఖాళీ డీడీలు చూపి ఒక్కో డీడీపై 'సర్వీస్ చార్జీ'గా రూ.200 వసూలు చేస్తున్నారు. దీంతో ఆరొందల నుంచి రూ.1200 వరకు ఆ రూపంలో అదనపు భారం పడుతోంది. కళ్లముందే ఈ దందా జరుగుతున్నా రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవట్లేదు.

ఆన్‌లైన్ చెల్లింపులకు అవకాశం ఎందుకివ్వరు?

రవాణా శాఖలో ఆన్‌లైన్ సేవలను ప్రారంభించినా పెనాల్టీలను మాత్రం ఆన్‌లైన్ చెల్లింపులకు అవకాశం ఇవ్వకుండా డీడీల రూపంలోనే చెల్లించాలనే నిబంధన ఎందుకు పెట్టారు?

– దయానంద్, సామాజిక కార్యకర్త

	వాహనాల సంఖ్య	చెల్లించవలసిన పన్ను (రూ.కోట్లలో)
కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులు	351	9.69
ప్రైవేట్ సర్వీస్ వాహనాలు	176	2.55
మాక్సీక్యాబ్‌లు	4254	15.21
లారీలు	1,12,274	141.30
ట్రాక్టర్లు	81,999	43.59
ఇతర వాహనాలు	–	19.77
మొత్తం వాహనాలు	2,17,930	232.11

కన్నడిగుల కోసం సాహిత్య వేదిక

రూ. 5 కోట్లు మంజూరు చేసిన సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: గంగా జమునా తహెజీబ్‌కు ప్రతీకగా కొనసాగుతున్న హైదరాబాద్ జీవన విధానాన్ని నిలుపుకోవడానికి ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల సాహిత్యం, సంస్కృతిని రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరుచుకుని దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్న కన్నడ భాష మాట్లాడే కన్నడిగుల కోసం సాహిత్యవేదికను పునర్నిర్మాణం చేయాలని సీఎం నిర్ణయించారు. అందుకోసం రూ.5 కోట్లు మంజూరు చేశారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా నివసిస్తున్న కర్ణాటకవాసులు, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కాచిగూడలోని 'కర్ణాటక సాహిత్య మందిరం'పునర్నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. దానికి సంబంధించిన అనుమతిపత్రాలను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు శుక్రవారం ప్రగతిభవన్‌లో అందచేశారు. సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు కమ్యూనిటీ అవసరాల కోసం వినియోగించుకునేవిధంగా మౌలిక వసతులు ఏర్పాటు చేసి ఆడిటోరియాన్ని తీర్చిదిద్దాలని అధికారులు, ఎమ్మెల్యేకు సీఎం సూచించారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

భయం.. తత్తరపాటు లేకుండా..

పోలీసుల విచారణలో హరిహరకృష్ణ సమాధానాలు

- కస్టడీలో నిందితుడిని లోతుగా విచారించిన పోలీసులు
- నవీన్ శరీర భాగాలు ఎక్కడ విసిరేశావ్... సెల్‌ఫోన్లను ఎందుకు ధ్వంసం చేశావంటూ ప్రశ్నలు
- తొలిరోజు సరైన సమాచారం రాబట్టలేకపోయినట్లు సమాచారం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అబ్దుల్లాపూర్‌మెట్ హత్య కేసులో మృతుడు నవీన్ శరీర భాగాలు పోలీసులకు ఇంకా దొరకలేదు. హతుడి ఫోన్‌తో పాటు నిందితుడు హరిహరకృష్ణ సెల్‌ఫోన్లు సైతం ఇంకా స్వాధీనం చేసుకోలేదు. దీంతో తొలిరోజు కస్టడీలో నిందితుడు హరిని పోలీసులు ఆయా వివరాలను రాబట్టే కోణంలోనే విచారించారు. గత నెల ఫిబ్రవరి 17న ప్రేమించిన యువతి దూరమవుతుందనే అనుమానంతో మద్యం మత్తులో ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్‌ను స్నేహితుడు హరిహరకృష్ణ అబ్దుల్లాపూర్‌మెట్ శివారు ప్రాంతంలో గొంతు నులిమి హత్య చేసి.. అనంతరం మృతదేహాన్ని ఎవరూ గుర్తించకుండా ఉండేందుకు చేతి వేళ్లు, పెదాలు, గుండె, మర్మాంగాలను కోసి ముక్కలు చేశాడు. అనంతరం ఫిబ్రవరి 24న నిందితుడు హరి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ కేసులో న్యాయస్థానం నిందితుడిని ఈనెల 9వ వరకు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు చర్లపల్లి జైలు నుంచి నిందితుడిని తరలించిన పోలీసులు.. వైద్య పరీక్షల అనంతరం విచారణ చేపట్టారు. పోలీసులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఎలాంటి భయం, తత్తరపాటు లేకుండా నిందితుడు సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. హత్య కేసులో మరిన్ని ఆధారాలను రాబట్టేందుకు నిందితుడు హరిని హత్య జరిగిన ప్రాంతం అబ్దుల్లాపూర్‌మెట్ శివారు ప్రాంతానికి తీసుకెళ్లి సీన్‌-రీకన్‌స్ట్రక్షన్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

కొత్త సెల్‌ఫోన్‌తో టాణాకు..

హత్య తర్వాత హరి మరొక స్నేహితుడు హసన్ ఇంట్లో ఆ రోజు రాత్రి నిద్రించి మర్నాడు ఉదయం కోదాడ, విజయవాడ, విశాఖపట్నం మీదుగా తిరిగి.. సొంతూరైన వరంగల్‌కు చేరుకున్నాడు. తండ్రికి జరిగిన విషయం చెప్పడంతో పోలీసులకు లొంగిపోవాలని తండ్రి సూచించడంతో తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన హరి.. ప్రేమికురాలిని కలిసి నవీన్ హత్య గురించి వివరించారు. ఆమె సూచన మేరకు ఫిబ్రవరి 24న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అయితే అప్పటికే హరి వినియోగిస్తున్న సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేసి.. కొత్త సెల్‌ఫోన్ తీసుకొని దాన్ని జేబులో పెట్టుకొని పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిసింది. ఈ సెల్‌ఫోన్‌నే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక ఆధారాలతో ఇది కొత్త ఫోన్ అని గుర్తించిన పోలీసులు.. హత్యకు ముందు సెల్‌ఫోన్ గురించి కస్టడీ విచారణలో పోలీసులు ఆరా తీయగా.. తాను వాడేది ఇదే ఫోన్ అని బుకాయించినట్లు తెలిసింది.


పర్షియన్ రాతప్రతుల కాపీలను ఆవిష్కరిస్తున్న ఇరాన్ రాయబారి ఇరాజ్ ఇలాహీ, ఆర్కైవ్స్ అధికారులు

నిజాం కాలంనాటి పర్షియా ప్రతులను పరిరక్షిస్తాం

- భారత్‌లో ఇరాన్ రాయబారి ఇరాజ్ ఇలాహీ వెల్లడి
- ఆర్కైవ్స్‌లో డిజిటైజేషన్ నకలు కాపీ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: పర్షియాలో రూపొందిన నిజాం కాలంనాటి రాతప్రతులను పరిరక్షించి భావితరాలకు అందించేందుకు కృషి చేస్తామని భారత్‌లో ఇరాన్ రాయబారి డాక్టర్ ఇరాజ్ ఇలాహీ తెలిపారు. ఇరాన్‌తో భారతదేశానికి అద్భుతమైన సాంస్కృతిక మైత్రీ ఉందని, ఒకప్పుడు భారత్‌లో పర్షియా భాష ప్రాధాన్యంగా ఉండేదని పేర్కొన్నారు. నిజాం కాలంలో పర్షియా, ఉర్దూల్లో రూపొందిన అధికారిక పత్రాల డిజిటైజేషన్‌కు పూర్తి సహాయసహకారాలు అందిస్తామన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లోని ఇరాన్ కౌన్సిల్ జనరల్ మెహిదీ షారోఖీతో కలిసి తార్నాకలోని స్టేట్ ఆర్కైవ్స్‌ను సందర్శించారు. స్టేట్ ఆర్కివ్స్‌లో నిజాం కాలంనాటి ఫర్మానాలు, ఇతర అధికారిక పత్రాలు శిథిలమవుతున్న నేపథ్యంలో వాటిని డిజిటైజ్ చేసి పరిరక్షించేందుకు ఇరాన్ గతంలోనే ముందుకొచ్చింది. ఢిల్లీలోని నూర్ మైక్రోఫిల్మ్ ఇంటర్నేషనల్ సెంటర్(ఎన్ఎంఐసీ)లో ఈ పనులు నిర్వహించేందుకు 2022లో రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని ప్రతుల డిజిటైజేషన్‌తో నకలు కాపీలను రూపొందించారు. అందులో తొలి కాపీని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. నిజాం కాలంనాటి లక్షల పేజీలతో ఉన్న అతి పాతప్రతుల పరిరక్షణ చర్యలు కొనసాగుతున్నాయని ఎన్ఎంఐసీ డైరెక్టర్ డాక్టర్ ఖాజాపీరి అన్నారు. తాజా పరిరక్షణ ప్రక్రియతో అలనాటి అధికారికపత్రాలకు కొత్త జీవం వచ్చినట్టయిందని ఆర్కైవ్స్ డైరెక్టర్ డాక్టర్ జరీనా పర్వీన్ అన్నారు. కార్యక్రమంలో ఆర్కైవ్స్ డిప్యూటీ డైరెక్టర్ మహేశ్‌రెడ్డి, ఢిల్లీలోని ఎన్ఎంఐసీ రీజినల్ డైరెక్టర్ అలీ నిరూమాన్, అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ రఖీబ్, ఆర్కివ్స్ అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీకాంత్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారుల క్షేత్రస్థాయి పర్యటన

ఐపీఎస్‌లను అభినందించిన డీజీపీ



సాక్షి, హైదరాబాద్: పోలీస్ కమిషనర్లు, పోలీస్ సూపరింటెండెంట్లు తమ పరిధిలోని గ్రామాలు, పోలీస్ స్టేషన్లను విరివిగా సందర్శించాలన్న డీజీపీ అంజనీకుమార్ ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారులు గ్రామాల సందర్శనపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి నెలలో మొత్తం 137 పోలీస్ స్టేషన్లు, 45 సమస్యాత్మక ప్రాంతాలను ఆయా జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీలుగా, పోలీస్ కమిషనర్లుగా ఇటీవలే బాధ్యతలు తీసుకున్న యువ ఐపీఎస్ అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించాలని డీజీపీ అంజనీకుమార్ ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే ప్రజల సమస్యలతోపాటు స్థానిక పరిస్థితులు, సిబ్బంది పనితీరుపై అవగాహన ఏర్పడుతుందని ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఫిబ్రవరిలో నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనల్లో పాల్గొన్న అధికారులను డీజీపీ అంజనీకుమార్ శుక్రవారం అభినందించారు. గ్రామాల సందర్శనతో ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వసనీయత పెరుగుతుందని డీజీపీ శుక్రవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు.

గోడకూలి ఒకరు.. అది చూసి మరొకరు

ఇద్దరు కూలీలు దుర్మరణం

- నిజామాబాద్ జిల్లా జన్నెపల్లి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు గెస్ట్‌హౌస్‌లో ఘటన


కొండపల్లి రాజు (ఫైల్)


గుండెపోటుతో మరణించిన కూలీ

నవీపేట: నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం జన్నెపల్లిలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావుకు చెందిన గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఇద్దరు కూలీలు ప్రమాదవశాత్తు మృతి చెందారు. హన్మంత్‌రావు తన అత్తగారి ఊరైన జన్నెపల్లిలో 22 ఏళ్ల క్రితం వ్యవసాయభూమిని కొనుగోలు చేసి, అందులో రెండంతస్తుల గెస్ట్‌హౌస్ నిర్మించారు. ప్రతి ఏటా నవరాత్రి ఉత్సవాలప్పుడు ఎమ్మెల్యే తొమ్మిది రోజులు ఇక్కడే ఉండి దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తుంటారు. అప్పుడప్పుడూ వచ్చివెళ్తుంటారు. కాగా, తాజాగా చేపట్టిన గెస్ట్‌హౌస్ ఆధునీకరణ పనుల కోసం శుక్రవారం కాంట్రాక్టర్‌తోపాటు నిజామాబాద్ నుంచి ఐదుగురు కూలీలు వచ్చారు. మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో ముగ్గురు కూలీలు భోజనానికి వెళ్లగా, కొండపల్లి రాజు(28), అతడి మిత్రుడు రెండో అంతస్తులోని గోడను తొలగించి, కిందపడేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గోడతోపాటు కొండపల్లి రాజు కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దృశ్యాన్ని కళ్లారా చూసిన మరో కూలీ ఒక్కసారిగా రెండో అంతస్తులోనే వాంతులు చేసుకుని కుప్పకూలాడు. పెద్దశబ్దం రావడంతో మిగతా కూలీలు పైకి వచ్చి అతడి ఛాతీపై నొక్కి రక్షించేందుకు విఫలయత్నం చేశారు. సమాచారం అందిన వెంటనే ఎస్‌ఐ రాజారెడ్డి గెస్ట్‌హౌస్‌కు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజు తండ్రి శంకర్ రిటైర్డ్ సీఆర్‌పీఎఫ్ ఉద్యోగి. నవీపేట మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన వీరి కుటుంబం కొన్నేళ్ల కిందట నిజామాబాద్‌లోని వినాయక్‌నగర్‌లో స్థిరపడింది. రాజుకు పెళ్లయిన సోదరి ఉంది.గుండెపోటుతో మృతి చెందిన మరోకూలీ పేరు చంపాల్వాడి సాయిలు(29). భార్యతో విడిపోయిన సాయిలు నిజామాబాద్‌లో తల్లిదండ్రులతో ఉంటున్నాడు. మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు చెందిన వీరి కుటుంబం ఏళ్లక్రితం వలస వచ్చింది.

ఆడబిడ్డల గోడు పట్టదా?

ప్రాజెక్టు కోసం మా పొలాలు, ఇళ్లు ఇచ్చాం

- పెళ్లి చేసుకున్నామని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వనంటారా?
- ఇదెక్కడి న్యాయమంటూ గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసిత యువతుల ఆవేదన
- 70 రోజులుగా వివాహితల నిరసన దీక్షలు


గుడాటిపల్లెలో దీక్షా శిబిరంలో పెళ్లి అయిన మహిళలు

హుస్నాబాద్: ప్రాజెక్టు పనుల్లో ఆలస్యం పెద్ద వివాదంగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ సుమారు 100 మంది వివాహితలు 70 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం హామీ ఇచ్చినప్పుడు తమకు పెళ్లిళ్లు కాలేదని, ఇప్పుడు తమకు పెళ్లి అయ్యిందనే కారణంతో అనర్హుల్ని చేయడం సమంజసం కాదంటూ వారు వాపోతున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరుతున్నా రు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

రూ.6 లక్షలు, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తామని..

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టును 8.23 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు భూసేకరణ ప్రారంభించినప్పుడు.. దీనివల్ల ముంపునకు గురవుతున్న గుడాటిపల్లి పంచాయతీ పరిధిలోని పల్లె, గిరిజన తండాల వారికి ఇతరత్రా హామీలతో పాటు కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన వివాహంకాని యువతులు ఉంటే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.6 లక్షలనగదు పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు 2010 నుంచి 2015 వరకు కటాఫ్‌గా తీసుకుని 141 మంది అర్హుల్ని గుర్తించారు. అనుకున్న సమయంలో ప్రాజెక్టును ప్రారంభించి వీరికి ఇచ్చిన హామీ మేరకు నగదు, ఇల్లు ఇచ్చేస్తే ఎలాంటి వివాదం తలెత్తేది కాదు. కానీ ప్రాజెక్టును ఆలస్యంగా ప్రారంభించడం, పనులు కొనసాగుతుండటం, హామీ అమలు చేయకపోవడంతో కటాఫ్ పెంచుతూ పోయారు. ఈ విధంగా 2015 నుంచి 2021 వరకు మరో 338 మందిని, 2022 డిసెంబర్ వరకు మరో 60 మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. అయితే ఈ మధ్యకాలంలో కొందరు యువతుల పెళ్లికావడం, వీరికి ప్యాకేజీ వర్తించదని అధికారులు చెప్పడంతో ఆందోళనలు ప్రారంభమయ్యాయి.

జాబితా నుంచి తొలగింపు

మధ్యలో రెండేళ్లు ప్రాజెక్టు నిలిచిపోగా, గతేడాది డిసెంబర్ 9న మళ్లీ పనులు ప్రారంభించారు. ఈ పనులు ప్రారంభమయ్యాక యువతులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెక్కులు అందజేసే ప్రక్రియ ప్రారంభమైంది. అయితే మొత్తం 539 మంది అర్హుల్లో 2015 నుంచి 2022 మధ్యకాలంలో పెళ్లిళ్లు చేసుకున్నారనే కారణంతో సుమారు వంద మంది మహిళల పేర్లను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జాబితా నుంచి అధికారులు తొలగించారు. దీంతో వారు లబోదిబోమన్నారు.

పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

అధికారుల తీరును నిరసిస్తూ డిసెంబర్ 14 నుంచి అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు గుడాటిపల్లె గ్రామం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో దీక్షలు కొనసాగిస్తున్నారు. సుమారు 70 రోజులుగా ఈ నిరసనలు కొనసాగుతున్నాయి. ఇటీవల వారు హుస్నాబాద్ పట్టణంలో స్థానిక ఎమ్మెల్యేని కలిసి తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 24న హుస్నాబాద్ పర్యటనకు వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు మొర పెట్టుకుందామని ప్రయత్నించారు. కానీ పోలీసులు అడ్డుకున్నారు. అంతేకాదు పట్టణ పొలిమేరలకు తరిమేశారు. దీనిపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇళ్లకు వెళ్లకుండా రాత్రి సమయంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమను పట్టించుకోవాలని డిమాండ్ నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు.

ఇదేం న్యాయం?



మా త్యాగానికి ఎంత ఇచ్చిన తక్కువే. పెళ్లి కాని యువతులకు ప్యాకేజీ ఇస్తామంటూ మమ్మల్ని గుర్తించారు. ప్రాజెక్టు పనులు ప్రారంభించినప్పుడు మాకు పెళ్లి కాలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభమై దాదాపు 16 ఏళ్లు గడుస్తున్నాయి. ఇప్పుడు పెళ్లి అయిందనే సాకుతో ప్యాకేజీ వర్తించదని అనడం ఏం న్యాయం?

– చెంచు రాణి, నిర్వాసితురాలు

వయసు పెరుగుతుంది కానీ తగ్గుతుందా?



గౌరవెల్లి ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తిచేస్తే ఈ సమస్య ఉండేది కాదు. వయస్సు పెరుగుతుందే కానీ తగ్గుతుందా? ప్రభుత్వం తప్పు చేసి మాకు అన్యాయం చేస్తే ఎలా? మా బాధలను కనీసం మంత్రికి కూడా చెప్పుకోనివ్వరా? ప్యాకేజీ ఇస్తే మాదారి మేము వెతుక్కుంటాం.

– భూక్య శిరీష, నిర్వాసితురాలు

పాఠశాల భవనం నుంచి పడిపోయిన విద్యార్థిని

తీవ్రగాయాలు.. ఖమ్మం శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో ఘటన


పాఠశాలలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపాన ఉన్న శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని పాఠశాల భవనం పైనుంచి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మం నగరానికి చెందిన పదో తరగతి విద్యార్థిని సాయిశరణ్య.. శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో చదువుతోంది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ఆమె మూడో అంతస్తు నుంచి కింద పడటంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సిబ్బంది ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. కాగా, విద్యార్థినికి అనారోగ్యం కారణంగా కళ్లు తిరిగి కింద పడి ఉండొచ్చని పాఠశాల యజమాన్య బాధ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా విద్యార్థిని భవనం పైనుంచి కింద పడినట్లు తెలుసుకున్న పీడీఎస్‌యూ నాయకులు పాఠశాల ఎదుట రాత్రి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పాఠశాల ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి ఫ్లెక్సీలు దహనం చేశారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 4 । మార్చి । 2023



అట్టహాసంగా 'కొత్వాల్ కేసరి'

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో కొత్వాల్ కేసరి కుస్తీ పోటీల చాంపియన్ షిప్–2023 శుక్రవారం సాయంత్రం 'కుడా' స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమైంది. -10లో



పేదల ఆరోగ్యానికి పెద్దపీట

దేశంలో పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రధాని నరేంద్రమోదీ పెద్ద పీట వేస్తున్నారని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. శుక్రవారం రాజబొల్లారం తండాలో ఉచిత వైద్య శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించారు. -10లో

కండల కోసం స్టెరాయిడ్స్!



వైద్య రంగంలో అత్యవసర సమయాల్లో వినియోగించే ఇంజెక్షన్లతో పాటు టాబ్లెట్స్‌ను స్టెరాయిడ్స్‌గా విక్రయిస్తున్న ముఠా గుట్టును దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. కొందరు యువకులు తక్కువ కాలంలో కండలు పెంచుకునేందుకు వీటిని వినియోగిస్తున్నట్లు గుర్తించారు. -10లో

న్యూస్‌రీల్

6న దివ్యాంగుల బస్‌పాస్ మేళా

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 6వ తేదీ సోమవారం ఉప్పల్ బస్టాండ్‌లో దివ్యాంగుల బస్‌పాస్ మేళాను నిర్వహించనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ మేళాకు హాజరయ్యే దివ్యాంగులు దరఖాస్తుతో పాటు, సదరం సర్టిఫికెట్, ఆధార్ ధృవపత్రం, ఒక పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోతో తీసుకురావాలి. గుర్తింపు కార్డు కోసం రూ.50 రుసుము చెల్లించాలి.

ఫైర్‌సేఫ్టీపై గ్యాస్ ఏజెన్సీలకు అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: అగ్నిప్రమాదాలు జరగకుండా వివిధ వర్గాల వారికి అవగాహన కల్పిస్తోన్న జీహెచ్ఎంసీ ఫైర్‌సేఫ్టీ విభాగం.. శుక్రవారం గ్యాస్ ఏజెన్సీలు, ఇన్సూరెన్స్ ఏజెన్సీల ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. బుద్ధభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, ఈవీడీఎం డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి , ఆయా ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్యాస్‌బంక్‌లు, పైప్ లైన్లలో అగ్నిప్రమాదాలు జరగకుండా పటిష్ఠ ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లుండాలని సూచించారు. ముఖ్యంగా, వాణిజ్య సిలిండర్లు వినియోగించే రెస్టారెంట్లలో ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లుంటేనే ఇన్సూరెన్స్ జారీ చేసేలా ఇన్సూరెన్స్ కంపెనీలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

గజం రూ.68 వేలు

- బాచుపల్లి స్థలాలకు భారీ డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: బాచుపల్లిలో హెచ్ఎండీఏ స్థలాలకు అనూహ్యమైన స్పందన లభించింది. కొన్ని ప్లాట్లలో గరిష్ఠంగా గజానికి రూ.68 వేల చొప్పున విక్రయించడం విశేషం. శుక్రవారం నిర్వహించిన ఈ–ఆక్షన్‌లో 6133.41 చదరపు గజాల మేరకు ఉన్న 23 ప్లాట్లను అధికారులు విక్రయించారు. ఈ ప్లాట్లపైన రూ.15.33 కోట్ల వరకు ఆదాయం లభించవచ్చునని అంచనా వేయగా అనూహ్యంగా రూ.35.71 కోట్ల మేర లభించినట్లు అధికారులు తెలిపారు. చదరపు గజానికి అప్‌సెట్ ధర రూ.25000 వరకు నిర్ణయించగా 135 శాతం అధికంగా రూ.58,861 వరకు వేలంలో డిమాండ్ వచ్చింది. గురువారం నిర్వహించిన వేలం పాటల్లో 50 ప్లాట్లపై (13635.11 గజాలు)రూ.34.01 కోట్ల ఆదాయం రానున్నట్లు అంచనా వేయగా అనూహ్యంగా రూ.80.65 కోట్లు లభించింది. ఈ రెండు రోజుల్లో బాచుపల్లిలోని 73 ప్లాట్లలో ఉన్న 19,768.52 చదరపు గజాల పైన రూ.49.42 కోట్ల మేర ఆదాయం లభించవచ్చునని అంచనా వేయగా ఆశించిన దానికన్నా రెట్టింపుగా రూ.116.36 కోట్ల వరకు లభించినట్లు అధికారులు పేర్కొన్నారు.

'ఉమెన్స్ డే గ్రీన్-ఇండియా చాలెంజ్' పోస్టర్ ఆవిష్కరణ



బంజారాహిల్స్: సృష్టికి మూలం స్త్రీ మూర్తి అని, మహిళలంతా ప్రకృతి పరిరక్షణ కోసం గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి 'గ్రీన్ ఇండియా చాలెంజ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్ని పెంచిన చేతులతో మహిళలు మొక్కల్ని పెంచితే ప్రకృతి పరవశించిపోతుందన్నారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని చేపడుతున్న గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమంలో మహిళలంతా పాల్గొని మొక్కలు నాటి..వాటిని సంరక్షించాలని మేయర్ పిలుపునిచ్చారు.

జీ-20 సదస్సుకు భద్రతా ఏర్పాట్లపై సమావేశం

రాయదుర్గం: నగరంలో జరగనున్న జీ-20 శిఖరాగ్ర సమావేశం భద్రతా ఏర్పాట్లపై సైబరాబాద్ పోలీసులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో న్యూఢిల్లీలో జీ-20 సమ్మిట్ జరగనున్న నేపథ్యంలో.. ప్రధాన మెట్రో నగరాలలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా త్వరలోనే నగరంలో జరగనున్న ఈ సమావేశానికి హాజరయ్యే ప్రతినిధుల వసతి, రవాణా, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర ఇతర పోలీసులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీలు అవినాష్ మహంతి, నారాయణ్ నాయక్, డీసీపీలు హర్షవర్ధన్, యోగేష్ గౌతమ్, శిల్పవల్లి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లండన్ నగరంలోని అతిపెద్ద జాయింట్ వీల్ ఇది..

ఇదే తరహాలో తెలంగాణ ప్రభుత్వం ట్యాంక్‌బండ్, దుర్గం చెరువు వద్ద త్వరలో ఏర్పాటు చేయనుంది



మరింత జిగేల్

గ్రేటర్‌కు పర్యాటక సొబగులు

- దుర్గం చెరువు, ట్యాంక్ బండ్ వద్ద లండన్ తరహా అతిపెద్ద జాయింట్ వీల్స్
- మహబూబ్‌నగర్‌లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

ఆకాశంలో విహరిస్తున్నట్లు అద్భుతమైన అనుభూతిని కలిగించే భారీ జాయింట్‌వీల్స్, స్కైటవర్స్ త్వరలో హైదరాబాద్ అందాలను మరింత ద్విగుణీకృతం చేయనున్నాయి. నగర పర్యాటక అందాలు సరికొత్త సొబగులను సంతరించుకోనున్నాయి. లండన్ తరహాలో ఏర్పాటు చేయనున్న ఈ జాయింట్ వీల్స్, స్కై టవర్స్ మొదట దుర్గం చెరువు, ట్యాంక్‌బండ్‌పైన అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం మహబూబ్‌నగర్‌లో జరిగిన ఒక సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. స్విట్జర్లాండ్‌కు చెందిన ఇంటామిన్ ఎమ్యూజ్ మెంట్ రైట్స్ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. ఆ సంస్థ ఉపాధ్యక్షుడు జెరార్డ్ స్లైండర్స్‌తో కూడిన చెందిన ప్రతినిధి బృందం మహబూబ్‌నగర్‌లోని కేసీఆర్ అర్బన్ ఎకో పార్కును సందర్శించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. రెండో దశలో కొండపోచమ్మ సాగర్, పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల కింద ఉదండాపూర్, కరివెన రిజర్వాయర్లు, తర్వాత మహబూబ్ నగర్ సహా పలు చోట్ల కూడా అతిపెద్ద జాయింట్ వీల్స్, స్కై టవర్స్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.


– సాక్షి, సిటీబ్యూరో / మహబూబ్‌నగర్

కెమెరాలపై కన్ను



సీసీ కెమెరాల నిర్వహణకు ప్రత్యేక విభాగం

- అవసరమైన ప్రాంతాల గుర్తింపునకు ప్రాధాన్యం
- వీటి పనితీరును పర్యవేక్షించడానికి సన్నాహాలు
- ఈ బాధ్యతలు మరో సంస్థకు అప్పగించేలా నిర్ణయం
- వెల్లడించిన నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్



అధికారులతో సమావేశమైన ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో చోటు చేసుకున్న నేరాల్లో అత్యధికం సీసీ కెమెరాల ఆధారంగానే కొలిక్కి వస్తున్నాయి. మరికొన్ని ఘోరాలను నిరోధించడంలోనూ ఇవి కీలక పాత్ర పోషించాయి. అయితే కొన్ని సందర్భాల్లో ఆయా ప్రాంతాల్లో కెమెరాలు లేకపోవడం, ఉన్నా పని చేయకపోడంతో దర్యాప్తు జటిలంగా మారుతోంది. దీన్ని పరిగణలోకి తీసుకున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యేకంగా డీ–కమో పేరుతో విభాగం ఏర్పాటు చేయడంతో పాటు వీటి ఆడిటింగ్‌ను స్వతంత్ర సంస్థకు అప్పగించాలని నిర్ణయించినట్లు ఆయన శుక్రవారం వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో అదనపు డీసీపీ, ఆపై స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

ఆ రెండూ ఒకే గూటి కింద..

ప్రస్తుతం నగర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో సీసీ కెమెరాలు ఉన్నాయి. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన వాటితో పాటు 'నేను సైతం' కింద ఏర్పాటైన కెమెరాలు కలిపి లక్షల సంఖ్యలో అందుబాటులోకి వచ్చాయి. మరోపక్క ట్రాఫిక్, శాంతిభద్రతల విధుల్లో డ్రోన్ల సేవలు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న డ్రోన్ల వినియోగాన్ని రానున్న రోజుల్లో మరింత విస్తరించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే ఈ రెండు అంశాలకు ఒకే గూటి కిందికి తీసుకువస్తూ డీ–కమో (డ్రోన్స్ అండ్ కెమెరాస్ మెయింటెనెన్స్ ఆర్గనైజేషన్) ఏర్పాటు చేశారు. అదనపు డీసీపీ లేదా ఏసీపీ నేతృత్వం పని చేసే ఈ వింగ్‌లో ఉండే నాలుగు విభాగాలు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది.

సీసీ కెమెరాల ఆడిటింగ్...

సిటీలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కెమెరాల పనితీరు పరిశీలించడంతో పాటు కొత్తగా వీటి ఏర్పాటు అవసరమైన ప్రాంతాలను గుర్తించడానికి కీలక ప్రాధాన్యం ఇవ్వాలని కొత్వాల్ నిర్ణయించారు. ఈ బాధ్యతలు ఓ స్వతంత్ర సంస్థకు అప్పగించడానికి సన్నాహాలు చేస్తున్నారు. నగర పోలీసు విభాగం ఎమ్యూజ్‌మెంట్ లైసెన్సుల్ని ఆన్‌లైన్‌లో జారీ చేస్తోంది. గడిచిన కొన్ని వారాల్లోనే 1183 మంది ఈ సేవలు వినియోగించుకున్నారు. భవిష్యత్తులో ఆయుధ లైసెన్సుల జారీని ఆన్‌లైన్ చేయాలని నిర్ణయించారు.

అన్ని స్థాయిల వారికీ సీపీఆర్‌పై అవగాహన..

జిమ్‌లో వ్యాయామం చేస్తూ గుండెపోటుకు గురై ప్రాణాలు వదిలిన యువ కానిస్టేబుల్ ఉదంతం నేపథ్యంలో సీపీఆర్‌పై అన్ని స్థాయి అధికారులకు అవగాహన కల్పించాలని కొత్వాల్ ఆనంద్ నిర్ణయించారు. మరోపక్క ఫిట్‌కాప్ కార్యక్రమం ద్వారా అందరికీ ఆరోగ్యం పెంపొందించడంపై మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నారు. 2023 యాక్షన్ ప్లాన్, గస్తీ బృందాల పని తీరు, పోలీసుస్టేషన్ల పరిపాలన, లాకప్, కస్టడీ ప్రొటోకాల్స్ అమలు తదితరాలను డీసీపీలు స్వయంగా పర్యవేక్షించాలని ఆనంద్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, జి.సుధీర్‌బాబు, ఏఆర్ శ్రీనివాస్, సంయుక్త సీపీలు బి.పరిమళ హన నూతన్, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అగ్రి షోపై ఆసక్తిగా..



మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం కిసాన్ అగ్రీ షో ప్రారంభమైంది. విద్యార్థులు సైతం ఈ షోకు హాజరై వ్యవసాయానికి సంబంధించిన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. వ్యవసాయ పనిముట్లు, ఆధునిక యంత్రాల గురించి అడిగి తెలుసుకున్నారు. - మాదాపూర్

కుక్కల బెడద నివారణకు హైలెవల్ కమిటీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వీధి కుక్కల నియంత్రణ, కుక్క కాటు నివారణకు కార్పొరేటర్లతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. కుక్కల బెడదపై ఇటీవల జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు, ఈ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా బీఆర్ఎస్ నుంచి సీఎన్‌రెడ్డి (రహ్మత్‌నగర్), బన్నాల గీతాప్రవీణ్ (చిలుకానగర్), బీజేపీ నుంచి పద్మా వెంకట్‌రెడ్డి (బాగ్‌అంబర్‌పేట), వి.శ్రావణ్ (మల్కాజిగిరి), కాంగ్రెస్ నుంచి దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి (లింగోజిగూడ), ఎం.రజిత (ఉప్పల్), ఎంఐఎంనుంచి సయ్యద్ సొహైల్‌ఖాద్రి (పత్తర్‌గట్టి), మీర్జా ముస్తఫాబేగ్ (రియాసత్‌నగర్)లను నియమించారు. కమిటీకి కోఆర్డినేట్ ఆఫీసర్‌గా వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డా.జేడీ విల్సన్ వ్యవహరిస్తారు. ఈ కమిటీ జీహెచ్ఎంసీలోని యానిమల్ కేర్ సెంటర్లను పరిశీలించి, తగిన సూచనలతో నివేదిక నందజేస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇక ఈజీగా కాలేజీకి..

విద్యార్థులకు తీరనున్న బస్సు కష్టాలు

- రద్దీకనుగుణంగా అన్ని వైపులా బస్సుల సంఖ్య పెంపు
- అమ్మాయిల కోసం 'లేడీస్ స్పెషల్స్' సైతం

సాక్షి, సిటీబ్యూరో: కళాశాలలకు వెళ్లేందుకు...తిరిగి ఇంటికి వచ్చేందుకు సరైన సంఖ్యలో బస్సులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఇది శుభవార్త. ఇకపై రద్దీకనుగుణంగా వివిధ మార్గాల్లో బస్సుల సంఖ్యను పెంచేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. నగరానికి నలువైపులా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలు, ఇతర ఒకేషనల్ విద్యాసంస్థల్లో చదువుకొనేందుకు ప్రతిరోజు లక్షలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. కానీ సకాలంలో బస్సులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా సరైన రవాణా సదుపాయం లేకపోవడం వల్ల విద్యార్థినులు మరిన్ని ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం విద్యార్థుల సమస్యలపైన ప్రత్యేకంగా దృష్టి సారించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వివిధ మార్గాలపైన సమీక్ష నిర్వహించారు. కళాశాలలు, విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న బస్సులు తదితర అంశాలపైన అధికారులతో చర్చించారు.



ప్రస్తుతం నగరానికి అన్ని వైపులా కాలేజీలకు వెళ్లే విద్యార్థుల కోసం ఆర్టీసీ అదనపు బస్సులను నడిపేందుకు కార్యాచరణ చేపట్టింది.

పెంపు ఇలా..

- ఎల్బీనగర్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు 15 బస్సులను అదనంగా పెంచారు. అలాగే ఎల్బీ నగర్ నుంచి ఇబ్రహీంపట్నం గురునానక్ యూనివర్సిటీ వరకు ప్రతి రోజు 9 బస్సులు రాకపోకలు సాగిస్తాయి.
- బడంగ్‌పేట్, మిధానీ నుంచి ఇబ్రహీంపట్నం సెక్టార్‌లో 6 బస్సులను ఏర్పాటు చేశారు.
- దిల్‌సుఖ్‌నగర్, జేబీఎస్, ఎల్బీ నగర్‌ల నుంచి అబ్దుల్లాపూర్‌మెట్, మజీద్‌పూర్ వరకు 6 బస్సులను అదనంగా ఏర్పాటు చేశారు.
- మెహదీపట్నం నుంచి శంకర్‌పల్లి, మొయినాబాద్ వరకు 10 బస్సులను ఏర్పాటు చేశారు. శంషాబాద్ నుంచి వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ వరకు 2 బస్సులు, మేడ్చల్, సుచిత్ర, మియాపూర్‌ల నుంచి గండిమైసమ్మ వరకు 10 బస్సులను అదనంగా అందుబాటులోకి తెచ్చారు.
- ఈసీఐఎల్, ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వైపు 11 బస్సులను, బోయిన్‌పల్లి, సుచిత్ర నుంచి మేడ్చల్ వైపు 7 బస్సులను ఏర్పాటు చేశారు.
- దూలపల్లి క్రాస్‌రోడ్స్ నుంచి బహదూర్‌పల్లి సెక్టార్‌లో మరో 7 బస్సులను, ఉప్పల్ క్రాస్‌రోడ్స్ నుంచి ఆరాంఘర్ వరకు 2 బస్సులను అదనంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్న 85 బస్సులకు అదనంగా ప్రస్తుతం మరో 55 బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.
- ఈ బస్సులు ఉదయం 7.30 నుంచి 9.30 గంటల మధ్యలో, సాయంత్రం 3.30 నుంచి 6 గంటల మధ్యలో అందుబాటులో ఉంటాయి.

లేడీస్ స్పెషల్స్...

- వివిధ రూట్‌లలో రాకపోకలు సాగించే విద్యార్థినుల కోసం ఉదయం, సాయంత్రం లేడీస్ స్పెషల్స్ నడిపేందుకు చర్యలు చేపట్టారు. ఈ బస్సుల్లో విద్యార్థినిలతో పాటు ఇతర మహిళలు కూడా ప్రయాణం చేయవచ్చు.
- ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి ఘట్‌కేసర్ మీదుగా బోగారం వరకు ఉదయం 8.10, 8.30 గంటలకు రెండు ట్రిప్పులు అందుబాటులో ఉంటాయి.
- బోగారం నుంచి ఘట్‌కేసర్ మీదుగా సికింద్రాబాద్ వరకు సాయంత్రం 4.30 గంటలకు, 5 గంటలకు రెండు బస్సులు బయలుదేరుతాయి.
- ఎల్బీ నగర్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఉదయం 7.35 గంటలకు, 8.35 గంటలకు రెండు బస్సులు ఉంటాయి. తిరిగి ఇబ్రహీంపట్నం నుంచి ఎల్బీ నగర్‌కు సాయంత్రం 4 గంటలకు, 4.15 గంటలకు మరో రెండు బస్సులను నడుపుతారు.
- ఎల్బీ నగర్ నుంచి ఇబ్రహీంపట్నం గురునానక్ వర్సిటీ వరకు ఉదయం 8, 8.15 గంటలకు, తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4.20, 4.30 గంటలకు రెండు బస్సులు ఉంటాయి.

కొండంత బకాయిలు.. గోరంత స్పందన!

- ఆస్తి పన్ను చెల్లింపులో ప్రభుత్వ విభాగాల అలసత్వం
- ఓటీఎస్‌ను వినియోగించుకున్నది కేవలం 19 విభాగాలే

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీకి ఆస్తిపన్ను చెల్లించని ప్రభుత్వ భవనాలు వేలల్లో ఉన్నాయి. ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో భారీయెత్తున బకాయిలు పేరుకుపోయాయి. జీహెచ్ఎంసీ వాటికి నోటీసులు పంపుతున్నా స్పందించడం లేదు. దాంతో జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆస్తిపన్ను బకాయిలు రికార్డుల్లో భారీగా కనిపిస్తున్నా.. కొంచెం కూడా వసూలు కావడం లేదు. ఇటీవల మాత్రం 19 ప్రభుత్వ విభాగాలు స్పందించాయి. తమ పరిధిలోని ఆయా భవనాలకు సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాయి. వడ్డీ బకాయిలపై పెనాల్టీలను 90 శాతం రద్దుచేస్తూ ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్మెంట్ స్కీమ్(ఓటీఎస్)కు అవకాశం కల్పించడంతో కొన్ని సంస్థలు దీన్ని వినియోగించుకున్నాయి. ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆర్టీఐ ద్వారా కోరిన సమాచారానికి బదులిస్తూ జీహెచ్ఎంసీ ఇటీవల ఈ వివరాలు వెల్లడించింది. మిగతా విభాగాల నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. జీహెచ్ఎంసీ గత సంవత్సరం రెండుసార్లు డిమాండ్ నోటీసులు పంపించినా స్పందన కరువైంది.

బకాయిలు చెల్లించిన విభాగాలు..

తమ పరిధిలోని ఆయా భవనాలకు సంబంధించి వ్యవసాయ శాఖ రూ.3.52 కోట్లు, సెరికల్చర్ విభాగం కోటి రూపాయలు చెల్లించాయి. ఇంకా తమ పరిధిలోని కొన్ని భవనాలకు సంబంధించి వైద్య విభాగం రూ.56.57 లక్షలు, విద్యాశాఖ రూ.3.56 లక్షలు, కోఆపరేటివ్ సొసైటీ రూ.16.06 లక్షలు, దేవాదాయశాఖ రూ.14.94 లక్షలు, న్యాయశాఖ రూ.53 లక్షలు, కార్మిక సంక్షేమశాఖ రూ.12.85 లక్షలు, పోలీస్‌స్టేషన్ల భవనాలకు సంబంధించి రూ. 68.52 లక్షలు, ప్రింటింగ్‌ప్రెస్ రూ.42.52 లక్షలు, పౌరసరఫరాల శాఖ రూ.8.93 లక్షలు, సాంఘిక సంక్షేమ శాఖ రూ.10.38 లక్షలు, టూరిజం విభాగం రూ.17.64 లక్షలు, మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిపార్ట్‌మెంట్ రూ.7.70 లక్షలు, స్టేట్‌వేర్ హౌసింగ్ కార్పొరేషన్ రూ.2.70 లక్షలు, వాలంతరి రూ.12.40 లక్షలు, స్టీల్ అథారిటీ రూ.4.62 లక్షలు, ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ఇండియా 3.46 లక్షలు, రీజినల్ డైరెక్టర్ కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ప్రేమావతిపేట్ రూ.4.83 లక్షలు చెల్లించినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. అన్నీవెరసి దాదాపు రూ.8 కోట్లు చెల్లించాయి.



గ్యాస్ ధరలపై భగ్గు

వంటగ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రెండో రోజైన శుక్రవారం గ్రేటర్ పరిధిలోని వివిధ నియోజకవర్గాల్లో ధర్నాలు, కట్టెలతో వంటావార్పు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జూబ్లీ బస్‌స్టేషన్ వద్ద ధర్నా, అల్ఫా హోటల్ సమీపంలో జరిగిన వంటావార్పు కార్యక్రమాల్లో పశుసంవర్ధకశాఖ మంత్రి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో

కండల కోసం స్టెరాయిడ్స్

- ఇంజెక్షన్లతో పాటు టాబ్లెట్ల వినియోగం
- గుట్టురట్టు చేసిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు, భారీగా సరుకు స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: వైద్య రంగంలో అత్యవసర సమయాల్లో వినియోగించే ఇంజెక్షన్లతో పాటు టాబ్లెట్స్‌ను స్టెరాయిడ్స్‌గా విక్రయిస్తున్న ముఠా గుట్టును దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. కొందరు యువకులు తక్కువ కాలంలో కండలు పెంచుకునేందుకు వీటిని వినియోగిస్తున్నట్లు గుర్తించారు. జిమ్‌లలో ఎక్కువ సమయం గడపటానికి ఈ మందులు తీసుకుంటూ తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారని డీసీపీ చక్రవర్తి గుమ్మి తెలిపారు. శుక్రవారం నలుగురు నిందితుల్లో ముగ్గురిని అరెస్టు చేశామని, వీరి నుంచి భారీగా ఇంజెక్షన్లు, టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విశాఖపట్నానికి చెందిన ఓంప్రకాష్ కొన్నేళ్ల క్రితం నగరానికి వలసవచ్చి సనత్‌నగర్ ప్రాంతంలో స్థిరపడ్డాడు. తొలినాళ్లలో కూకట్‌పల్లిలోని ఓ జిమ్‌లో పని చేసిన ఇతగాడు ప్రస్తుతం అమీర్‌పేటలో న్యూట్రీషియన్ సప్లిమెంట్స్ విక్రయించే దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతడికి స్టెరాయిడ్స్‌గా ఉపకరించే హార్మోన్ ఇంజెక్షన్లు తదితరాలకు ఉన్న డిమాండ్ తెలిసింది. తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం వాటిని ఖరీదు చేసి ఎక్కువ ధరకు విక్రయించాలని పథకం వేశాడు. అందుకు చిన్ననాటి స్నేహితుడు విశాఖకు చెందిన ఫార్మా వ్యాపారి అవినాష్‌ను సంప్రదించాడు. అతడికి వివిధ రకాలైన ఔషధాలు, వాటిలో స్టెరాయిడ్స్‌గా ఉపకరించే వాటిపై పట్టుంది. ఓంప్రకాష్ కోరడంతో ఆయా ఇంజెక్షన్లు, టాబ్లెట్స్ సరఫరా చేయడానికి అతను అంగీకరించాడు. డ్యురాడెక్స్, సీ–జెక్ట్ ఇంజెక్షన్లు, స్టామ్‌బెర్, ఏర్లెక్స్, డెబొలాన్ టాబ్లెట్లు ఉత్ప్రేరకాలుగా పని చేస్తాయని వీటిని యువత ఎక్కువగా వాడతారని చెప్పాడు. నగరంలో జిమ్‌లకు వెళ్తున్న యువత నిర్ణీత బరువు కంటే ఎక్కువ వెయిట్స్ ఎత్తడానికి, ఎక్కువ సమయం వ్యాయామం చేయడానికి స్టెరాయిడ్స్‌గా వాడవచ్చని చెప్పాడు. నిబంధనల ప్రకారం వీటిని కేవలం మెడికల్ షాపుల్లో, వైద్యుడి చీటీ ఆధారంగానే విక్రయించాలి. అయితే అవినాష్ వీటిని అక్రమంగా సేకరించి ఓంప్రకాష్‌కు సరఫరా చేసేవాడు. ఇతగాడు జిమ్‌లకు ప్రొటీన్ సప్లిమెంట్స్ సరఫరా చేసే డిస్ట్రిబ్యూటర్ ఎస్.నరేష్, బేగంబజార్‌లోని ఓ జిమ్ ట్రైనర్ సయ్యద్ ఫారూఖ్‌లతో కలిసి వీటిని యువతకు విక్రయిస్తున్నాడు. ఒక్కో ఇంజెక్షన్, టాబ్లెట్‌ను దాని వాస్తవ ధరకు దాదాపు పది నుంచి పదిహేను రెట్లు ఎక్కువకు అమ్ముతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్సైలు వి.నరేందర్, ఎన్.శ్రీశైలం, షేక్ బుర్హాన్, కె.నర్సింహులుతో కూడిన బృందం దాడి చేసి అవినాష్ మినహా మిగిలిన ముగ్గురు నిందితుల్ని పట్టుకుంది. వీరి నుంచి 180 ఇంజెక్షన్లు, 1100 టాబ్లెట్లు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం ఎస్సార్‌నగర్ పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న అవినాష్ కోసం గాలిస్తున్నారు. ఈ ఇంజెక్షన్లు, టాబ్లెట్స్‌ను స్టెరాయిడ్స్‌గా వాడటం వల్ల అనేక దుష్పరిణామాలు ఉంటాయని డీసీపీ హెచ్చరిస్తున్నారు. వీటిని వైద్యుల చీటీ లేనిదే అమ్మడం అక్రమం అని స్పష్టం చేస్తున్నారు. వీటిని సుదీర్ఘకాలం వాడితే రక్తపోటు, గుండె సమస్యలతో పాటు మానసిక ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన పేర్కొన్నాడు.

ఇద్దరు హాష్ ఆయిల్ విక్రేతల అరెస్టు

- రూ.4.40 లక్షల విలువైన హాష్ ఆయిల్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన బాలానగర్ డీసీపీ


స్వాధీనం చేసుకున్న హాష్ ఆయిల్

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి ప్రాంతంలో హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 4.40 లక్షల విలువైన హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన నారా పూజారీ, మధు హంతల్ బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలసవచ్చారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో వీరు హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి నగరంలో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునేందుకు నిర్ణయించారు. సీలేరు ప్రాంతంలో 1100 గ్రాముల హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేశారు. దానిని వారి గ్రామానికి తీసుకెళ్లి 5 గ్రాముల చొప్పున ప్లాస్టిక్ కంటైనర్లలో రీ ప్యాక్ చేసుకున్నారు. గురువారం రాత్రి ఒరిస్సా నుంచి బస్సులో బయలుదేరి శుక్రవారం ఉదయం నగరానికి చేరుకున్నారు. బాలానగర్, ప్రశాంతినగర్ పారిశ్రామిక వాడల్లో వాటిని విక్రయించేందుకు ఆటోలో బయలుదేరారు. దీనిపై సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు వై జంక్షన్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని 220 హాష్ ఆయిల్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు 4.40 లక్షలు ఉంటుందని డీసీపీ తెలిపారు. సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నర్సింగ రావు, డీఐ అంజనేయులు, ఎస్ఓటీ పోలీసులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

కీసర: ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కీసర పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంగూడ గ్రామానికి చెందిన నల్లరాళ్ల ఆకాష్‌రెడ్డి(20) చీర్యాల గ్రామంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం రాత్రి అతను తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం అతను గది లోనుంచి బయటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు తలుపులు బద్ధలు కొట్టి చూడగా ఆకాష్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సమాచారంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆకాష్ గదిలో సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. 'తన చావుకు ఎవరూ కారణం కాదని' అందులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆకాష్‌రెడ్డి తల్లి కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఇటీవలే కొత్తగా ఇంటిని నిర్మించుకున్నామని మరో రెండు రోజుల్లో కొత్త ఇంట్లోకి వెళ్లాల్సి ఉండగా కుమారుడు మృతిచెందడం పట్ల తండ్రి, అతడి సోదరి బోరున విలపించారు.


ఆకాష్‌రెడ్డి (ఫైల్)


ఆకాష్ రాసిన సూసైడ్ నోట్

దొంగబాబా ఆటకట్టు

- బాలికపై లైంగిక దాడికి యత్నం
- గదిలో సీసీ కెమెరాల ఏర్పాటుతో బయటపడ్డ బండారం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు


దొంగ బాబా హఫీజ్ పాషా

లంగర్‌హౌస్: మంత్రాలనెపంతో బాలికతో అసభ్యంగా ప్రవర్తించడమేగాక లైంగిక దాడికి యత్నించి పారిపోయిన దొంగ బాబాను ఎట్టకేలకు లంగర్‌హౌస్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లంగర్‌హౌస్ ఎండీలైన్స్‌లో నివాసం ఉంటున్న బాలిక గత మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలువురు వైద్యులను సంప్రదించినా ప్రయోజనం కనిపించలేదు. ఈ నేపథ్యంలో బంధువుల సూచనమేరకు నెల్లూరు జిల్లా, అన్నాసముద్రం పేట గ్రామంలోని రెహమతాబాద్ షరీఫ్ దర్గా పెద్ద షా గులామ్ నక్స్‌బాండ్ హఫీజ్ పాషాను సంప్రదించారు. మంత్రాలతో ఆమె వ్యాధి నయం చేస్తానని పలుమార్లు నెల్లూరుకు రప్పించాడు. తాను కూడా తరచూ నగరానికి వచ్చి మలక్‌పేటలో ఉంటూ బాధితులను కలిసేవాడు.

బాలికతో అసభ్య ప్రవర్తన....

మంత్రాలు చదువుతూ వ్యాధి నయం చేస్తున్నట్లు నటిస్తూ నెల్లూరులో పలుమార్లు బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. జనవరిలో నగరంలోని బాధితురాలి ఇంటికి వచ్చిన బాబా ఆమె కుటుంబీకులను బయటికి పంపి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పగా, ఆమెకు పిచ్చి ముదిరిందని బాబా చెప్పడంతో వారు అతని మాటే నమ్మారు. ఫిబ్రవరి మొదటి వారంలో మరోసారి బాబా ఆమెను కలవాలని చెప్పడంతో కుటుంబసభ్యులు అతనికి తెలియకుండా ఆ గదిలో సీసీ కెమెరాలను అమర్చారు. గదిలోకి వెళ్లిన బాబా బాలికతో అసభ్యంగా ప్రవర్తించడాన్ని గుర్తించిన కుటుంబీకులు అతడిని నిలదీయగా ఆమెను వివాహం చేసుకుంటానని చెప్పాడు. ఫిబ్రవరి 11 న వివాహానికి ఏర్పాట్లు చేయగా అనారోగ్యం పేరుతో ఆస్పత్రిలో చేరిన అతను కొందరు పెద్దల సహకారంతో అక్కడి నుంచి పరారయ్యాడు. గొడవ పెద్దది కావడంతో మతపెద్దలు, వక్ఫ్‌బోర్డు నిర్వాహకులు జోక్యం చేసుకుని నిందితుడిని దర్గా నిర్వహణ బాధ్యతల నుంచి తొలగించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం నిందితుడు హఫీజ్ పాషాను మలక్‌పేటలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అట్టహాసంగా కొత్వాల్ కేసరి ప్రారంభం

- 5 వరకు రెజ్లింగ్ చాంపియన్‌షిప్–2023
- తెలంగాణలో మొదటిసారి సిటీ సీపీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీల నిర్వహణ


దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యతో కలిసి కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న ఉన్నతాధికారులు

చార్మినార్: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో దక్షిణ మండలానికి ప్రత్యేక స్థానం ఉందని నగర జాయింట్ పోలీసు కమిషనర్(ఎస్‌బీ) విశ్వ ప్రసాద్ అన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈ నెల 5 వరకు జరుగనున్న కొత్వాల్ కేసరి కుస్తీ పోటీల చాంపియన్‌షిప్–2023 శుక్రవారం సాయంత్రం కుడా స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమైంది. సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పర్యవేక్షణలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఆధ్వర్యంలో కులీ కుతుబ్ షా స్టేడియంలో జరుగుతున్న ఈ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వస్తాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. మొదటిసారి తెలంగాణలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య మాట్లాడుతూ..కుస్తీ పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలందరికీ రూ. 8 లక్షల విలువైన నగదు బహుమతులు అందజేస్తామన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా హాజరైన వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. సీనియర్స్ 50కేజీ, 57కేజీ, 65కేజీ, 74కేజీ, 86కేజీ, 97కేజీల విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. మహిళల విభాగంలో 50–57 కేజీలు, 60–68 కేజీలు, 80–120 కేజీల టైటిల్ వెయిట్ కేటగిరిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు, మెరిట్ సర్టిఫికెట్, మెడల్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నగర అదనపు సీపీ (ట్రాఫిక్) సుధీర్ బాబు, డీఐజీ(పీ అండ్ ఎల్)రమేష్ రెడ్డి, జాయింట్ సీపీ(సీఏఆర్) ఎం.శ్రీనివాస్ పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


కుస్తీ పోటీల్లో పాల్గొన్న వస్తాదులు

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

- రాష్ట్ర గవర్నర్ తమిళిసై
- రాజబొల్లారం తండాలో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గవర్నర్


మందులను పరిశీలిస్తున్న గవర్నర్

మేడ్చల్: దేశంలో పేద ప్రజల ఆరోగ్యం కోసం ప్రధాని నరేంద్రమోదీ పెద్ద పీట వేస్తున్నారని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని రాజబొల్లారం తండాలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలు ఎప్పుడూ ఆరోగ్యంగా, సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఔషధ పరియోజనతో పేదలకు మందుల భారం చాలా వరకు తగ్గుతుందన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా తండాలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలోని ఔషధాలను పరిశీలించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులతో ముచ్చటించారు. సంత్ సేవాలాల్ మందిరంలోకి వెళ్లి ఆయనను దర్శించుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాంగ్యానాయక్ అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జెడ్పీ సీఈఓ దేవసహాయం, డీపీఓ రమణమూర్తి, ఐఆర్‌ఎస్ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీ సభ్యురాలు అంకితరవి, మండల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ 1వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. 1వ అదనపు జిల్లా, మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు ఏపీపీ కొంగర రాజి రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న దంపతులకు నలుగురు కుమార్తెలు, తండ్రి తోపుడు బండి వ్యాపారం చేస్తుండగా, తల్లి ఇళ్లల్లో పని చేస్తూ జీవనం సాగించేవారు. 2014 జూన్ 12న వారు తమ పెద్ద కుమార్తె(8)ను ఇంటి వద్ద వదిలి పనికి వెళ్లారు. దీనిని అదనుగా తీసుకున్న అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్ వారి ఇంట్లోకి చొరబడి బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇంటికి తిరిగి వచ్చిన తల్లితో బాధితురాలు జరిగిన విషయం చెప్పడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన రాజేంద్రనగర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం 1వ అదనపు జిల్లా, మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్. తిరుపతి తీర్పు చెప్పారు.

యువకుడి దారుణ హత్య


ఘటనాస్థలం వద్ద ఆధారాలు సేకరిస్తున్న జవహర్‌నగర్ పోలీసులు

జవహర్‌నగర్: ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కౌకూర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాప్రాల్ సమీపంలోని కౌకూర్‌లో నివాసముంటున్న ఎండీ షఫీ కుమారుడు సైఫ్ ఆలీఖాన్(28) శామీర్‌పేట్‌లో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం అతను తిరుపతికి చెందిన యువతిని కులాంత వివాహం చేసుకున్నాడు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో భార్యతో వేరే కాపురం పెట్టాడు. గత కొన్ని రోజులుగా భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో సైఫ్ ఆలీఖాన్ తల్లిదండ్రులతోనే ఉంటున్నాడు.

తండ్రి వద్ద రూ.20 తీసుకుని

గురువారం రాత్రి సైఫ్ ఆలీఖాన్ తండ్రి వద్ద రూ.20 తీసుకుని బయటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం స్థానికులు తీవ్ర గాయాలతో పడిఉన్న అతడిని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే సైఫ్ ఆలీఖాన్ మృతి చెంది ఉన్నాడు. జవహర్‌నగర్ సీఐ సీతారాం, ఎస్ఐలు మోహన్‌నాయక్, అనిల్, సాయిలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

హత్య కేసులో నిందితుడు

కౌకూర్ భరత్‌నగర్‌లో ఆరు నెలల క్రితం మతి స్థిమితంలేని వ్యక్తి కాలనీలో గొడవలు చేస్తుండటంతో కాలనీవాసులు అతడిపై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దాడి చేసిన వారిలో సైఫ్ఆలీఖాన్ కూడా ఉండటంతో అతనిపై కేసు నమోదైంది.


సైఫ్ ఆలీఖాన్ (ఫైల్)

"అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం

సైఫ్ ఆలీఖాన్ హత్య కేసులో నిందితులను త్వరలోనే పట్టుకుంటామని మల్కాజిగిరి డీసీపీ జానకి తెలిపారు. మృతుడు గురువారం రాత్రి స్నేహితులతో కలిసి మద్యం సేవించాడని, ఈ ఘటనలో అతని స్నేహితుల హస్తం ఉన్నట్లు తెలిసిందన్నారు. నిందితులను పట్టుకునేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

– మల్కాజిగిరి డీసీపీ జానకి

క్లుప్తంగా

దెబ్బతిన్న పైప్‌లైన్ల పరిశీలన

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్‌లో దెబ్బతిన్న డ్రైనేజీ పైప్‌లైన్లు, మ్యాన్‌హోళ్లను శుక్రవారం కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పరిశీలించారు. ఇక్కడి పరిస్థితిని తెలుసుకున్న ఆయన సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పైప్‌లైన్ పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని వారికి సూచించారు.

మెస్ చార్జీల పెంపు అభినందనీయం

లిబర్టీ: రాష్ట్రంలో సంక్షేమ, వసతి గృహాల్లోని విద్యార్థులకు మెస్‌చార్జీల బిల్లులు పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని బీఆర్‌ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందం అన్నారు. మెస్ బిల్లులు 25 శాతం పెంచేందుకు ప్రభుత్వం దాదాపు అంగీకరించిందని ఆయన పేర్కొన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు ఫైల్ చేరిందని సంతకం పెట్టడమే మిగిలిందన్నారు. మెస్ చార్జీలు పెంచడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.300 కోట్లకు పైగా భారం పడుతుందని ఆయన తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2017లో మెస్ చార్జీలు పెంచినట్లు గుర్తు చేశారు.

'కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి'

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సవరించి బీసీల సమగ్రాభివృద్ధి కోసం రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి డిమాండ్ చేశారు. 2023–24 వార్షిక బడ్జెట్‌లో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించి బీసీలకు అన్యాయం చేశారని ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి తిరిగి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్న క్రమంలో బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో సవరించి బీసీలకు మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీకి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే జాతీయ స్థాయిలో బీసీబంధు ప్రవేశపెట్టి నిజాయితీ నిరూపించుకోవాలని ఆయన సూచించారు.

ఆకట్టుకున్న వజ్రాభరణాల ప్రదర్శన



బంజారాహిల్స్: మహిళలు కోరుకునే విభిన్నమైన లేటెస్ట్ ఆభరణాలను, వజ్రాలను నగరవాసులకు అందించేందుకు జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లో త్రిధా పేరుతో ఆభరణాల ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. టాలీవుడ్ హీరోయిన్ గజల్ సోమయ ఈ ఆభరణాల ప్రదర్శనను ప్రారంభించి సందడి చేసింది. దేశంలోని ప్రముఖ ఆభరణాల తయారీ సంస్థల్లో ఒకటైన సునీతా జ్యువెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన త్రిధాలో విభిన్నమైన వజ్రాలు, బంగారం, రత్నాలు, ప్లాటినం తదితర ఆభరణాలు అందుబాటులోకి తీసుకొచ్చామని సంస్థ నిర్వాహకురాలు కబ్యా బగారియా తెలిపారు. రెడీమేడ్ ఆభరణాలతో పాటు వినియోగదారులు కోరుకున్న రీతిలో డిజైన్లను తయారు చేసి అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరంలోని పలువురు మోడల్స్ పాల్గొని సందడి చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 11 మందికి జరిమానా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వేర్వేరు చోట్ల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం తాగి పట్టుబడిన 11 మందికి కోర్టు జరిమానా విధించింది. శుక్రవారం నాంపల్లిలోని నాల్గవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట వారిని హాజరుపర్చగా ఒక్కొక్కరికి 2100 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

వినికిడి సమస్యలపై అవగాహన పెరగాలి

గాంధీఆస్పత్రి: వినికిడి సమస్యలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచించారు. ప్రపంచ హియరింగ్ డే సందర్భంగా ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి, గాంధీ ఈఎన్‌టీ విభాగం, ఏఓఐ హైదరాబాద్ శాఖ, కాక్లియర్ ఇంప్లాంట్ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వద్ద శుక్రవారం వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ.. వినికిడి లోపంతో పుట్టే చిన్నారులను గుర్తించేందుకు అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రాథమిక దశలో గుర్తించి వైద్య చికిత్సలు అందిస్తే భవిష్యత్తులో వినికిడిలోపం లేని సమాజాన్ని ఆవిష్కరించవచ్చన్నారు. వైద్య శాఖ మంత్రి హరీష్‌రావు కృషితో కోఠి ఈఎన్‌టీ, గాంధీ ఆస్పత్రుల్లో లక్షలాది రూపాయల విలువైన కాక్లియర్ శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గాంధీ, ఈఎన్‌టీ ఆస్పత్రులు సూపరింటెండెంట్లు రాజారావు, శంకర్, గాంధీ ఈఎన్‌టీ విభాగాధిపతి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మెటల్ డిటెక్టర్‌తో తగ్గనున్న తవ్వకాలు

- మ్యాన్‌హోళ్లను గుర్తించేందుకు అందుబాటులోకి సీ స్కోప్ మెటల్ డిటెక్టర్
- ప్రయోగాత్మకంగా జలమండలి డివిజన్–6లో అమలు

బంజారాహిల్స్: రోడ్లు వేసే సమయంలో మ్యాన్‌హోల్ మూతలపై తారు, కాంక్రీట్ వేసి మూసేయడం వల్ల లీకేజీ ఏర్పడినప్పుడు అది ఎక్కడుందో తెలుసుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లను ఎక్కడపడితే అక్కడ తవ్వాల్సి వస్తోంది. కొన్ని చోట్ల అవసరం లేకున్నా రోడ్డును తవ్వడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జలమండలి డివిజన్–6 పరిధిలో కొత్తగా సీ–స్కోప్ మెటల్ కవర్ లొకేటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రేటర్ పరిధిలో మొట్ట మొదటిసారిగా ప్రయోగాత్మకంగా దీనిని ఇక్కడ విని యోగిస్తున్నారు. మ్యాన్‌హోల్ మూతలపై తారు, సీసీ ఉన్నప్పటికీ ఈ మెటల్ డిటెక్టర్‌తో తేలికగా ఆ ప్రాంతాన్ని గుర్తించవచ్చు. ఈ సీ–స్కోప్ మెటల్ డిటెక్టర్‌ను రెండు రోజుల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చారు. మ్యాన్‌హోల్ మూతలపై, తాగునీటి పైప్‌లైన వాల్వ్‌లపై మూడు అడుగుల మేర బీటీ, సిమెంటు రోడ్లు వేసినా దీని ద్వారా ఆ ప్రాంతాన్ని గుర్తించేందుకు వీలవుతుంది.

వేగంగా మ్యాన్‌హోళ్ల గుర్తింపు..

ఈ విధానంతో తవ్వకాలు తగ్గుముఖం పడతాయని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మ్యాన్‌హోల్ మూతల కోసం పెద్ద ఎత్తున రోడ్ల తవ్వకాలు చేపడుతున్నారు. అనంతరం వాటిని జీహెచ్‌ఎంసీ అధికారులు నెలల తరబడి వదిలేయడం వల్ల వర్షాకాలంలో వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ మెటల్ డిటెక్టర్‌తో 90 శాతం వరకు మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని జలమండలి జీఎం హరిశంకర్ వెల్లడించారు. ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ విధానం విజయవంతమైతే మిగిలిన ప్రాంతాలకు సైతం విస్తరిస్తామని చెప్పారు. ఎక్కడైనా సీవరేజీ ఓవర్‌ఫ్లో అయినప్పుడు ఆ లొకేషన్ గుర్తించేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుందన్నారు. గడిచిన మూడు రోజులుగా సీ స్కోప్ పరికరాన్ని ఉపయోగించి వేగవంతంగా మ్యాన్‌హోళ్లను గుర్తిస్తున్నట్లు ఆయన తెలిపారు. మ్యాన్‌హోళ్లు, తాగునీటి పైప్‌లైన్ల వాల్వ్‌లు ఎక్కడ ఉన్నాయో సైతం ఈ పరికరంలో నమోదవుతుందని ఆయన వెల్లడించారు.



సీ స్కోప్ మెటల్ డిటెక్టర్‌తో మ్యాన్‌హోళ్లను తనిఖీ చేస్తున్న జలమండలి సిబ్బంది

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

వెంగళరావునగర్: తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపించారు. డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలో ఉన్న బంజారాహిల్స్ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట శుక్రవారం తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈ జేఏసీ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. పీఆర్‌సీతో పాటు అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 24 గంటల విద్యుత్ కోసం అన్నిస్థాయిల్లోని విద్యుత్ ఉద్యోగులందరూ కృషి చేస్తుంటే ప్రభుత్వం, అధికారులు గుర్తించడం లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సర్వేశ్వర్, వైస్ చైర్మన్ చంద్రుడు, కన్వీనర్ చిత్తరంజన్, నాయకులు రమేష్, వర్ధన్‌నాయక్, అభిలాష్, నరహరియాదవ్ పాల్గొన్నారు.

బంజారాహిల్స్: పీఆర్‌సీతో పాటు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ సాధనకై శుక్రవారం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు మధ్యాహ్న భోజన సమయంలో ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022 ఏప్రిల్ నుంచి పీఆర్‌సీ అమలు కావాల్సి ఉండగా ఇంత వరకు ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీని కారణంగానే విద్యుత్ ఎంప్లాయీస్ జేఏసీగా ఏర్పడి ఆందోళన చేపడుతున్నామన్నారు. జేఏసీ నాయకులు చంద్రుడు, రమేష్, సర్వేష్, వర్ధిన్, సంతోష్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నేతలు

ధరల పెంపుపై తగ్గని ఆగ్రహం



నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

- గ్యాస్ ధర పెంపుపై రెండోరోజూ నిరసనల వెల్లువ
- కేంద్ర ప్రభుత్వంపై మండిపడిన బీఆర్‌ఎస్ నేతలు

రహమత్‌నగర్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను మరోసారి పెంచి పేదలపై ఆర్థిక భారం మోపిందని హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ బోరబండ బస్‌స్టాప్ వద్ద శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరుచూ పెరుగుతున్న గ్యాస్ ధరలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం ధరలు పెంచుతూ భారం మోపుతుందని విమర్శించారు. జీహెచ్‌ఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్ పటేల్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, జీటీఎస్ టెంపుల్ చైర్మన్ చిన్న రమేశ్, బోరబండ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో..

ఫిలింనగర్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలపై రెండోరోజూ ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఫిలింనగర్‌లోని విగ్రహాల చౌరస్తాలో జరిగిన ధర్నాలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెంచిన సిలిండర్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏడాదిలో నాలుగు సార్లు గ్యాస్ ధరలు పెంచితే సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎలా బతుకుతారని మండిపడ్డారు.

సోమాజిగూడలో..

పంజగుట్ట: ధరల పెంపుతో పేద, మధ్య తరగతి ప్రజల ఇబ్బందులు పడుతున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ శుక్రవారం ఖైరతాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమాజిగూడ రాజీవ్‌సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరలను అదుపు చేయడంలో విఫలమైన మోదీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు.

హిమాయత్‌నగర్: కేంద్రం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హిమాయత్‌నగర్ వైజంక్షన్‌లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ హేమలత యాదవ్ మాట్లాడుతూ.. మోదీ పాలనలో సామాన్యుడు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

శ్రీసాయిరాం స్కూల్ వార్షికోత్సవం



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో శ్రీసాయిరాం స్కూల్స్, శ్రీనిధి స్కూల్స్ రాఘవేంద్రకాలనీ, కొండాపూర్ బ్రాంచ్‌ల వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి హాజరయ్యారు. కష్టపడి చదివి విద్యార్థులు వారు ఎంచుకున్న రంగాల్లో రాణించాలని వేణుగోపాలాచారి సూచించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ సుధీర్ చంద్ర, శ్రీసాయిరాం స్కూల్స్ చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వరరావు, ప్రెసిడెంట్ నల్లపాటి రాజేశ్వరి, ప్రిన్సిపాల్ క్రాంతి పాల్గొన్నారు.

533 మందికి కంటి పరీక్షలు

బంజారాహిల్స్: ఉచిత కంటి వైద్య శిబిరాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట పరిధిలోని కంటి వైద్య శిబిరాల్లో 583 మంది పరీక్షలు నిర్వహించారు. ఇందులో 96 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 26 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేసినట్లు డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి తెలిపారు.

టీఎస్ స్టడీ సర్కిల్‌లో విద్యార్థుల ఆందోళన

బంజారాహిల్స్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్ స్టడీ సర్కిల్ విద్యార్థులు శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని స్టడీ సర్కిల్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. అధికారులతో పలుమార్లు తమ సమస్యలపై మాట్లాడినప్పటికీ సరైన సమాధానం రావడం లేదని విద్యార్థులు ఆరోపించారు. అకడమిక్ కోఆర్డినేటర్‌గా అనధికారిక విధులు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీధర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బైఠాయించారు. మరో రెండు నెలల్లో పోటీ పరీక్షలు ఉండగా ఇప్పటి వరకు 50 శాతం సిలబస్ పూర్తి కాలేదని వారు అన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులను కాకుండా అనుభవం లేని వారితో క్లాసులు చెప్పిస్తున్నారని, దీనివల్ల తాము నష్టపోతున్నామని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అంకిత భావం, చిత్తశుద్ధి కొరవడి విద్యార్థుల ఆశయాలకు విరుద్ధంగా ఇక్కడ పాలన కొనసాగుతుందని ఆరోపించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

చిన్న పరిశ్రమలను ప్రోత్సహిస్తాం



పంజగుట్ట: మున్నూరుకాపు మహిళా పరస్పర సహకార పొదుపు, పరపతి సంఘం రాష్ట్ర డైరెక్టర్‌గా ఎటిగడ్డ అరుణాపటేల్, ఉన్నత కార్యనిర్వహణ అధికారిగా సర్దార్ పూటం పురుషోత్తమరావు నియమితులయ్యారు. ఈ మేరకు మహిళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు ఎర్రమంజిల్‌లోని సంఘం కార్యాలయంలో వారు తెలిపారు. పొదుపు సంఘంలో చిన్నతరహా పరిశ్రమలు స్థాపించుకునే విధంగా ప్రోత్సహిస్తామని పురుషోత్తంపటేల్ తెలిపారు.

వీధి కుక్కలపై విద్యార్థులకు అవగాహన

బంజారాహిల్స్: కుక్కకాటు ప్రమాదాలపై శుక్రవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పంజగుట్టలోని పడవ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. కుక్కలను చూసి పరుగులు తీయవద్దని చెప్పారు. కుక్కలపైకి రాళ్లు విసరవద్దని, వాటి వైపు తీక్షణంగా చూడవద్దని సూచించారు. అవి గుంపుగా ఉన్నప్పుడు వాటికి దూరంగా వెళ్లాలని వారు చెప్పారు.



చేనేత సంఘాలను ఐక్యం చేస్తాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

పంజగుట్ట: జాతీయ స్థాయిలో చేనేత సంఘాలను ఐక్యం చేసి చేనేత కార్మికులు, చేనేత కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేసినట్లు ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్ తెలిపారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన రామాంతాపూర్‌లోని కర్ణాటి గార్డెన్స్‌లో చేనేతల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు సమ్మేళనం కరపత్రాన్ని శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫెడరేషన్ అధికార ప్రతినిధి రాపోలు జగన్, మాజీ ఎంపీపీ వేముల బాలరాజుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళికి నాగరికత నేర్పిన కుటుంబాలు ప్రస్తుతం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించి, పలు పథకాలు ఇచ్చేవని, ప్రస్తుతం వాటిని రద్దు చేయడం బాధాకరమన్నారు. సమావేశంలో పి.సబిత, రాపోలు జ్ఞానేశ్వర్, బోర రాజేశ్వర్, శాంతికుమార్, వెంకటేశ్వర్‌రావు, శంకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రెండింగో ట్రెండింగో.. పాట ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సంగీత దర్శకుడు రఘు కుంచె లిరిక్స్ అండ్ కాన్సెప్ట్ అందించడంతో పాటు ఆయన నటించిన 'ట్రెండింగో ట్రెండింగో' పాటను కట్టా వంశీకృష్ణ (కేవీకే) దర్శకత్వంలో సుదీష్ నాయర్, చరణ్, కేవీకే కొరియోగ్రఫీలో రూపొందించారు. ఈ పాటను శ్రీనందన్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ టి.విజయలక్ష్మి నిర్మించారు. ఈ పాటను ప్రసాద్ ల్యాబ్‌లో రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి హీరోయిన్ లయ, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్, లిరిసిస్ట్ చంద్రబోస్, దర్శకులు అనిల్ కన్నెగంటి, కరుణకుమార్, రైటర్ లక్ష్మీ భూపాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘు కుంచె మాట్లాడుతూ.. ప్రపంచంలో జరిగే కొన్ని విషయాలు ట్రెండ్ అవుతుంటాయి. ట్రెండింగ్ కాన్సెప్ట్‌పై పాట చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన రావడంతో ఈ పాటకు లిరిక్స్ రాసినట్లు తెలిపారు. అమెరికాలోని డల్లాస్ నగరంలో షూట్ చేశామన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి తైక్వాండో సర్టిఫికెట్



వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిట్ల సుశీల్‌కుమార్‌కు తైక్వాండో సర్టిఫికెట్ లభించింది. ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో ఆయన విజయం సాధించారు. ఈ నేపథ్యంలో తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం సుశీల్‌కు బ్లాక్‌బెల్ట్ ఫోర్త్(4) డాన్ సర్టిఫికెట్‌ను అందజేశారు.

మూగ జీవాలకు సేవలు అభినందనీయం



రమేశ్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: వీధి కుక్కలకు సేవలందిస్తున్న జంతు ప్రేమికుడు రమేశ్‌తో కలిసి డివిజన్‌లో సేవా కార్యక్రమాలు చేపడతామని కార్పొరేటర్ సీఎస్ రెడ్డి అన్నారు. రమేశ్‌ను తన కార్యాలయంలో కార్పొరేటర్ సన్మానించారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్పీఆర్‌హిల్స్ వినాయకనగర్ బస్తీకి చెందిన రమేశ్ గత పదిహేను సంవత్సరాలుగా మూగ జీవాలకు ఎన్నో సేవలు అందిస్తున్నారని, ఆయన కృషి అభినందనీయం అన్నారు. మూగ జీవాల కోసం రమేశ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశాడని, అతడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.



సంతకం ఫోర్జరీ చేసి కారు అమ్ముకున్నారని ఫిర్యాదు

పంజగుట్ట: తన సంతకం ఫోర్జరీ చేసి కారును బదిలీ చేసిన కార్–24 సంస్థ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ చాచా నెహ్రూనగర్‌కు చెందిన బలరాం తన కారు అమ్మేందుకు కార్స్–24 సంస్థను సంప్రదించాడు. సంస్థ ప్రతినిధుల సూచన మేరకు ఆర్‌సీ, ఆధార్ కార్డు, పాన్‌కార్డు ఫోటోలు వాట్సాప్ ద్వారా పంపించాడు. బదిలీపత్రాలు తీసుకురావాలని సంస్థ ప్రతినిధులకు ఫోన్ చేయగా కారు బదిలీ జరిగిపోయిందని చెప్పారు. అయితే తాను సంతకం చేయకుండా ఎలా చేస్తారని ప్రశ్నించగా ఇదంతా తమ సంస్థలో సాధారణమని బదులిచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తాజ్ డెక్కన్ హోటల్‌లో 3వ తేదీన ప్రారంభమైన ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ 4, 5 తేదీల్లోనూ కొనసాగనుంది. పెళ్లి కుమార్తెలకు సంబంధించిన అన్ని ఆభరణాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

తాజ్ డెక్కన్ హోటల్‌లో 3వ తేదీన ప్రారంభమైన ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ 4, 5 తేదీల్లోనూ కొనసాగనుంది. పెళ్లి కుమార్తెలకు సంబంధించిన అన్ని ఆభరణాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

అత్తింటి వేధింపులతో సోదరి మృతిచెందిందని ఫిర్యాదు

పంజగుట్ట: తన సోదరి మృతికి ఆమె భర్త, అత్తింటి వేధింపులే కారణం అని, వారిపై చర్యలు తీసుకోవాలని కాచిగూడ నింబోలిఅడ్డకు చెందిన జి.విక్రమ్ రాజ్ శుక్రవారం పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విక్రమ్‌రాజ్ సోదరి కార్తీకకు 2006లో జగదీష్ కామ్లేకర్‌తో వివాహం జరిగినట్లు తెలిపారు. వివాహం జరిగినప్పటి నుంచి భర్త జగదీష్, అత్త మామలు, ఆడపడుచు వేధిస్తున్నారని, ఇద్దరు పిల్లలు ఉండడంతో వారికోసం ఎంతో సహనంగా ఉండేదన్నారు. పెద్దల సమక్షంలో పలుమార్లు హెచ్చరించినా వారి తీరు మారలేదని, డబ్బు కోసం ఇంటి నుంచి గెంటేస్తే రెండు లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. అయితే గత నెల 27న దూరపు బంధువుతో ఫోన్ చేయించి కార్తీక పరిస్థితి విషమంగా ఉందని, ఆస్పత్రిలో చేర్పించామని చెప్పడంతో వెళ్లి చూడగా కార్తీక వంటిపై గాయాలు ఉన్నాయని తెలిపారు. చికిత్స పొందుతున్న కార్తీక శుక్రవారం మృతిచెందిందని, తన సోదరి మృతికి భర్త, అత్తింటి వారే కారణమని విక్రమ్‌రాజ్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



క్లుప్తంగా...



ఉత్తమ పవర్ ప్లాంటుగా ఎస్టీపీపీ

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు (ఎస్టీపీపీ)ను మరో అవార్డు వరించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) సంస్థ ఉత్తమ పవర్ ప్లాంటు నిర్వహణలో భాగంగా ఎస్టీపీపీకి ఈ అవార్డును అందించింది. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ చేతుల మీదుగా సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు అందుకున్నారు. కాగా, ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో వరుసగా అవార్డులు అందుకోవడం విశేషం.

తెలంగాణ రైస్ మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా అన్నమనేని

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైస్ మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన అన్నమనేని సుధాకరరావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా నర్సింగరావులను నియమిస్తున్నామని ఆ సంఘం ప్రకటించింది. ఈ మేరకు అసోసియేషన్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గంపా నాగేందర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మిల్లింగ్ ప్రక్రియ, బియ్యం పరిశ్రమపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తిగా.. పరిశ్రమకు.. ప్రభుత్వానికి మధ్య వారధిగా సుధాకరరావు పనిచేస్తారని అభిప్రాయపడ్డారు.

'జూన్‌కల్లా రోడ్ల మరమ్మతులు పూర్తి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చాలా కాలం తర్వాత పీరియాడికల్ రెన్యువల్ పనులలో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్ర రహదారుల మరమ్మతులను జూన్‌కల్లా పూర్తి చేయాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ పనులపై శుక్రవారం ఆయన రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, ప్రత్యేక కార్యదర్శి విజేంద్ర బోయి, ఈఎన్సీ రవీందర్‌రావులతో సమీక్షించారు. రూ.2875 కోట్లతో చేపట్టిన మొత్తం 1170 పనుల్లో 232 పనులు పూర్తి కాగా, మిగతా వాటిని వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల నిర్వహణ బాధ్యతను 60 ఏజెన్సీలకు అప్పగించినందున, ప్రతి ఏజెన్సీ వారానికి కనీసం ఒక్క పనైనా పూర్తి చేసేలా చూడాలని సూచించారు.

ఇక మొబైల్ ఆస్పత్రులు!

సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై దృష్టి
- మారుమూల పల్లెవాసులకూ మెరుగైన వైద్యానికి ప్రణాళిక
- పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎంపిక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని మారుమూల ఆదివాసీ, గిరిజన పల్లెల్లో నివసించే వారికి మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మొబైల్ క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వాటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

కదిలే ఆస్పత్రి...

మొబైల్ క్లినిక్‌గా తీర్చిదిద్దే వాహనంలో రోగనిర్ధారణ పరీక్షలు, ఔషధాలు, మైనర్ సర్జరీలు చేసేందుకు అనువైన వ్యవస్థ, రెండు బెడ్లు, టాయిలెట్ సదుపాయం ఉంటాయి. ఈ వాహనంలో ఒక డాక్టర్, ఒక ఏఎన్ఎం, ఒక మిడ్‌వైఫరీ, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ ఉంటారు. దీంతోపాటు టెలిమెడిసిన్ వ్యవస్థకు అనువైన సమాచార వ్యవస్థ సైతం అందుబాటులో ఉంటుంది. ఎంపిక చేసిన మండలాల్లో పల్లె దవాఖానాలకు దూరంగా ఉన్న గ్రామాలు, గిరిజన గూడేలకు వారంలో రెండు, మూడుసార్లు రోడ్డు మార్గంలో వీలైనంత దగ్గర వరకు ఈ మొబైల్ క్లినిక్ చేరుకుంటుంది. అక్కడి ప్రజల ఆరోగ్య స్థితిగతులను వైద్యుడు, ఇతర సిబ్బంది పరిశీలించి తగిన మందులు అందిస్తారు. ప్రసవ సమయం దగ్గర పడిన నిండు గర్భిణులతో పాటు ఇతర అత్యవసర వైద్యం అవసరమైన వారిని గుర్తించి ముందుగానే పెద్దాస్పత్రులకు వాహనంలో తరలిస్తారు. మొబైల్ క్లినిక్‌ల వల్ల మారుమూల ప్రాంతాలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

భద్రాద్రి జిల్లాలో

మావోయిస్టు ప్రాభావిత ప్రాంతాల్లో వెనుకబాటుతనం రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏళ్లుగా భారీ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నాయి. దీంతో ఇప్పటికే ఏజెన్సీ ఏరియాల్లో రవాణా, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా వైద్యసేవలు సైతం వారి చెంతకు చేర్చే పనికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంటెలిజెన్స్ నోడల్ అధికారి ప్రభాకర్ చర్చించారు. జిల్లాలోని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో మొబైల్ ఆస్పత్రులు ప్రారంభించాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ రెండు మండలాల్లో వైద్య సేవలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లోని గూడేల ఎంపిక, రూట్ మ్యాప్ ఎంపికపై కసరత్తు ప్రారంభించారు.

రోడ్లు, రవాణా సౌకర్యాలు లేక..

రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అక్కడి అటవీ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలకు దూరంగా అనేక గిరిజన గూడేలు ఉన్నాయి. దీంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప సాధారణ పరిస్థితుల్లో వైద్యసేవల కోసం ప్రయత్నాలు చేయడం లేదు. ఫలితంగా పురిటి నొప్పులతోపాటు ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. కానీ రోడ్లు సరిగ్గా లేకపోవడంతో '108'వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో మంచాలు, డోలీలు, కుర్చీల్లో రోగులను ప్రధాన రహదారుల వద్దకు మోసుకెళ్లి అక్కడి నుంచి వాహనంలో ఆస్పత్రులకు తరలించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ప్రజల వద్దకే వైద్యసేవలు అందుబాటులోకి తీసుకెళ్లేందుకు మొబైల్ ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురానున్నారు.



రోగులను మంచంపై ఆస్పత్రికి తీసుకొస్తున్న ఏజెన్సీ ప్రాంత ప్రజలు (ఫైల్)

ఇక ప్రతిగింజా ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిందే..

- నేటి నుంచి రైస్ మిల్లుల్లో విజిలెన్స్ బృందాల తనిఖీలు
- పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం అవసరమైన బియ్యాన్ని మిల్లర్ల నుంచి పౌర సరఫరాల సంస్థ ఇప్పటికే సేకరించిందని, ఇక నుంచి ప్రతి బియ్యపుగింజను ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిందేనని పౌర సరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ స్పష్టం చేశారు. రైస్ మిల్లర్ల నుంచి కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) సేకరణ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. సీఎంఆర్‌లో జరుగుతున్న జాప్యంపై శుక్రవారం ఆయన సమీక్షించారు. ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించడానికి అవసరమైన చర్యల కోసం 25 మంది సంస్థ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఉన్నతాధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ బృందాలు శనివారం నుంచి రైస్ మిల్లుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, సీఎంఆర్ పెండింగ్ ఉన్న జిల్లాల నుంచి తనిఖీలు మొదలుపెట్టాలని సూచించారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం మిల్లుల్లో ఉందా.. లేదా? గడువు ప్రకారం సీఎంఆర్ అప్పగించారా? పెండింగ్ ఉన్నదెంత? వంటి అంశాలతోపాటు ఏ, బీ రిజిస్టర్లను తనిఖీ చేయాలన్నారు.

ఆ మిల్లర్లపై క్రిమినల్ కేసులు

ప్రభుత్వం కేటాయించిన బియ్యాన్ని అమ్ముకున్న రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రవీందర్‌సింగ్ అధికారులను ఆదేశించారు. సీఎంఆర్‌లో జాప్యం చేస్తున్న మిల్లుల నుంచి ధాన్యాన్ని ఇతర మిల్లులకు తరలించాలన్నారు. నిర్దేశించిన గడువులోగా ఎఫ్‌సీఐకి సీఎంఆర్ ఇవ్వకపోతే ఆ బియ్యానికి బదులుగా 25 శాతం జరిమానాతో నగదు రూపంలో వసూలు చేస్తామే తప్ప బియ్యాన్ని మాత్రం తీసుకోబోమన్నారు. ఈ విషయాన్ని మిల్లర్లకు తెలపాలని, 2019–20కి సంబంధించి 118 మంది మిల్లర్లపై విధించిన 25 శాతం జరిమానాను కూడా వసూలు చేయాలని ఆదేశించారు.

సుబాబుల్ రైతులకు మద్దతు ధర ఇవ్వడం లేదు

- రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సుబాబుల్ రైతులకు ఐటీసీ భద్రాచలం సరైన మద్దతు ధర ఇవ్వడం లేదని రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో సుబాబుల్ పండించే రైతుల సమస్యల పరిష్కారానికి ఐటీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతుల ఆవేదనను ఐటీసీ అధికారిణి టి.ఉషారాణి దృష్టికి తీసుకెళ్లారు. 2014 నుంచి 2023 వరకు కంపెనీ రైతులకు అందిస్తున్న మద్దతు ధర క్రమేపీ తగ్గడం, లేబర్ ట్రాన్స్‌పోర్ట్ ఇతర ఖర్చులు పెరగడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈమేరకు ఐటీసీ అధికారులు వచ్చే 15 రోజుల్లో పూర్తిగా దర్యాప్తు చేసి తిరిగి సమావేశమై లోపాలను సరిదిద్దేందుకు తీసుకునే చర్యలపై చర్చిస్తారని ఆయన వెల్లడించారు.

'షా'రొస్తున్నారు..!

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించనున్నారని పేర్కొన్నాయి.

ఇప్పటికే కర్ణాటకలో షురూ..

కర్ణాటకలో మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ జాతీయ నాయకత్వం భావిస్తోంది. అయితే కొంతకాలం నుంచి కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందన్న అభిప్రాయం ఉంది. దీనికితోడు రాహుల్ గాంధీ భారత్‌జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీ కాస్త పుంజుకుందన్న అంచనాలూ వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన బీజేపీ.. ఆ రాష్ట్రంలో పార్టీని విజయతీరాలకు చేర్చే బాధ్యతను అమిత్‌షాకే అప్పగించింది. గత ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీకి పూర్తి మెజారిటీ దక్కకపోవడానికి నేతల మధ్య కుమ్ములాటలు, సమన్వయం లేకపోవడమే ముఖ్య కారణమని గుర్తించిన నాయకత్వం.. ఈసారి ఆ సమస్య పునరావృతం కాకుండా అమిత్‌షా నేతృత్వంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆ రాష్ట్రంలో యావత్ ఎన్నికల వ్యూహ రచన ఆయన కనుసన్నల్లోనే సాగుతోంది. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో.. అక్కడే ఇల్లు అద్దెకు తీసుకుని, పూర్తి సమయం కేటాయించేందుకూ అమిత్‌షా సిద్ధమవుతున్నారు. కర్ణాటకలో ఎన్నికలు ముగిశాక.. అదే తరహాలో తెలంగాణపైనా దృష్టి పెట్టనున్నారు.

సమన్వయ లేమి సమస్యతో..

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు సానుకూల వాతావరణం ఉందని.. కానీ రాష్ట్ర పార్టీ ముఖ్య నేతల మధ్య సమన్వయ లేమి సమస్యగా మారిందని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. దీనిని పార్టీ అగ్ర నాయకత్వం గుర్తించిందని అంటున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా బీజేపీ పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగిందని, అందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సాధించిన ఫలితాలు, సుపరిపాలన దోహదపడ్డాయని ఆ పార్టీ నేతలు అంటున్నారు. రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్‌కు వ్యతిరేకంగా బీజేపీ చేపడుతున్న కార్యక్రమాలు, అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్ర, మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా, కేంద్ర మంత్రుల పర్యటనలతో మంచి ఫలితాలు వచ్చాయని చెప్తున్నారు. కాషాయ జెండా ఎగిరేందుకు ఇంత అనుకూలంగా ఉన్న పరిస్థితిని.. ఎట్టి పరిస్థితుల్లోనూ చేజార్చుకోవద్దనే అభిప్రాయంతో అధినాయకత్వం ఉందని వివరిస్తున్నారు.

ఇప్పటికే పరోక్షంగా పర్యవేక్షణ

అమిత్‌షా ఇప్పటికే పరోక్షంగా రాష్ట్ర పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడి రాజకీయ పరిస్థితులు, బీఆర్ఎస్ సర్కార్ తీరు, సీఎం కేసీఆర్ వ్యవహారశైలి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తున్నారు. పార్టీ పరంగా చేపడుతున్న కార్యక్రమాలన్నీ ఆయన అదుపాజ్ఞలు, పర్యవేక్షణలోనే కొనసాగుతున్నాయని పార్టీ నేతలు చెప్తున్నారు. ఈ క్రమంలోనే అమిత్‌షా, ఇతర అగ్రనేతలు కలసి.. గతంలో లోక్‌సభ, యూపీ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషిచేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌ను రాష్ట్ర పార్టీ సంస్థాగత ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం బన్సల్ నేతృత్వంలోనే 'ప్రజాగోస–బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ సంస్థాగత పటిష్టత, బూత్ సశక్తికరణ్ అభియాన్ వంటివి చేపడుతున్నారు. ఇక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఐదు విడతల్లో చేపట్టిన పాదయాత్రతో దాదాపు సగం అసెంబ్లీ నియోజకవర్గాలు కవర్ అయ్యాయి. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో పాదయాత్రలు కాకుండా.. రాష్ట్రంలోని నాలుగైదు రూట్లలో ముఖ్యనేతలంతా సమాంతరంగా పాల్గొనేలా రథయాత్రలు నిర్వహించాలనే ఆలోచనతో ఉన్నట్టు పార్టీ నేతల సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే జాతీయ నాయకత్వం ఓ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

ఇక చేరికలు వేగవంతం!

రాష్ట్రంపై అమిత్‌షా పూర్తిగా దృష్టి సారించనున్న నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి చేరికలు ఇకపై వేగం పుంజుకుంటాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర పార్టీ కోర్‌కమిటీ సభ్యులతో భేటీ అయినప్పుడు కూడా అమిత్‌షా ఈ విషయంపై ఆరా తీసినట్టు తెలిసింది. వివిధ జిల్లాలు, నియోజకవర్గాల్లో ఇతర పార్టీల ముఖ్య నేతలు చేరకపోవడానికి కారణాలేంటి? ఎవరు అడ్డుపడుతున్నారు? వారి అభ్యంతరాలేమిటన్న దానిపై ఆయన నేతలను ప్రశ్నించినట్టు సమాచారం. తొలుత జిల్లా, నియోజకవర్గ స్థాయి నేతలను చేర్చుకుంటే.. వారి వెంట అనుచరులు, కార్యకర్తలు తరలివస్తారని, పార్టీ బలోపేతం అవుతుందని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఏయే జిల్లాల నుంచి ఏ పార్టీల నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు? వారు డిమాండ్లు, విజ్ఞప్తులు ఏమిటన్న దానిపై రాష్ట్ర నేతల నుంచి విడివిడిగా జాబితాలు తీసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో త్వరలోనే చేరికలు ఊపందుకుంటాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

సమన్వయం కోసం విందు భేటీలు!

రాష్ట్రంలో ప్రతి పదిహేను రోజులకోసారి కోర్ కమిటీ భేటీ నిర్వహించాలని కొన్నినెలల కింద జాతీయ నాయకత్వం ఆదేశించింది. ముఖ్య నేతల మధ్య సమన్వయం, అవగాహన, పరస్పరం అభిప్రాయాలు పంచుకోవడానికి, కార్యక్రమాల నిర్వహణపై సూచనల కోసం ఆ భేటీలు ఉపయోగపడతాయని భావించింది. కానీ అనుకున్నట్టుగా కోర్ కమిటీ భేటీలు జరగడం లేదు. ఇటీవలి ఢిల్లీ భేటీలో దీనిపై ప్రశ్నించిన అమిత్‌షా.. వారానికి ఒకరోజు నేతల నివాసాల్లో బ్రేక్ ఫాస్ట్, లంచ్ లేదా డిన్నర్ భేటీలు నిర్వహించి, కలుసుకుంటూ ఉండాలని సూచించినట్టు తెలిసింది. ఈటల రాజేందర్ నివాసంలో సమావేశంతో ఇలాంటి విందు భేటీలకు శ్రీకారం చుట్టాలని పేర్కొన్నట్టు సమాచారం. అమిత్‌షా రంగంలోకి దిగనుండటంతో ఇకపై వరుసగా విందు భేటీలు, సమావేశాలు జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

నగర వార్తలు

నేడు సంగీత ప్రదర్శన

లక్డీకాపూల్ : సుప్రసిద్ధ గాయకులు, గీత రచయిత, సంగీత దర్శకులు లక్కీ అలీ నగరంలో శనివారం సందడి చేయనున్నారు. తన బృందంతో సంగీత ప్రదర్శన ఇవ్వనున్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ సాయంత్రం 6 గంటలకు ప్రదర్శన నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ షురూ

లక్డీకాపూల్: 13వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ (లింగమనేని లక్ష్మీ మెమోరియల్ కప్) శుక్రవారం ప్రారంభమైంది. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పోటీలను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. రాష్ట్రంలో క్రీడలకు సముచిత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. 80 ఏండ్ల వయసులోనూ ఉత్సాహంగా టెన్నిస్ పోటీల్లో పాల్గొంటూ, యువత ఆదర్శంగా నిలుస్తున్న మాస్టర్ అథ్లెట్లు రామరాజు, డీడీఆర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మండవ లక్ష్మీ నారాయణలను హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం (హెచ్‌ఓటీఏ) అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డితో కలిసి మంత్రి శ్రీనివాస్ గౌడ్ సత్కరించారు. 13వ హెచ్‌ఓటీఏ టోర్నీలో దేశ వ్యాప్తంగా 390 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు.

తెలంగాణలో ఇండస్ట్రీ పాలసీ భేష్

ఎఫ్‌టీసీసీ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్



లక్డీకాపూల్ : తెలంగాణలో పరిశ్రమల అభివృద్ధిపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం చాలా బాగుందని తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌టీసీసీఐ) అధ్యక్షుడు అనిల్ అగర్వాల్ అన్నారు. అయితే చిన్న, మధ్య తరహా పరిశ్రమదారులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను ప్రభుత్వం పరిశీలించాలన్నారు. గురువారం రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అత్యంత ప్రగతిశీల రాష్ట్రమని పేర్కొంటూ.. పెట్టుబడిదారులకు అనుకూలమైనదన్నారు. రాష్ట్రానికి 'బ్రాండ్ అంబాసిడర్' కేటీఆర్ అని అన్నారు. దీని మౌలిక సదుపాయాలు దేశంలోనే అత్యుత్తమమైనవన్నారు. టీఎస్–ఐపాస్ పారిశ్రామిక విధానం దేశంలోనే అత్యుత్తమమైనదిగా పేర్కొన్నారు.

బీజేపీకి రాజకీయ పరాభవం తప్పదు

- మంత్రి తలసాని



వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజల చేతుల్లో రాజకీయ పరాభవం తప్పదని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ మోండా మార్కెట్ డివిజన్ అల్ఫా హోటల్ సమీపంలో వంట గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఏర్పాటు చేసిన వంటావార్పు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల నడ్డివిరుస్తోందని మండిపడ్డారు. ఒక్క వంట గ్యాస్ ధరలను పెంచడం ద్వారా అన్ని రకాల వస్తువులపై తీవ్ర ప్రభావం పడి పేద, మధ్య తరగతి వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్యాస్ సిలిండర్ ధర రూ. 410 కాగా ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వంలో సిలిండర్ ధర రూ. 1,155కు చేరుకుందన్నారు. అంటే కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రూ. 745కు పెంచిందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, ప్రజాగ్రహానికి ఈ ప్రభుత్వం గురికాక తప్పదన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, హరిక్రిష్ణ, డి.నాగులు, తలసాని స్కైలాబ్, జయరాజ్, నరసింహ ముదిరాజ్, అమర్, సత్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఆందోళనకు సిద్ధమైన కాంట్రాక్ట్ కార్మికులు



మాట్లాడుతున్న నాయకులు

లక్డీకాపూల్: జీతాలు పెంపుదల విషయంలో యాజమాన్యం పెడచెవిన పెట్టడంతో ఆందోళనకు సిద్ధమవుతున్నట్టు నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి నరసింహులు వెల్లడించారు. శుక్రవారం నిమ్స్‌లో యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాల నుంచి వేతనాల పెంపుదల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. అయినా జీతాల పెంపుదల, పర్మినెంట్, ఇతర సమస్యల పరిష్కారంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 7న నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు.



వివాహ వేడుక

సినీ హీరో మంచు మనోజ్, దివంగత ఎమ్మెల్యేలు భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డిల ద్వితీయ పుత్రిక మౌనికా రెడ్డి వివాహం శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. మనోజ్ సోదరి మంచు లక్ష్మీ నివాసంలో అత్యంత సన్నిహితులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగిన వేడుకకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ తదితరులు హాజరయ్యారు.

– సాక్షి, సిటీబ్యూరో



యువకుడి హత్య కేసులో ఐదుగురి అరెస్టు

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తి హత్యలో పాలుపంచుకున్న ఐదుగురిని పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట్ ఎల్లారెడ్డిగూడకు చెందిన హరీష్(28) కుటుంబం ఆరు నెలల క్రితం సూరారం కాలనీకి మకాం మార్చింది. ఈ నేపథ్యంలో ఓల్డ్ సిటీ కుల్సుంపురకు చెందిన మెత్తర్ అనే యువతిని పది రోజుల క్రితం ప్రేమ పేరుతో తీసుకువచ్చిన హరీష్ దూలపల్లిలో కాపురం పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న యువతి అన్న దీన్‌దయాల్ తన ఐదుగురు స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలపై రెక్కీ నిర్వహించాడు. ఈ క్రమంలో బుధవారం దూలపల్లి ప్రాంతంలో కాపు కాసి మొదట చెల్లెలిని ఇంటికి పంపించాడు. అనంతరం హరీష్ ఛాతి, ముఖంపై కత్తులతో దాడి చేసి హత్యానంతరం పరారయ్యారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా హత్యలో పాల్గొన్న ఐదుగురిని పట్టుకుని శుక్రవారం రిమాండ్‌కు పంపారు.

ఎంఆర్ఐటీఎస్ఓలో జాతీయ సాంకేతిక సదస్సు

మేడ్చల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సాంకేతిక సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఫ్యాబ్ టెక్‌లుస్ టెక్ 23 పేరుతో నిర్వహిస్తున్న సదస్సును ల్గోలీవ్ టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ జంధ్యాల, టెక్ ఎరాక్సెల్లింగ్ ఎండీ కిరణ్ చెరుకూరి ప్రారంభించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, రోబోటిక్, వీఎల్ఎస్ఐడిజైన్, కోడింగ్ విధానాలలో అధికంగా పేర్లు నమోదు చేసుకున్నారు.

జూపార్కులో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కులో శుక్రవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జూపార్కును సందర్శించిన పాఠశాల విద్యార్థులు, సందర్శకుల కోసం బయోస్కోప్ హాల్‌లో లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. పాములు, జంతువులు, వన్యప్రాణుల గురించి వివరించారు. మధ్యాహ్నం పాములపై అవగాహన కల్పించారు. పాము కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన భద్రతా చర్యలను జూ జీవశాస్త్రవేత్త, ఈవో, పీఆర్ఓలు సందర్శకులకు ఈ సందర్భంగా వివరించారు.



పాములపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్న జూ సిబ్బంది

ఆయుష్ ఉత్పత్తులను విశ్వవ్యాప్తం చేయాలి



సాక్షి, సిటీ బ్యూరో: స్పిరులినాలోని విటమిన్ బీ12, క్లోరోఫిల్ లు ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని తెలంగాణ ఆయుష్ డైరెక్టర్ ఎం.ప్రశాంతి తెలిపారు. అతిపెద్ద న్యూట్రాస్యూటికల్, ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థ లైఫ్‌స్పాన్ ను శుక్రవారం మాదాపూర్‌లో ప్రశాంతి సందర్శించారు. ఇందులో భాగంగా లైఫ్‌స్పాన్ సంస్థ చైర్మన్ నరేంద్ర రామ్ నంబులతో కలిసి స్పిరులినాను మార్కెట్లోకి విడుదల చేశారు. ఆయుష్ ఉత్పత్తుల ప్రాముఖ్యతను, నివారణ ఆరోగ్య సంరక్షణను ఈ ప్రపంచానికి పరిచయం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

ఏపీలో ఉద్యోగాలిస్తే ఇక్కడ ఇవ్వరా?



నిరాహార దీక్ష చేస్తున్న అభ్యర్థులు

కవాడిగూడ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్‌ఈ 2008 మెరిట్ అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగాలు కల్పించారని.. అయితే తెలంగాణలో సీఎం కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వకపోవడం దారుణమని డీఎస్‌ఈ 2008 బీఎడ్ మెరిట్ క్యాండిడేట్స్ అసోసియేషన్ మండిపడింది. శుక్రవారం డీఎస్‌ఈ 2008 బీఎడ్ మెరిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ అభ్యర్థులకు త్వరగా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా చౌక్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరాహార దీక్షకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఓయూ జేఏసీ నేత అరుణ్‌నాయక్ సంఘీభావం తెలిపారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, గౌరవ అధ్యక్షులు ఎల్.రవి, ఎం.డి.ఫరీద్, ఎస్.శ్రీనివాస్‌నాయక్ మాట్లాడారు.

అక్షయపాత్రలో విద్యుత్ కిచెన్ ప్రారంభం

మణికొండ: నార్సింగిలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షయపాత్రలో ఇప్పటి వరకు డీజిల్ ఆధారితంగా తయారైన వంట ఇక మీదట విద్యుత్ ఆధారితంగా తయారు కానుంది. అధునాతన కిచెన్‌ను ఐఏఎస్ అధికారి, మాజీ సీఎస్ సోమేష్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిచెన్ పరికరాలను అందించిన దాతలనుఆయన అభినందించారు.



విద్యుత్ కిచెన్‌ను ప్రారంభిస్తున్న సోమేష్‌కుమార్



జీఐఎస్ వేదికపై ఏపీ సీఎం వైఎస్ జగన్‌తో పాటు వరుసగా... మసహిరో యమగుచి (టోరే ఇండియా), సుమిత్ బిదానీ (యూఎస్‌జీ బోరల్), అరుణ్ ఒబెరాయ్ (ఒబెరాయ్ గ్రూప్), పునీత్ దాల్మియా (దాల్మియా భారత్), ప్రీతా రెడ్డి (అపోలో) కృష్ణ ఎల్లా (భారత్ బయోటెక్), జీఎం రావు (జీఎంఆర్), ముఖేశ్ అంబానీ (రిలయన్స్ గ్రూప్), కరణ్ అదానీ (అదానీ గ్రూప్), బీవీఆర్ మోహన్ రెడ్డి (సైయంట్), సజ్జన్ భజాంకా (సెంచరీ ప్లై), హరిమోహన్ బంగర్ (శ్రీ సిమెంట్), మార్టిన్ ఎబర్ హార్డ్ (టెస్లా), కబ్ డాంగ్ లీ (కియా), మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బుగ్గన రాజేంద్రనాథ్.

విజనరీ లీడర్ షిప్
విజనరీ లీడర్ షిప్‌తో ప్రోగ్రెసివ్ పాలసీ, పారిశ్రామిక అభివృద్ధి పాలసీ, ఇండస్ట్రీస్ ఎకోసిస్టమ్, పెట్టుబడిదారులకు అనుకూలమైన సింగిల్ విండో విధానాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. సోలార్, హైడ్రో, విండ్ పవర్, సిమెంట్ ప్రాజెక్టు ఎంవోయూలు ఏపీ ప్రభుత్వంతో చేసుకున్నాం.
– నవీన్ జిందాల్, జేఎస్‌పీఎల్ గ్రూప్ చైర్మన్

ప్రభుత్వ సహకారానికి సాహో
శ్రీసిటీలో 85 ఎకరాల్లో ప్లాంట్ ఏర్పాటు సమయంలో ముఖ్యమంత్రి జగన్ సహకారం మరువలేనిది. ముఖ్యమైన అనుమతులన్నీ అతి తక్కువ సమయంలోనే మంజూరు చేసి ప్లాంట్ నిర్మాణాన్ని వేగవంతం చేయడంలో సహకరించారు.
– మసహిరో యమగుచీ, టోరే ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ ఎండీ

భోగాపురంతో ఆర్థిక వైభవం
భోగాపురం ఎయిర్‌పోర్టు సిటీ కూడా విశాఖతో పాటు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మారుస్తుంది. తొలిదశలో రూ.5,000 కోట్లతో ఏటా 60 లక్షల మంది ప్రయాణించే విధంగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్నాం. నేను పుట్టిన నేలకు దగ్గరగా ఇంతమంది పారిశ్రామిక దిగ్గజాలు రావడం చాలా ఆనందంగా ఉంది.
–జీఎం రావు, జీఎంఆర్ గ్రూపు చైర్మన్

రూ.5 వేల కోట్ల పెట్టుబడులు
రూ.3,000 కోట్లతో గుంటూరులో దేశంలోనే మొదటి గ్రీన్ సిమెంట్ ప్లాంట్ పనులు జరుగుతున్నాయి. రూ.5,000 కోట్ల పెట్టుబడులు పెట్టి 5 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.
– హరిమోహన్ బంగర్, శ్రీ సిమెంట్

ఆశ్చర్యంగానే ఉంది
సీఎం జగన్‌ను మొదటిసారి కలిసినప్పుడు మా ప్లాంట్ ఎలా ఎస్టాబ్లిష్ చేయాలనే ఆలోచనతో వెళ్లాం. ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేయాలి? ఏ మోడల్స్ ఉత్పత్తి చేయాలి? నోడల్ ఆఫీసర్లు ఎవరు..? ఇలా అన్నీ ఒక్క మీటింగ్‌లోనే డిసైడ్ అయిపోయాయి. సీఎం జగన్ ప్రోత్సాహంతోరెండేళ్లలోనే 2021 డిసెంబర్‌లో ఆయన చేతుల మీదుగా ప్రారంభించడం ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంది.
– సజ్జన్ భజాంకా, సెంచురీ ప్లేబోర్డ్స్ చైర్మన్

స్టార్టప్, గ్రీన్ ఎనర్జీపై ఆసక్తిగా ఉన్నాం
టెస్లా ప్రారంభించినప్పుడు ఎవరికీ ఎలక్ట్రిక్ కార్లు తయారు చేస్తారనే ఆలోచన లేదు. ఈ రోజు ప్రతి దిగ్గజ కార్ల కంపెనీకి ఈవీ కార్ల గురించి తెలుసు. ఏపీలో స్టార్టప్స్‌తో పాటు గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి గురించి తెలుసుకోవాలన్న ఆసక్తితో సదస్సుకు హాజరయ్యా.
– మార్టిన్ ఎబర్‌హార్ట్, టెస్లా కో ఫౌండర్

టీకాల రంగంలో అవకాశాలు
ఫార్మా రంగంలో విశాఖ, నెల్లూరు ప్రాంతాలు ఇప్పటికే బాగా అభివృద్ధి చెందాయి. ఫార్మా రంగంలో ఇంటర్మీడియట్స్ కోసం చైనాపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా రాష్ట్రంలో తయారీ పార్కును నెలకొల్పాలని కోరుతున్నా. యానిమల్, ఆక్వా వ్యాకినేషన్ల రంగాల్లో అపార అవకాశాలున్నాయి.
-కృష్ణ ఎల్లా, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ భారత్ బయోటెక్

పరిశ్రమలు తరలి వస్తున్నాయి
వైద్య, ఆరోగ్య రంగంలో ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ప్రశంసనీయం. ఆరోగ్య శ్రీ పథకాన్ని సీఎం జగన్ మరింత విస్తరింపజేశారు. ఏపీ ప్రభుత్వంతో అపోలో గ్రూప్స్ భాగస్వామిగా ఉండటం సంతోషంగా ఉంది. ఏపీవైపు అన్ని పరిశ్రమలు తరలి వస్తున్నాయి.
– ప్రీతారెడ్డి, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వైస్ చైర్‌పర్సన్

రూ.13 లక్షల కోట్లు

విశాఖ జీఐఎస్ వేదిక నుంచి సాక్షి ప్రతినిధి : గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు అనూహ్య స్పందన లభించింది. విశాఖ వేదికగా రాష్ట్రంలోకి పెట్టుబడుల వరద పారింది. రెండు రోజుల జీఐఎస్ సదస్సు సందర్భంగా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.13 లక్షల కోట్లకు పైగా విలువైన 340 ఒప్పందాలు రానున్నాయి. తొలి రోజు శుక్రవారం సీఎం వైఎస్ జగన్ సమక్షంలో కార్పొరేట్ దిగ్గజ సంస్థలు రూ.11,87,756 కోట్ల విలువైన 92 ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వీటి ద్వారా 3,92,015 మందికి ఉపాధి లభించనుంది. ఇందులో ఒక్క ఇంధన రంగంలోనే రూ.8,25,639 కోట్ల విలువైన 35 ఒప్పందాలు కుదిరాయి. ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టీపీసీ, ఏబీసీ, ఇండోసోల్, జేఎస్‌డబ్ల్యూ గ్రూపు, ఏసీఎంఈ, టిప్‌సోల్, అవాడా, గ్రీన్‌కో, అదానీ, అరబిందో, ఎన్‌హెచ్‌పీసీ, ఆదిత్య బిర్లా వంటి సంస్థలున్నాయి. ఇంధన రంగంలో పెట్టుబడుల ద్వారా 1,33,950 మందికి ఉపాధి లభించనుంది. పరిశ్రమలు, వాణిజ్య విభాగంలో రూ.3,20,455 కోట్ల విలువైన 41 ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా 1,79,850 మందికి ఉపాధి లభించనుంది. ఇందులో జిందాల్ స్టీల్, శ్రీ సిమెంట్, మైహోమ్ సిమెంట్, అల్ట్రాటెక్, లారస్ మోండలెజ్, వెల్స్పన్ వంటి సంస్థలున్నాయి. ఐటీ, ఐటీఈఎస్ రంగంలో రూ.32,944 కోట్ల విలువైన 6 ఒప్పందాలు కుదరగా, వీటి ద్వారా 64,815 మందికి ఉపాధి లభించనుంది. ఇందులో టీసీఎల్, రిజల్యూట్, డైకిన్, సన్నీ ఆప్టెక్ వంటి సంస్థలున్నాయి. పర్యాటక రంగంలో రూ.8,718 కోట్ల విలువైన 10 ఒప్పందాలు కుదరగా.. వీటి ద్వారా 13,400 మందికి ఉపాధి లభించనుంది. ఇందులో డ్రీమ్‌వ్యాలీ గ్రూపు, ఒబెరాయ్, భ్రమరాంభ గ్రూపు, ఎంఆర్‌కేఆర్, మంజీరా హోటల్స్ వంటి సంస్థలున్నాయి. రెండవ రోజు శనివారం రూ.1.15 లక్షల కోట్ల విలువైన 248 ఒప్పందాలు కుదరనున్నట్లు అధికారులు వెల్లడించారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు అనూహ్య స్పందన
- 340 ఒప్పందాల ద్వారా 6 లక్షల ఉద్యోగాలు
- తొలి రోజు రూ.11.87 లక్షల కోట్ల విలువైన 92 ఒప్పందాలు
- నేడు 1.15 లక్షల కోట్ల విలువైన 248 ఒప్పందాలు
- సీఎం జగన్ పాలనా దక్షతను కొనియాడిన ప్రముఖులు
- రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై నాలుగు ఆడియో విజువల్స్ ప్రదర్శన
- వేదికపై ఉన్నంత సేపు సీఎంతో ముఖేష్ అంబానీ చర్చలు
- ఎంవోయూల అనంతరం కార్పొరేట్ ప్రముఖులకు సీఎం సత్కారం
- వేదికపై ఉన్న ప్రతి పారిశ్రామికవేత్త వద్దకు వెళ్లి పలకరింపు

రంగం	ఒప్పందాల సంఖ్య	పెట్టుబడి రూ.కోట్లలో	ఉపాధి
ఇంధన రంగం	35	8,25,639	1,33,950
పరిశ్రమలు	41	3,20,455	1,79,850
ఐటీ, ఐటీఈఎస్	6	32,944	64,815
పర్యాటకం	10	8,718	13,400

రాష్ట్ర ప్రభుత్వ కృషిని కొనియాడిన కార్పొరేట్ దిగ్గజాలు

కోవిడ్ తర్వాత తక్కువ కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వేగంగా పరుగులు పెట్టించి, రాష్ట్రంలోని పెట్టుబడుల అవకాశాలను వివరిస్తూ రోడ్‌షోలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించింది. జీఐఎస్ సమావేశంలో పాల్గొన్న అంబానీ దగ్గర నుంచి బంగర్ వరకు అందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను స్వాగతిస్తూ ప్రసంగించారు. ముఖ్యంగా విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వ కృషిని కొనియాడారు. సభా ప్రాంగణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి వచ్చిన రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ సభ ముగిసే వరకు.. ఆద్యంతం ముఖ్యమంత్రితో చర్చిస్తూ ఉల్లాసంగా కనిపించారు. సీఎం తన ప్రసంగం అనంతరం వేదికపై ఉన్న ప్రతి పారిశ్రామికవేత్త వద్దకు వెళ్లి నమస్కరించి పలకరించారు. ఎంవోయూ కార్యక్రమం అనంతరం పారిశ్రామికవేత్తలను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన సమయంలో పాదరక్షలు విడిచిన పారిశ్రామికవేత్తలు.. తర్వాత నిలబడి వాటిని ధరించడంలో ఇబ్బంది పడుతుంటే.. ముఖ్యమంత్రి వారికి ఆసరాగా నిలిచి చేయూతనందించడం పలువురిని ఆకర్షించింది. మధ్యాహ్నం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి పారిశ్రామిక ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి స్టాల్స్‌ను సందర్శించారు. అంతకు ముందు రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై నాలుగు ఆడియో విజువల్స్ ప్రదర్శించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జీఐఎస్ సందర్భంగా ఏర్పాటు చేసిన లేజర్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకర్షించాయి. ఎయిర్‌పోర్టులో అతిథులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఆహ్వానం పలికిన విధానం పలువురిని ఆకట్టుకుంది. ఈ విషయాన్ని పలువురు వక్తలు సదస్సులో ప్రస్తావించారు. సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర జానపద కళలు, కొమ్ము నృత్యం, తప్పటగుళ్లు, ఉరుములు అందరినీ ఆకర్షించాయి. ఈ సదస్సుకు కార్పొరేట్ ప్రముఖులతో పాటు, విదేశీ రాయబారులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ సమావేశాలకు హాజరైన వారికి ముఖ్యమంత్రి రాత్రి ప్రత్యేకంగా విందు ఇచ్చారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పెట్టుబడులకు స్వర్గధామం

- మాది పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023లో ఏపీ సీఎం వైఎస్ జగన్
- పారిశ్రామికవేత్తలకు ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ప్రభుత్వం
- త్వరలో కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం

విశాఖ జీఐఎస్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : భూమి, నీరు, సముద్రతీరం, విస్తారమైన ఖనిజ సంపద, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఇతరత్రా ప్రకృతి వనరులు.. వీటన్నింటికీ తోడు పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం కలిగిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, పెట్టుబడులకు స్వర్గధామమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి 340 పారిశ్రామిక పెట్టుబడుల ప్రతిపాదనలతో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని స్పష్టం చేశారు. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 20 రంగాల్లో 6 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయని చెప్పారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 తొలి రోజు శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం దేశ, విదేశాలకు చెందిన అగ్రశ్రేణి పారిశ్రామిక దిగ్గజాలు హాజరైన ఈ సమ్మిట్‌ను ఉద్దేశించి మాట్లాడారు. తొలి రోజు రూ.11.87 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 92 ఎంవోయూలు కుదుర్చుకుంటున్నామని, వీటి ద్వారా దాదాపు 4 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మిగిలిన 248 ఎంవోయూలను శనివారం కుదుర్చుకుంటామని, వాటి విలువ రూ.1.15 లక్షల కోట్లు అని తెలిపారు. వాటితో దాదాపు 2 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రిలయెన్స్ గ్రూప్, అదాని గ్రూప్, ఆదిత్య బిర్లా గ్రూప్, రెన్యూ పవర్, అరబిందో గ్రూప్, డైకిన్, ఎన్టీపీసీ, ఐటీసీఎల్, జిందాల్ గ్రూప్, మోండలెజ్, పార్లే, శ్రీ సిమెంట్స్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు స్థాపించి వ్యాపారాన్ని విస్తరించనున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు ఎలాంటి సహకారం అందించేందుకునైనా తమ ప్రభుత్వం ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉంటుందని పారిశ్రామికవేత్తలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రం ఏ విధంగా అనుకూలమో ఆయన వారికి స్పష్టంగా వివరించారు. ''2021–22లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యధికంగా 11.43 శాతం జీఎస్‌డీపీ వృద్ధి రేటు సాధించింది. గత మూడేళ్లలో ఏపీ నుంచి ఎగుమతులు కూడా వృద్ధి చెందాయి. సీఏజీఆర్ (సగటు వార్షిక వృద్ధి రేటు) 9.3 శాతంగా నమోదైంది. సుస్థిరమైన అభివృద్ధి కోసం మేం చేస్తున్న ప్రయత్నాలను నీతి ఆయోగ్ కూడా గుర్తించింది. సామాజిక, ఆర్థిక, పర్యావరణ అంశాల్లో 2020–21కి ఇచ్చిన ఎస్‌జీడీ ఇండియా ఇండెక్స్ ర్యాంకుల్లో రాష్ట్రం మూడో స్థానంలో నిలిచింది'' అని చెప్పారు.

త్వరలో కార్యనిర్వాహక రాజధానిగా విశాఖపట్నం

విశాఖపట్నం త్వరలోనే ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక రాజధాని కాబోతోంది. నేనూ త్వరలోనే ఇక్కడి నుంచే పరిపాలన సాగించబోతున్నా. త్వరలోనే అది సాకారం అవుతుంది.

అపార వనరులు.. యువ నాయకుడు

- విశాఖ జీఐఎస్ సదస్సులో రిలయన్స్ గ్రూపు అధినేత ముఖేష్ అంబానీ
- ప్రధాని మోదీ నాయకత్వ పటిమ.. సీఎం జగన్ దార్శనికత భేష్
- రాష్ట్రంలో 10 గిగావాట్ల రెన్యువబుల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్ నెలకొల్పుతాం



ఒప్పంద పత్రాలతో సీఎం జగన్, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ. చిత్రంలో మంత్రి పెద్దిరెడ్డి, ఉన్నతాధికారి విజయానంద్

(విశాఖ జీఐఎస్ వేదిక నుంచి సాక్షి, ప్రతినిధి): దక్షిణాది రాష్ట్రాల్లో పెట్టుబడుల సదస్సుకు ఎన్నడూ హాజరు కాని రిలయన్స్ గ్రూపు చైర్మన్ ముఖేష్ అంబానీ విశాఖ వేదికగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో పాల్గొనడం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. ఈ సదస్సు కోసం 5 గంటలకు పైగా సమయాన్ని ప్రత్యేకంగా కేటాయించడమే కాకుండా రాష్ట్రంలోని అపార వనరులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దక్షత, యువ నాయకత్వాన్ని కొనియాడుతూ ప్రసంగించారు. అపార వనరులు కలిగి ఉండటం ఒక వరమని, ఏపీలో భారీ పెట్టుబడులు పెట్టిన తాము భవిష్యత్తులో కూడా అదే బంధాన్ని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 10 గిగావాట్ల రెన్యువబుల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. ఆయనేమన్నారంటే..

- బ్లూ ఎకానమీ (సముద్ర వాణిజ్యం)లో సాగరమంత అవకాశాలను కల్పిస్తూ రాష్ట్రం స్వాగత ద్వారాలు తెరిచింది. రెన్యువబుల్ ఓషన్ ఎనర్జీ, సముద్ర ఖనిజాలు, మెరైన్ బయోటెక్నాలజీ రంగాల్లో చాలా అవకాశాలున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వ పటిమతో దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా, ఎంత వేగంగా విస్తరిస్తోందో అదేవిధంగా సీఎం వైఎస్ జగన్ యువ నాయకత్వం, దార్శనికతతో వృద్ధి రేటు, సులభతర వాణిజ్య ర్యాంకుల్లో ఏపీ మొదటి స్థానంలో నిలిచింది.
- ఆంధ్రప్రదేశ్‌లోని అపార అవకాశాలను గుర్తించి చమురు, గ్యాస్ రంగంలో 2002లో అడుగుపెట్టాం. రూ.1,50,000 కోట్లకుపైగా పెట్టుబడులను కేజీ డీ–6 అసెట్స్‌పై పెట్టాం. ముమ్ముందు దేశ సహజ వాయువు ఉత్పత్తిలో 30 శాతం డీ–6 నుంచే వస్తుంది. దేశంలో ఆంధ్రప్రదేశ్ ఎంత కీలకమో చెప్పేందుకు ఇదే నిదర్శనం. జియో సేవలకు సంబంధించి రాష్ట్రంలో టెలికాం విస్తరణ కోసం రూ.40,000 కోట్ల పెట్టుబడులు పెట్టాం. ట్రూ 5జీ సేవలను 2023 చివరి నాటికల్లా మారుమూల ప్రాంతాలకు కూడా విస్తరిస్తాం. 5జీ రాకతో రాష్ట్రంలో డిజిటల్ విప్లవం అన్ని రంగాల్లో వృద్ధికి దోహదం చేస్తుంది. దీని ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు రానున్నాయి. భవిష్యత్తులో కూడా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలతో ఇదే విధమైన బంధాన్ని కొనసాగిస్తామని హామీ ఇస్తున్నా. రాష్ట్ర వృద్ధి రేటులో రిలయన్స్ భాగస్వామిగా ఉంటుంది. మాకు మద్దతు ఇస్తూ ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అధికారులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నా.

రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెడుతున్నాం
అదానీ గ్రూపు రాష్ట్రంలో వివిధ రంగాల్లో ఇప్పటికే రూ.20,000 కోట్లకుపైగా పెట్టుబడులను పెట్టింది. పోర్టు ఆధారిత అభివృద్ధిలో భాగంగా గంగవరం, కృష్ణపట్నం పోర్టులో పెట్టుబడులు పెట్టాం. రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో 15,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి యూనిట్లను నెలకొల్పేలా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్నాం. నడికుడి, కడపలో ఉన్న అంబుజా, ఏసీసీ సిమెంట్ యూనిట్లల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని 10 మిలియన్ టన్నులకు పెంచనున్నాం. విశాఖపట్నంలో 400 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం.
-కరణ్ అదానీ, సీఈవో అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్

రాష్ట్రంలో పెట్టుబడులు కొనసాగిస్తాం
15 ఏళ్ల క్రితం దివంగత వైఎస్ఆర్ చొరవతో కడపలో మా కార్యక్రమాలు మొదలు పెట్టాం. సుమారు రూ.10,000 కోట్ల పెట్టుబడులు పెట్టాం. రాష్ట్రంలో పెట్టుబడులు కొనసాగిస్తాం. ఈ సమావేశం తర్వాత జే ఫర్ జగన్‌కు అదనంగా జే ఫర్ జోష్ అని చేర్చాలి.
–పునీత్ దాల్మియా, ఎండీ దాల్మియా భారత్ గ్రూపు

విద్యపై రూ.1.12 లక్షల కోట్లు వెచ్చిస్తున్న ఏకైక రాష్ట్రం
విద్యారంగానికి దేశంలోనే అత్యధిక బడ్జెట్ కేటాయిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటే. అందరికీ చదువు అందాలన్న సత్సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ బడ్జెట్‌లో రూ.1.12 లక్షల కోట్లు విద్యారంగానికి కేటాయించారు.
–బీవీఆర్ మోహన్‌రెడ్డి, సైయెంట్ ఫౌండర్ చైర్మన్

పర్యాటక రంగంలో అపార అవకాశాలు
ఏపీ పర్యాటక పాలసీ చాలా బాగుంది. పర్యాటక రంగంలో రాష్ట్రంతో కలిసి పనిచేసే విధంగా రూ.1,350 కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నాం.
– అర్జున్ ఒబెరాయ్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఒబెరాయ్ గ్రూపు

విశాఖ–భోగాపురం ఆరులేన్ల రహదారి

- రూ.6,300 కోట్లతో చేపట్టేందుకు కేంద్రం ఆమోదం
- విశాఖ సదస్సులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటన



పారిశ్రామిక ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ, సీఎం జగన్

(గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టమైన హామీనిచ్చారు. సుదీర్ఘ తీరరేఖ కలిగిన ఏపీలో పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణానికి రూ.20 వేల కోట్లతో ప్రాజెక్టులను చేపడుతున్నామన్నారు. 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్–2023'లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు పోర్టులను అనుసంధానిస్తూ 12,350 కి.మీ మేర రహదారుల నిర్మాణానికి 22 ప్రాజెక్టు పనులు ప్రారంభించామన్నారు. మరో మూడు పోర్టులను అనుసంధానిస్తూ 120 కి.మీ. రహదారుల నిర్మాణానికి ఆరు ప్రాజెక్టులను ఆమోదించామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలల ప్రాజెక్ట్ అయిన విశాఖపట్నం– భోగాపురం(55 కి.మీ.) ఆరులేన్ల రహదారి ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేశామని గడ్కరీ ప్రకటించారు. దీన్ని రూ.6,300 కోట్లతో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏపీ అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి జగన్ తనతో చాలాసార్లు చర్చించినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమిని సమకూర్చడంతోపాటు కొన్ని రాయితీలను కూడా ఇస్తోందన్నారు.

లిక్కర్ స్కాంను పక్కదారి పట్టించేందుకే డ్రామాలు

ఎమ్మెల్సీ కవితపై వైఎస్ షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: లిక్కర్ స్కాంను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త డ్రామాలు మొదలుపెట్టారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆరోపించారు. బతుకమ్మ ఆడుతూ లిక్కర్ స్కాంకు పాల్పడిన కవిత, మహిళలకే తలవంపు తెచ్చారని విమర్శించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అంటూ కవిత కొత్త రాగం అందుకోవడం విడ్డూరమన్నారు. ఈ పరిణామాలు చూస్తుంటే.. బంగారం పోయిందని దొంగలే ధర్నా చేసినట్టుందంటూ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ రెండుసార్లు అధికారంలోకి వచ్చినా మహిళలకు 33 శాతం అసెంబ్లీ టికెట్లు ఎందుకు కేటాయించలేదని నిలదీశారు. '2014 ఎన్నికల్లో మహిళలకు బీఆర్ఎస్ ఇచ్చింది 6 సీట్లు అంటే 5.88 శాతమే, 2018లో 4 సీట్లు అంటే 3.36 శాతమే, ఇదేనా మహిళలకు మీరిచ్చే మర్యాద'అని దుయ్యబట్టారు. శాసనమండలిలో 34 మంది సభ్యులకు కేవలం మూడు సీట్లు.. అంటే 8.82 శాతం మహిళలకు ఇచ్చారని, ఇదేనా మహిళల పట్ల మీకున్న చిత్తశుద్ధి అని ప్రశ్నించారు.

రాష్ట్రాల హక్కులను కేంద్రం కాలరాస్తోంది

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- మతోన్మాద బీజేపీని గద్దె దించాలని పిలుపు
- ఫెడరల్ వ్యవస్థతోనే దేశ సమైక్యత సాధ్యమని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు. చిత్రంలో తమ్మినేని వీరభద్రం, వీరయ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాల హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ఆరోపించారు. గవర్నర్ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు అమలు కాకుండా ఆటంకాలు కల్పిస్తోందని విమర్శించారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌తో పాటు కాంగ్రెస్ అధికారంలో ఉన్న కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని నిందించారు. తెలంగాణలోనూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వ్యవహారశైలి అదే విధంగా ఉందని రాఘవులు వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం ఫెడరల్ వ్యవస్థను సైతం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. దాన్ని కాపాడుకోవడమే తక్షణ కర్తవ్యమని అప్పుడే దేశ సమైక్యతను కాపాడుకోగలమన్నారు. న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తిని ధ్వంసం చేయాలని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని నిందించారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు సుప్రీంకోర్టుపై రోజూ విమర్శలు గుప్పిస్తున్నారనీ వారికి నచ్చిన వారిని న్యాయమూర్తులుగా నియమించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులను సైతం కేంద్రం తొక్కిపెడుతోందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిసిత్తుల్లో రాబోయే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

బీజేపీపై బీఆర్ఎస్ గట్టిగానే పోరాటం చేస్తోంది: తమ్మినేని

ప్రజాసమస్యల కంటే మతచిచ్చురేపడమే బీజేపీ లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. 'భాగ్యలక్ష్మి దేవాలయం పేరుతో విద్వేషాలు పెంచడం, సచివాలయం గుమ్మటాలు నిజాంకాలం నాటి కట్టడాలుగా ఉన్నాయనీ, మసీదులు తవ్వితే శవాలు వస్తే వారికి, శివలింగాలు వస్తే మాకు' అంటూ బండి సంజయ్, బీజేపీ నాయకులు రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ గట్టిగానే పోరాటం చేస్తోందని తమ్మినేని అభిప్రాయపడ్డారు. తెలంగాణపై బీజేపీ గురిపెట్టిందని, అందుకే కేంద్ర మంత్రులు, ప్రధాని ఇక్కడికి వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో ఎవరితో పొత్తు పెట్టుకుంటామనేది అప్పటి పరిస్థితిని బట్టి ఉంటుందన్నారు.

17 నుంచి జన చైతన్య యాత్రలు

బీజేపీ అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 17 నుంచి చేపట్టే జనచైతన్య యాత్రలో ప్రసంగాలతోపాటు విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. 17న వరంగల్‌లో మొదటి యాత్రకు ముఖ్యఅతిథిగా సీతారాం ఏచూరి, 23న ఆదిలాబాద్‌లో రెండోయాత్రకు రాఘవులు, 24న నిజామాబాద్ లో మూడో యాత్రకు విజయరాఘవన్, 29న హైదరాబాద్‌లో ముగింపు సభకు ప్రకాశ్‌కరత్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలు తిరిగేలా బస్సు యాత్ర ప్రణాళికను రూపొందించామని తమ్మినేని చెప్పారు.

ముందు మీ నాన్నను నిలదీయండి

- నువ్వు ధర్నా చేస్తానంటే మహిళలు నవ్వుకుంటున్నారు..
- ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి బండి సంజయ్ వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

జగిత్యాల: 'మహిళలపై అత్యాచారం జరిగితే ఎందుకు నోరు విప్పడం లేదు? అసెంబ్లీలో మహిళలకు 33 శాతం సీట్లు ఏవీ? మీ ప్రభుత్వంలో మహిళలు ఎందరున్నారు? మీ పార్టీలో ఎంతమంది మహిళలకు చోటిచ్చారు? మహిళా గవర్నర్‌ను ఎందుకు అవమానిస్తున్నారు? వీటిపై ముందు మీ నాన్నను నిలదీయండి.. జంతర్‌మంతర్ వద్ద నువ్వు ధర్నా చేస్తానంటే మహిళలు నవ్వుకుంటున్నారు..' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. శుక్రవారం జగిత్యాలలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణితో ఆయన భేటీ అయ్యారు. ఆమె నివాసంలో కాసేపు వివిధ అంశాలపై చర్చించిన తర్వాత విలేకరులతో మాట్లాడారు.

ఎంఐఎం పరాన్నజీవుల పార్టీ

మహిళా బిల్లు విషయంలో కవిత ఢిల్లీలో ధర్నా చేస్తామనడం విడ్డూరంగా ఉందని సంజయ్ వ్యాఖ్యానించారు. మహిళా బిల్లును ప్రవేశపెడితే పార్లమెంటులో ఆ కాపీలను చింపివేసిన పార్టీలతో ఎందుకు దోస్తానా చేస్తున్నావని నిలదీశారు. మెడికో ప్రీతి నాయక్ ఆత్మహత్య చేసుకున్నా, నిర్మల్‌లో బాలికపై అధికార పార్టీ నేత అత్యాచారానికి పాల్పడినా ముఖ్యమంత్రి కనీసం స్పందించ లేదని విమర్శించారు. గంటకో లైంగిక వేధింపు, పూటకో అత్యాచారం జరుగుతుంటే ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలపై అత్యాచారాలు చేసేవారి, హత్యలకు పాల్పడేవారి అంతు చూస్తామని హెచ్చరించారు. బీజేపీ అంతు చూస్తామని మజ్లిస్ నేత ఒవైసీ చెప్పడం హాస్యాస్పదమని సంజయ్ పేర్కొన్నారు. ఎంఐఎం పరాన్నజీవుల పార్టీ అని, సీఎం విసిరే ఎంగిలి మెతుకులకు ఆశపడే పార్టీ అని ధ్వజమెత్తారు. దమ్ముంటే 119 స్థానాల్లో పోటీ చేయాలని సవాల్ చేశారు.

బెటర్ మిల్క్



మజ్జిగను బటర్ మిల్క్ అంటాం కదా.. వేసవి వచ్చేసరికి ఇది కాస్తా బెటర్ మిల్క్‌గా మారుతుంది. అదెలాగంటే... మజ్జిగ తాగేవాడికి ఏ వ్యాధులూ కలగవనీ, వచ్చిన వ్యాధులు తగ్గి, తిరిగి తలెత్తకుండా ఉంటాయనీ, చర్మరోగాలు, దీర్ఘకాలిక వ్యాధులు, కొవ్వు, అమిత వేడి తగ్గిపోతాయనీ, శరీరానికి మంచి వర్చస్సు కలుగుతుందనీ ఆయుర్వేద నిపుణులు, పెద్దలు చెబుతారు.

- మజ్జిగ తాగడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అధిక దాహం తీరుతుంది. అంతేకాదు, వడ దెబ్బ తగలకుండా ఉంటుంది.
- జీలకర్ర, ధనియాలు, అవిసెగింజలు, సైంధవ లవణం మెత్తగా పొడి చేసుకుని మజ్జిగలో కలుపుకుని తాగితే మంచిది. ఇలా తయారు చేసుకున్న మజ్జిగని లంచ్‌తో లేదా మధ్యాహ్నం 3–4 గంటల సమయంలో తాగడం వల్ల సులువుగా బరువు తగ్గవచ్చు.





- ధనియాలు, జీలకర్ర, శొంఠి ఈ మూడింటినీ 100 గ్రాముల చొప్పున దేనికదే మెత్తగా దంచి, మూడింటినీ కలిపి తగినంత ఉప్పు కూడా చేర్చి, దాన్ని ఒక సీసాలో భద్రపరచుకోండి. ఎండలో తప్పనిసరి అయి బయటకు వెళ్లేటప్పుడు... ఒక గ్లాసు పాలు తీసుకొని, కాచి చల్లార్చి అందులో రెండుగ్లాసుల పుల్లని మజ్జిగ కలపండి.

ఇందులో పంచదార, ఉప్పు బదులుగా పైన చెప్పుకున్న మిశ్రమాన్ని ఒక చెంచా మోతాదులో కలిపి తాగండి, వడదెబ్బ కొట్టదు, పేగులకు బలాన్నిస్తుంది, జీర్ణకోశ వ్యాధులన్నింటికీ ఇది మేలు చేస్తుంది, వేసవిలో కలిగే జలుబుని నివారిస్తుంది,

- సాధ్యమైనంత వరకు మజ్జిగని ఫ్రిజ్‌లో పెట్టకూడదు. అలా పెట్టడం వల్ల ఇందులో ఉండే మేలు చేసే బాక్టీరియా నిరర్థకం అవుతుంది, అదేవిధంగా ప్యాక్ చేసిన మజ్జిగ బదులు అప్పటికప్పుడు తయారు చేసుకున్న తాజా మజ్జిగ తాగడం ప్రయోజనకరం. బయటకు వెళ్లినప్పుడు శీతల పానీయాల బదులు కనీసం ప్యాక్ చేసిన మజ్జిగ తాగినా ఫరవాలేదు.

వేసవిలో విద్యుత్ ఇలా ఆదా..

మార్చి అడుగు పెట్టిందో లేదో వేసవి వచ్చేసింది. సూర్యుడి చురచురలు షురూ అయ్యాయి. ఈ చికాకులను చల్లార్చేందుకు ఫ్యాన్‌లు, కూలర్‌లు, ఏసీలు విధి నిర్వహణలో బిజీగా ఉంటాయి. కరెంటు మీటరు కూడా దాని పని అది చేసుకుపోతుంటుంది. ఈ మూడు నెలలూ వచ్చే బిల్లు చూసి గుండె గుభిల్లుమనకుండా కొన్ని చిట్కాలు పాటించడం వల్ల కరెంటు బిల్లులో కోత పెట్టవచ్చు. అవేంటో చూద్దాం.



- అవసరం లేనప్పుడు లైట్లను, ఇతర విద్యుత్ పరికరాలను స్విచ్ ఆఫ్ చేయడం, పగటి పూట విద్యుత్ వాడకాన్ని నిరోధించడం, గోడలకు, సీలింగ్‌లకు లైట్ కలర్స్ వేయడం వల్ల విద్యుత్ ఆదా అవుతుంది.
- సీలింగ్ ఫ్యాన్‌లకున్న ఎలక్ట్రానిక్ రెగ్యులేటర్ల స్థానంలో కన్వెన్షనల్ రెగ్యులేటర్లను అమర్చాలి.
- ఫ్యాన్, ఏసీని ఆపకుండా తలుపులు మాటి మాటికి తెరుస్తూ మూస్తూ ఉండటం వల్ల బోలెడంత విద్యుత్ వృథా జరుగుతుంది. తలుపులు కిటికీలు మూసేసి ఏసీని కాసేపు ఆన్ చేసి ఉంచాలి. గది చల్లబడ్డ తర్వాత ఏసీ ఆఫ్ చేయాలి. అలాగే ఉపయోగంలో లేనప్పుడు ఎలక్ట్రికల్ పరికరాలను ఆపివేయాలి. దీంతో విద్యుత్తు వృథా చేయకుండా ఉండగలుగుతారు.
- పాత ఫిలమెంట్, సిఎఫ్ఎల్ బల్బ్‌లు చాలా విద్యుత్తును వినియోగిస్తాయి. వాటిని ఎల్‌ఈడీ బల్బులతో భర్తీ చేస్తే విద్యుత్ బిల్లు తగ్గడమే కాకుండా కాంతి కూడా రెట్టింపవుతుంది.
- ఫ్రిజ్, ఎయిర్ కండీషనర్ మొదలైన వాటిని కొనుగోలు చేసేటప్పుడు 5 నక్షత్రాల రేటింగ్ ఉన్న వాటినే కొనుగోలు చేయడం మంచిది. వీటి ప్రారంభ ధర కొంచెం ఎక్కువగా ఉన్నా, విద్యుత్ బిల్లు తక్కువే వస్తుంది.

ఎయిర్ కండీషనర్ ఎల్లప్పుడూ 24 డిగ్రీల ఉష్ణోగ్రత వద్దే నడపాలి. టైమర్ సెట్ చేస్తే గది చల్లగా ఉన్నప్పుడు ఏసీ దానంతట అదే ఆగిపోతుంది.

- ఏసీ/ ఫ్యాన్/కూలర్ లో దుమ్ము పేరుకుని పోయినప్పుడు సరిగా పని చేయక విద్యుత్ వృథా అవుతుంది. అందువల్ల ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం ఉత్తమం.



లైఫ్@360

ఇలా చేస్తే ఇల్లంతా శుభ్రమే!



ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ సోఫా, మ్యాట్రెసెస్, టేబుల్స్, చైర్స్ ఇలా చాలా రకాల ఫర్నీచర్ ఉంటుంది. వీటిని శుభ్రం చేయకపోతే దుమ్ము, ధూళి పేరుకుని పోయి చాలా అపరిశుభ్రంగా కనిపిస్తాయి. అంతేకాదు, వీటివల్ల డస్ట్ అలర్జీ ఉన్న వారికి ఎంతో ఇబ్బంది కలుగుతుంది. వీటిలో దాగి ఉండే సూక్ష్మక్రిముల వల్ల రకరకాల అనారోగ్యాలు వస్తుంటాయి. వీటిని క్లీన్ చేసేందుకు కొన్ని టిప్స్ పాటించాలి. దీనివల్ల ఫర్నీచర్ శుభ్రంగా కనిపించడంతోపాటు ఎక్కువకాలం మన్నుతుంది కూడా. ఫర్నీచర్‌ను శుభ్రం చేసేందుకు ఏం చేయాలో చూద్దాం.

సోఫా: ఆరు టీస్పూన్ల బాత్ సోప్ పౌడర్ తీసుకోండి. ఈ పొడికి కప్పు వేడి నీరు కలపండి. సబ్బు నురగ వచ్చిన తర్వాత దానికి రెండు టీస్పూన్ల అమ్మోనియా లేదా తేనె జోడించండి. ఈ ద్రావణం చల్లబడిన తర్వాత దానిని బాగా కలపండి. దీంతో నురగ వస్తుంది. ఒక క్లాత్ లేదా స్పాంజ్ సహాయంతో ఈ నురగతో సోఫా పై భాగంలో శుభ్రం చేయండి. దీని తరువాత సోఫాను ఫ్యాన్ కింద ఆరనివ్వండి. దీంతో ఫ్యాబ్రిక్ సోఫా కొత్తగా కనిపిస్తుంది.

లెదర్ సోఫా: లెదర్ సోఫాను క్లీన్ చేసే ఏకైక మార్గం మైల్డ్ క్లీనర్‌తో శుభ్రం చేయడమే. ఇందు కోసం ఎప్పుడూ మృదువైన బ్రష్.. వాక్యూమ్ క్లీనర్‌ను ఉపయోగించాలి. శుభ్రం చేయడానికి నీటితో కలిపిన వెనిగర్ ద్రావణాన్ని ఉపయోగించవచ్చు.

డైనింగ్ టేబుళ్లు, చెక్క కుర్చీలు తదితర ఉడెన్ ఫర్నీచర్‌ని తుడిచేందుకు పొడి వస్త్రాన్ని వాడండి. వీటిని మరింతగా మెరిసేలా చేయాలంటే వ్యాక్స్, పాలిష్ కూడా చేయొచ్చు. అదే విధంగా దుమ్ముని క్లీన్ చేయాలంటే డిష్ వాష్‌ని నీటిలో కలిపి అందులో మెత్తటి బట్టను ముంచి బయటికి తీసి పిండి దానితో ఫర్నీచర్‌ని రుద్దాలి. తర్వాత పొడిబట్టతో చక్కగా తుడవండి. ఇలా క్లీన్ అయిన ఫర్నీచర్‌ని పూర్తిగా ఆరబెట్టండి.

కొన్ని వస్తువులు పాత పాలిష్‌తో చూడ్డానికి అంత బాగుండవు. వీటిని క్లీన్ చేయాలంటే.. ముందుగా కొద్దిగా టీ బ్యాగ్స్ తీసుకుని వేడినీటిలో వేసి డికాషన్ చేయాలి. ఇది గోరువెచ్చగా అయ్యే వరకూ ఉంచి గుడ్డపై దీనిని పోస్తూ కొద్దికొద్దిగా తుడవాలి. టీ డికాక్షన్‌లోని యాసిడ్ ఉడ్‌ని క్లీన్ చేస్తుంది.

సీలింగ్ ఫ్యాన్‌లు

సాధారణంగా సీలింగ్ ఫ్యాన్‌లు ఎక్కువ ఎత్తులో అమర్చుతారు. అందువల్ల ముందుగా మీరు టేబుల్ పైకి ఎక్కి ఫ్యాన్‌ను తీసేయండి. ఆ తర్వాత ఫ్యాన్ బ్లేడ్‌ని తీసి విడిగా శుభ్రం చేయండి. రెక్కలను కూడా సబ్బుతో రుద్ది శుభ్రంగా కడిగిన తర్వాత పొడి వస్త్రంతో తుడవాలి.

రెండో విధానం.. పాత పిల్లో కవర్ తీసుకుని టేబుల్ మీద ఎక్కి సీలింగ్ ఫ్యాన్ రెక్కలలో ఒకదానిని కవర్ చేయాలి. ఇప్పుడు కవర్ పైనుంచి చేతులతో రుద్దాలి. అదే విధంగా మూడు రెక్కలను శుభ్రం చేయాలి. రెక్కలపై పేరుకుపోయిన దుమ్ము, ధూళి, బూజు అంతా కవర్ లోపల పడిపోతుంది. తర్వాత దాన్ని పారవేసి పిల్లో కవర్‌ను ఉతుక్కుంటే సరిపోతుంది.



గుర్తుంచుకోవాల్సింది.. ఫ్యాన్‌ను క్లీన్ చేసినప్పుడల్లా కింద ఒక షీట్ లేదా వస్త్రాన్ని పరవాలి. దీంతో ఫ్యాన్ క్లీన్ అయిన తర్వాత మీకు పని పెరగదు. ఫ్యాన్ మురికి షీట్లో పడిపోతుంది.

ఫ్యాన్ శుభ్రం చేసేటప్పుడు కళ్లకి ప్లెయిన్ గ్లాసెస్ లేదా సన్ గ్లాసెస్ ధరిస్తే కంట్లో దుమ్ము పడకుండా ఉంటుంది. అలాగే ముక్కుకు మాస్క్ లేదా రుమాలు కట్టుకోవాలి లేదంటే డస్ట్ అలర్జీ వచ్చే ప్రమాదం ఉంది. ఫ్యాన్‌ని క్లీన్ చేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం మరచిపోవద్దు.

మరకలు దూరమవ్వాలంటే..

కొన్నిసార్లు డైనింగ్ టేబుల్‌పై ఫుడ్ ఐటిమ్స్ మూలాన మరకలు పడుతుంటాయి. వాటిని తొలగించాలంటే... మరకలు పడ్డ చోట కాస్తంత టూత్‌పేస్ట్ అప్లై చేసి దానితో రుద్దాలి. ఆరిన తర్వాత ఒక తడిబట్టతో శుభ్రంగా తుడిచెయ్యండి. మరకలు మొండిగా ఉంటే బేకింగ్ సోడా, టూత్‌పేస్ట్‌లను సమానంగా కలిపి వాటితో రుద్దండి. కాసేపయ్యాక తడిగుడ్డతో తుడిచి ఆరబెట్టండి.

గోడలపై ఇంక్ మరకలు, పెన్ను గీతలు

టేబుల్ స్పూన్ బేకింగ్ సోడాలో కొద్దిగా నీరు కలిపి పేస్ట్‌లా చేయండి. ఈ పేస్ట్‌ని మరకలపై పట్టించి రుద్ది తడిగుడ్డతో తుడిచెయ్యాలి.

దీనికి మరో పద్ధతి ఉంది. అదేంటంటే... గిన్నెలో కాసిన వేడినీళ్లు తీసుకోవాలి. అందులో కొన్ని చుక్కల షాంపూ వేసి బాగా కలపాలి. గోరువెచ్చగా అయిన తర్వాత ఆ నీటిలో ఒక క్లాత్‌ను ముంచి మరకలు పడ్డ చోట రుద్దండి. ఆరిన తర్వాత తడిబట్టతో తుడవండి. మరకలు పలచబడతాయి. కొద్దిరోజుల తర్వాత మరోసారి ఇలాగే చేయాలి. ఇలా ఒకటి రెండుసార్లు చేయడం మంచిది.

ఉడెన్ ఫర్నిచర్: చెక్కతో చేసిన గృహోపకరణాలు పాడు కాకుండా ఉండాలంటే టీ డికాషన్‌లో మెత్తటి క్లాత్‌ను నానబెట్టి పిండి దాంతో తుడవండి. ఇలా చేస్తే రంగు వెలిసిన ఫర్నీచర్‌కు కూడా తిరిగి మెరుపు వస్తుంది.

చెక్కపై నీటి మరకలు దాని అందాన్ని పాడు చేస్తాయి. నీటి మరకలు పడినచోట వైట్ టూత్ పేస్ట్ (జెల్ పేస్ట్ కాదు) రాయండి. తర్వాత మెత్తని బట్టతో రుద్దాలి. అప్పుడు టూత్‌పేస్ట్‌ను తీసివేసి.. తడిబట్టతో తుడిచేయాలి.

చెక్క ఫర్నిచర్‌పై మసి ఉంటే.. టీస్పూన్ బేకింగ్ సోడాను నీటిలో వేసి కరిగించండి. మసి ఉన్న ప్రాంతంపై దీన్ని అప్లై చేయండి. తర్వాత మెత్తని పొడిబట్టతో తుడవండి.

సినిమా

క్రేజీ కాంబినేషన్ సెట్



సందీప్, అల్లు అర్జున్

'పుష్ప'తో పాన్ ఇండియా స్టార్ లిస్ట్‌లో చేరిపోయారు మాస్ హీరో అల్లు అర్జున్. తొలి సినిమా 'అర్జున్ రెడ్డి'తో యూత్‌కి దగ్గర కావడంతో పాటు తనలో మంచి మాస్ డైరెక్టర్ ఉన్న విషయాన్ని నిరూపించుకున్నారు సందీప్ రెడ్డి వంగ. ఒక మాస్ హీరో.. మాస్ డైరెక్టర్ కాంబినేషన్ అంటే కచ్చితంగా క్రేజీ అనే చెప్పాలి. అల్లు అర్జున్ హీరోగా సందీప్ రెడ్డి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా అధికారిక ప్రకటన శుక్రవారం వెల్లడయింది. టీ సిరీస్ ప్రొడక్షన్స్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్స్ పై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. గతంలో పలు సందర్భాల్లో తన తొలి చిత్రం 'అర్జున్ రెడ్డి'లో అల్లు అర్జున్ నటించి ఉండి ఉంటే ప్రభావం బలంగా ఉండి ఉండేదని పేర్కొన్నారు సందీప్. ఇప్పుడు ఈ హీరోతో ఎలాంటి సినిమా ప్లాన్ చేశారో చూడాలి.

మాస్ యాక్షన్ షురూ

గోపీచంద్ కెరీర్‌లో 31వ చిత్రం పూజా కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెరకెక్కించనున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మించనున్నారు. రాధామోహన్ మాట్లాడుతూ – ''మా బేనర్‌లో 14వ చిత్రాన్ని గోపీచంద్, హర్ష కాంబినేషన్‌లో నిర్మించడం ఆనందంగా ఉంది. కన్నడలో పలు బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన హర్ష ఈ భారీ బడ్జెట్ చిత్రంతో తెలుగులోకి అడుగు పెడుతున్నారు. ఇప్పటివరకూ గోపీచంద్ పలు భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లు చేశారు. ఈ చిత్రం వాటికి భిన్నంగా ఉంటుంది. మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న మాసీవ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ నెలలోనే షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: స్వామి .జె.



గోపీచంద్ ఎ. హర్ష

అవార్డు అందనుంది!

గత ఏడాది డిసెంబరులో 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు 'స్పాట్‌లైట్' అవార్డును ప్రకటించింది హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏ). ఈ అవార్డుల ప్రదానోత్సవం ఫిబ్రవరి 25న కాలిఫోర్నియా వేదికగా జరిగింది. ఈ వేడుకకు ఓ ప్రజెంటర్‌గా వెళ్లారు రామ్‌చరణ్. అలాగే ఈ అవార్డుల ప్రదానోత్సవంలో తనకు రావాల్సిన 'హెచ్‌సీఏ' స్పాట్‌లైట్ అవార్డును స్వీకరించారు రామ్ చరణ్. దీంతో 'హెచ్‌సీఏ స్పాట్‌లైట్ అవార్డు కేవలం రామ్‌చరణ్‌కే వచ్చిందా? ఎన్టీఆర్‌కు రాలేదా?' అంటూ సోషల్ మీడియా వేదికగా పలువురు స్పందించారు. ఈ విషయంపై ట్విటర్ వేదికగా 'హెచ్‌సీఏ' ప్రతినిధులు స్పందించారు. ''హెచ్‌సీఏ స్పాట్ లైట్' అవార్డును స్వీకరించేందుకు ఎన్టీఆర్‌కూ ఆహ్వానం పంపాం. అయితే కొత్త సినిమా షూటింగ్ కారణంగా ఆయన హాజరు కాలేదు'' అని హెచ్‌సీఏ ప్రతినిధులు పేర్కొన్నారు. కాగా ఎన్టీఆర్, ఆలియా భట్‌లకు వారి హెచ్‌సీఏ స్పాట్‌లైట్ అవార్డ్స్‌ను వచ్చే వారం అందించనున్నామని 'హెచ్‌సీఏ' ప్రతినిధులు ట్వీట్ చేసి, ఆ అవార్డు ఫోటోలను షేర్ చేశారు. 'హెచ్‌సీఏ' అవార్డుల ప్రదానోత్సవంలో 'బెస్ట్ స్టంట్స్', 'బెస్ట్ యాక్షన్ మూవీ', 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్', 'బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్' విభాగాల్లో 'ఆర్ఆర్ఆర్'కు అవార్డులు వచ్చిన సంగతి తెలిసిందే.



ఎన్టీఆర్

ఆస్కార్‌కి ఆహ్వానం



దీపికా పదుకోన్

బాలీవుడ్ ప్రముఖ నటి దీపికా పదుకోన్‌కు ఆస్కార్ అవార్డు కమిటీ నుంచి ఆహ్వానం అందింది. మార్చి 12న (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13) లాస్ ఏంజిల్స్‌లో ఆస్కార్ వేదికపై మెరవనున్నారామె. జిమ్మీ కెమ్మెల్ హోస్ట్‌గా జరగనున్న 95వ ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో ఓ ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు దీపికా పదుకోన్. ఆస్కార్ అవార్డు ప్రదానోత్సవ తొలి దశ ప్రెజెంటర్స్ 16 మంది జాబితాను నిర్వాహకులు ప్రకటించారు. రిజ్ అహ్మద్, ఎమిలీ బ్లంట్, మైఖేల్ బి జోర్డాన్, గ్లెన్ క్లోజ్, శ్యాముల్ ఎల్. జాక్సన్, డ్వేన్ జాన్సన్, జోయ్ సాల్డానా, జెన్నిఫర్ కొన్నెల్లీ తదితర హాలీవుడ్ తారలు ఉన్న ఈ జాబితాలో దీపికా పదుకోన్ ఉన్నారు. ఇక 2017లో జరిగిన ఆస్కార్ ఆఫ్టర్ పార్టీ (అవార్డుల ప్రదానోత్సవం తర్వాత జరిగే పార్టీ)లో పాల్గొన్న దీపికా ఈసారి ఓ ప్రెజెంటర్‌గా ఈవెంట్‌కు వెళ్తుండటం విశేషంగా చెప్పుకోవచ్చు. అలాగే ప్రెజెంటర్స్ మలి జాబితాలోనూ ఇండియన్ స్టార్స్ ఉంటారా? అనే విషయం తెలియాలంటే కొంత సమయం వేచి ఉండాలి. ఇక 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో అవార్డు కోసం 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాట నామినేట్ అయిన సంగతి తెలిసిందే. ఆస్కార్ వేదికపై లైవ్‌లో ఈ పాట పాడనున్నారు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్. కీరవాణి స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా ప్రేమ్‌రక్షిత్ కొరియోగ్రఫీ చేశారు.

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' గత ఏడాది మార్చిలో విడుదలైన సంగతి తెలిసిందే.

మొదలైన ఓటింగ్

ఆస్కార్ అవార్డు విజేతలకు సంబంధించిన ఆన్‌లైన్ ఓటింగ్ గురువారం ఆరంభమైంది. ఈ ఓటింగ్ మార్చి 7 వరకు జరుగుతుంది. ఆస్కార్ అకాడమీలో పదివేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. వీరందరూ ఆన్‌లైన్‌లో ఓటింగ్ వేస్తారు. ఓటర్స్‌లో ఉన్న యాక్టర్స్ 'యాక్టింగ్' విభాగానికి, ఎడిటర్స్ 'ఎడిటింగ్' విభాగానికి.. ఇలా ఇతర విభాగాలకు చెందినవారు ఆ విభాగానికి ఓట్లు వేస్తారు. కానీ 'ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్', 'యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్' విభాగాల ఓటింగ్‌కు మాత్రం ప్రత్యేక నియమ నిబంధనలున్నాయి. అలాగే బెస్ట్ పిక్చర్స్ విభాగానికి ఆస్కార్ ఓటర్స్ అందరూ ఓటు వేయొచ్చు. ఓటింగ్ పూర్తయ్యాక ఆ ఫలితాలు ప్రైస్‌వాటర్ హౌస్‌కూపర్స్ సంస్థ వద్దే ఉంటాయి. అవార్డులను అధికారికంగా ప్రకటించడానికి ముందు ప్రైస్ వాటర్‌హౌస్‌కూపర్స్ (ఆస్కార్ ఆన్‌లైన్ ఓటింగ్ రిజల్ట్స్ సెక్యూరిటీని చూసేవారు)కు చెందిన ఇద్దరు వ్యక్తులకు మాత్రమే విజేతలు ఎవరో తెలుస్తుందని అవార్డు కమిటీ పేర్కొంది.

బెస్ట్ పిక్చర్ ఓటింగ్ ఇలా..

బెస్ట్ పిక్చర్ విభాగంలో నామినేషన్ దక్కించుకున్న చిత్రాలకు ఆస్కార్ ఓటర్లు 1, 2, 3.. అంటూ ర్యాంకింగ్‌లు ఇస్తారు. ఓటర్లందరూ ర్యాంకింగ్‌లు ఇచ్చిన తర్వాత ఏ చిత్రం యాభైశాతం ఓటర్ల ఫేవరెట్‌గా నిలుస్తుందో అదే బెస్ట్ పిక్చర్‌గా నిలుస్తుంది.

'ఆర్ఆర్ఆర్'కు స్టాండింగ్ ఒవేషన్

ఆస్కార్ ప్రమోషన్స్‌లో భాగంగా 'ఆర్ఆర్ఆర్' టీమ్‌లో హీరో రామ్‌చరణ్ (మరో హీరో ఎన్టీఆర్ సోమవారం అమెరికా వెళ్తారని తెలిసింది), దర్శకుడు రాజమౌళి, సంగీత దర్శకుడు కీరవాణి, సినిమాటోగ్రాఫర్ సెంథిల్‌కుమార్ అమెరికాలో ఉన్నారు. అమెరికాలో 'ఆర్ఆర్ఆర్'ను ఈ నెల 3న రీ రిలీజ్ చేశారు. ఇందులో భాగంగా లాస్ ఏంజిల్స్‌లోని ప్రముఖ ఏస్ హోటల్ థియేటర్‌లో 'ఆర్ఆర్ఆర్'ను ప్రదర్శించారు. షో పూర్తయ్యాక 'ఆర్ఆర్ఆర్'కు స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ – ''ఓ నటుడిగా ఈ క్షణాలను ఎంతగానో ఆస్వాదిస్తున్నాను. ఎంత కష్టపడైనా సరే ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలన్నదే నా లక్ష్యం. రాజమౌళిగారితో పని చేస్తే సినిమాల పట్ల నాలెడ్జ్ ఇంకా పెరుగుతుంది. ఆయన నాకు ప్రిన్సిపాల్, గురువు లాంటివారు. 'ఆర్ఆర్ఆర్'తో తారక్ (ఎన్టీఆర్) నాకు ఇంకా ఇంకా దగ్గరయ్యాడు'' అన్నారు.



సెంథిల్, కీరవాణి, రాజమౌళి, రామ్‌చరణ్

చమ్కీలా అంగీలేసి..

నాని, కీర్తీ సురేష్ జంటగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మించిన చిత్రం 'దసరా'. ఈ చిత్రంలోని 'చమ్కీలా అంగీలేసి..' అంటూ సాగే మూడో పాటను ఈ 8న రిలీజ్ చేయనున్నారు. శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''పెళ్లిళ్ల సీజన్‌లో పాడుకునే జానపద పాట ఇది. సంతోష్ నారాయణన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఈ నెల 30న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 'దసరా'ని రిలీజ్ చేయ నున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



నాని, కీర్తీ సురేష్

యాంటీ లవ్‌స్టోరీ

రామ్ కార్తీక్, ప్రిష జంటగా డీవీకే నాగేశ్వరరావు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఔను.. నేనింతే'. యంఏ సత్తార్ సమర్పణలో జీవీ చౌదరి, నాగరాజు చిర్రా నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సీన్‌కి నటులు అనీష్ కెమెరా స్విచ్చాన్ చేయగా, పృథ్వీ క్లాప్ కొట్టారు. యంఏ సత్తార్ గౌరవ దర్శకత్వం వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ– ''ఇదొక యాంటీ లవ్‌స్టోరీ. రివర్స్ స్క్రీన్ ప్లేతో రాసుకున్న కథ. తల్లితండ్రులు తమ పిల్లలతో కలసి చూసేలా ఉంటుంది'' అన్నారు. ''ప్రతి ఒక్కర్నీ ఆలోచింపజేసేలా మా చిత్రం ఉంటుంది'' అన్నారు జీవీ చౌదరి, నాగరాజు చిర్రా.



ప్రిష, రామ్ కార్తీక్

తెలుగు తెరకు ప్రపంచ సుందరి



మానుషి

మాజీ మిస్ వరల్డ్ మానుషీ చిల్లర్ తెలుగు తెరకు పరిచయం కానున్నారు. 2017లో 'ప్రపంచ సుందరి' కిరీటం దక్కించుకున్న ఈ నార్త్ బ్యూటీ హిందీలో 'సామ్రాట్ పృథ్వీరాజ్' చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అయ్యారు. ఇప్పుడు వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతున్న చిత్రం ద్వారా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రంలో మానుషీని కథానాయికగా తీసుకున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రం ద్వారా యాడ్ ఫిల్మ్‌మేకర్, సినిమాటోగ్రాఫర్ శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ''యథార్థ ఘటనల ప్రేరణతో రూపొందిస్తున్న యాక్షన్ డ్రామా ఇది. ఇందులో వరుణ్ తేజ్ భారతీయ వైమానిక దళ పైలట్‌గా, రాడార్ ఆఫీసర్‌గా మానుషి చేస్తున్నారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ చిత్రంలో వైమానిక దళం ఎదుర్కొనే సవాళ్లను చూపిస్తున్నాం. శుక్రవారం షూటింగ్ ఆరంభించాం'' అని చిత్రబృందం పేర్కొంది. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినై సన్స్ పిక్చర్స్ సంస్థలపై సందీప్ ముద్ద నిర్మిస్తున్న ఈ చిత్రానికి సహనిర్మాత: నందకుమార్ అబ్బినేని.

సాక్షి బిజినెస్
శనివారం
4-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
900	272
59,809	17,594

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,617	▲ 154
డోజోన్స్	33,245	▲ 241
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,947	▲ 3
డాక్స్	15,578	▲ 251
షాంఘై	3,328	▲ 18
నికాయ్	27,927	▲ 429

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	56,103 ▲	16
బంగారం (22 క్యారట్)	55,878 ▲	15
వెండి (కిలో)	64,139 ▲	433

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	81.59	83.26
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	96.96	100.27
€	యూరో	ఒకటికి	85.86	88.94
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	59.36	61.26
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	54.45	56.80
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	60.21	62.15
SAR	సౌదీ రియాల్	ఒకటికి	20.86	22.53
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటికి	21.42	23.21
¥	చైనా యువాన్	ఒకటికి	10.75	12.82

ఏఐ సునామీని హెచ్‌ఆర్ గుర్తించింది

టెక్‌ఫైండర్ గ్లోబల్ డైరెక్టర్ పాల్



సదస్సులో పాల్గొన్న పాల్ గై (మధ్య) తదితరులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) ప్రకారం భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిశ్రమ 20.2 శాతం వార్షిక వృద్ధితో 2025 నాటికి 7.8 బిలియన్ డాలర్లుగా నిలుస్తుందని అంచనా. ఈ సునామీ మార్పును మానవ వనరుల విభాగాలు గుర్తించాయని అంతర్జాతీయ రిక్రూట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ టెక్‌ఫైండర్ గ్లోబల్ మార్కెటింగ్ డైరెక్టర్ పాల్ గై అన్నారు. హెచ్‌ఆర్ సవాళ్లను అధిగమించడంపై హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. 'హెచ్‌ఆర్ రంగంలో ఏఐ అప్లికేషన్లు అమితాదరణ పొందుతున్నాయి. ప్రతిభావంతులను సొంతం చేసుకోవడమనేది సాంకేతికాధారిత హెచ్ఆర్ కార్యక్రమంగా మారింది. వ్యాపారాలలో ఏఐ వినియోగం పెరుగుతోందనడానికి ఇదే నిదర్శనం' అని చెప్పారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం, అనిశ్చితి, నియామకాలలో మందగమనం, తగిన నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతులను ఆకర్షించడంలో పోటీ వంటివి హెచ్‌ఆర్ నిపుణులు ఎదుర్కొంటున్న కొన్ని సాధారణ సమస్యలని సదస్సు అభిప్రాయపడింది.

మోల్డ్‌టెక్ బోర్డులోకి ప్రసాద్ రాజు

MOLD-TEK Technologies Limited

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ సర్వీసెస్ కంపెనీ మోల్డ్‌టెక్ టెక్నాలజీస్ డైరెక్టర్ల బోర్డులోకి కోసూరి ప్రసాద్ రాజు చేరారు. ప్రస్తుతం కంపెనీ యూఎస్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. మోల్డ్‌టెక్ టెక్నాలజీస్‌లో ప్రసాద్ రాజు తొలి ఉద్యోగి కావడం విశేషం. రెండు దశాబ్దాలుగా ప్లానింగ్, ప్రొడక్షన్ బాధ్యతలతోపాటు యూఎస్‌ఏ మార్కెటింగ్, న్యూ బిజినెస్ డెవలప్‌మెంట్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ఆయన కృషి, దూరదృష్టి, అంకితభావం మోల్డ్‌టెక్ టెక్నాలజీస్‌ను ఉన్నత దిశలోకి నడిపిస్తాయని కంపెనీ సీఎండీ జె.లక్ష్మణ రావు పేర్కొన్నారు.

భారత్ 'సేవలు' భేష్...

- ఫిబ్రవరిలో 12 ఏళ్ల గరిష్టం
- 59.4 వద్ద పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం ఫిబ్రవరిలో చక్కటి పనితీరు ప్రదర్శించింది. దేశ ఎకానమీలో మెజారిటీ వెయిటేజ్ ఉన్న ఈ రంగానికి సంబంధించి ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 59.4 వద్ద ముగిసింది. గత 12 ఏళ్లలో ఈ స్థాయి పురోగతి ఇదే తొలిసారి. దేశంలో డిమాండ్ పరిస్థితులు, కొత్త వ్యాపారాలు ఊపందుకోవడం వంటి అంశాలు దీనికి కారణమని గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. సూచీ జనవరిలో 57.2 వద్ద ఉంది. అయితే ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆలోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన చూస్తే, సేవల రంగం వరుసగా 19 నెలల నుంచి వృద్ధిలోనే కొనసాగుతోంది. కాగా, ఉపాధి అవకాశాల పరిస్థితులు మాత్రం ఇంకా మందగమనంలోనే ఉన్నట్లు డీ లిమా తెలిపారు.

సేవలు–తయారీ కలిపినా... పురోగతి!

తయారీ, సేవల రంగం కలిపిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ కూడా ఫిబ్రవరిలో పటిష్ట స్థాయిలో 59 వద్దకు చేరింది. జనవరిలో సూచీ 57.5 వద్ద ఉంది. ఇది 11 ఏళ్ల గరిష్టం. ఒక్క తయారీ రంగాన్ని చూస్తే మాత్రం సూచీ ఫిబ్రవరిలో 55.3 వద్ద ఉంది. జనవరికన్నా (55.4) సూచీ స్వల్పంగా వెనుకబడింది.

ఫిషింగ్ కట్టడికి తాన్లా పరిష్కారం

- సైబర్ మోసాలకు ఇక చెక్
- వీఐ నెట్‌వర్క్‌లో పరీక్షలు
- కంపెనీ ఫౌండర్ ఉదయ్ రెడ్డి



బార్సిలోనా: ఈ–మెయిల్స్, మొబైల్‌కు సైబర్ నేరగాళ్లు పంపే లింక్స్‌ను ఓపెన్ చేసి డబ్బులు పోగొట్టుకుంటున్న ఘటనలు రోజూ చూస్తున్నాం. ఇలాంటి ఫిషింగ్ సందేశాలు సబ్‌స్క్రైబర్లకు చేరకుండా నిరోధించే టెక్నాలజీని క్లౌడ్ కమ్యూనికేషన్స్ సేవల్లో ఉన్న హైదరాబాద్ కంపెనీ తాన్లా ప్లాట్‌ఫామ్స్ అభివృద్ధి చేసింది. ప్రస్తుతం వొడాఫోన్ ఐడియా నెట్‌వర్క్‌లో పరీక్షలు జరుగుతున్నాయి. బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్–2023 సందర్భంగా ఈ సాంకేతికతను ట్రాయ్ చైర్మన్ పి.డి.వాఘేలా చేతుల మీదుగా ఆవిష్కరించారు. 'యాంటీ–ఫిషింగ్‌కు పరిష్కారాన్ని భారత్‌లో అభివృద్ధి చేశాం. సమస్య ప్రపంచవ్యాప్తంగా ఉంది. తాన్లా యాంటీ–ఫిషింగ్ ప్లాట్‌ఫామ్ ఒక నిమిషంలో మోసాన్ని గుర్తిస్తుంది. ఈ సాంకేతికత కోసం అంతర్జాతీయంగా ఆసక్తి కనబరుస్తున్నారు' అని తాన్లా ప్లాట్‌ఫామ్స్ ఫౌండర్, చైర్మన్, సీఈవో డి.ఉదయ్ రెడ్డి తెలిపారు. మోసగాళ్లను ఏరివేయడానికి నియంత్రణ సంస్థలకు ఇది సాయపడుతుందని అన్నారు. వాయిస్ కాల్ ఆధారిత మోసాలకు చెక్ పెట్టేందుకు సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. దీనిని వచ్చే రెండు త్రైమాసికాల్లో అందుబాటులోకి తెస్తామన్నారు.

30 కోట్ల మందికి ముప్పు..

భారత్‌లో కంపెనీ అంచనాల ప్రకారం దాదాపు 30 కోట్ల మంది ఫిషింగ్ దాడులకు గురయ్యే అవకాశం ఉందని ఉదయ్ రెడ్డి వెల్లడించారు. 'వీరిలో 5 లక్షల మంది మోసపోయే చాన్స్ ఉంది. బాధితుల్లో 7% మంది మాత్రమే వివిధ కారణాల వల్ల నేరం గురించి ఫిర్యాదు చేస్తున్నారు. ఫేక్ ఎలక్ట్రిసిటీ బిల్ అలర్ట్, నో యువర్ కస్టమర్ వెరిఫికేషన్ వంటి 10–11 పద్ధతుల్లో ఫిషింగ్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సిమ్, యాప్స్‌ను మోసగాళ్లు వేదికగా చేసుకుంటున్నారు. స్కామ్ సందేశాలు వినియోగదారులకు చేరకుండా చూసుకోవాలి. ఇందుకోసం ఈ టెక్నాలజీని మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లతో మాత్రమే కాకుండా గూగుల్, వాట్సాప్ వంటి ప్లాట్‌ఫామ్స్‌తో కూడా అనుసంధానించాం. ఫిషింగ్ సైట్స్‌ను నిరోధించే కొన్ని సర్వీస్ ఏజెన్సీలతో కూడా భాగస్వామ్యం చేసుకున్నాం' అని వివరించారు.

వారాంతాన బుల్ రంకెలు

- కలిసొచ్చిన జాతీయ, అంతర్జాతీయ సంకేతాలు
- అన్ని రంగాల షేర్లకు డిమాండ్
- నాలుగువారాల్లో అతిపెద్ద లాభం
- సెన్సెక్స్ 900 పాయింట్లు ప్లస్
- నిఫ్టీకి 272 పాయింట్ల లాభం



ముంబై: దలాల్ స్ట్రీట్‌లో వారాంతాన బుల్ రంకెలు వేసింది. జాతీయ, అంతర్జాతీయ సానుకూల సంకేతాల అండతో శుక్రవారం స్టాక్ సూచీలు లాభాల జోరు కనబరిచాయి. ముఖ్యంగా అధిక వెయిటేజీ, కీలక రంగాలైన బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో షార్ట్ కవరింగ్ చోటు చేసుకుంది. ఇటీవల మార్కెట్ పతనంతో కనిష్టాలకు దిగివచ్చిన స్టాక్‌లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఫలితంగా సూచీలు నెల రోజుల్లో అతిపెద్ద లాభాన్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 900 పాయింట్లు బలపడి 59,809 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 272 పాయింట్లు పెరిగి 17,594 వద్ద నిలిచింది. చిన్న, మధ్య తరహా షేర్లకు మోస్తారు స్థాయిలో రాణించడంతో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు అర శాతానికిపైగా లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.246 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,090 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ సేవారంగం పుంజుకోవడం, ఎఫ్ఐఐల రెండోరోజూ కొనుగోళ్లతో డాలర్ మారకంలో రూపాయి విలువ 63 పైసలు బలపడి నెల గరిష్టం 81.97 వద్ద స్థిరపడింది. అమెరికా మార్కెట్లు గురువారం ఒకశాతం బలపడ్డాయి. ఆసియా, యూరప్ సూచీలు ఒకటిన్నర శాతం ర్యాలీ చేశాయి. యూఎస్ స్టాక్ ఫ్యూచర్లు అరశాతం లాభంతో ట్రేడయ్యాయి.

రోజంతా లాభాలే...

ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్ ఉదయం లాభంతో మొదలైంది. సెన్సెక్స్ 332 పాయింట్లు పెరిగి 59,241 వద్ద, నిఫ్టీ 129 పాయింట్లు బలపడి 17,451 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రోజంతా లాభాల్లోనే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,058 పాయింట్లు దూసుకెళ్లి 59,967 వద్ద, నిఫ్టీ 323 పాయింట్లు ఎగసి 17,645 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి.

లాభాలు ఎందుకంటే..: అంతర్జాతీయ ఇన్వెస్టర్ జీక్యూజీ పార్ట్నర్ అదానీ గ్రూప్‌నకు చెందిన 2 బిలియన్ డాలర్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేయడంతో మార్కెట్ వర్గాలకు కొంత ఊరట లభించింది. జీక్యూజీ ఒప్పందంతో సమకూరిన నిధులను రుణాల చెల్లింపునకు వినియోగిస్తామని అదానీ గ్రూప్ తెలపడంతో ఎక్స్‌పోజర్ ఉన్న బ్యాంకింగ్ భారీగా ర్యాలీ చేశాయి. ఫిబ్రవరి సేవల రంగం 12 ఏళ్లలోనే బలమైన వృద్ధిని నమోదుచేసింది. డాలర్ మారకంలో రూపాయి విలువ నెల గరిష్టానికి చేరుకోవడం, విదేశీ ఇన్వెస్టర్లు వరుసగా రెండోరోజూ కొనుగోళ్ల చేపట్టడం కూడా కలిసొచ్చాయి. వచ్చే ద్రవ్య పాలసీ సమావేశం నుంచి ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు 25 బేసిస్ పాయింట్లు మాత్రమే ఉండొచ్చని, అలాగే ఈ ఏడాది ద్వితీయార్థం నుంచి రేట్ల పెంపు సైకిల్ అగిపోవచ్చంటూ అట్లాంటా ఫెడరల్ రిజర్వ్ ప్రెసిడెంట్ రాఫెల్ బోస్టిక్ వ్యాఖ్యలు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి.

మార్కెట్‌లో మరిన్ని విశేషాలు..

- ఇన్వెస్టర్లు, నియంత్రణ సంస్థల్లో విశ్వాసాన్ని నింపేందుకు అదానీ గ్రూప్ చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలనిస్తున్నాయి. తాజాగా జీక్యూజీ పార్ట్‌నర్స్ రూ.15,446 కోట్ల కొనుగోలు ఒప్పందంతో శుక్రవారం ఈ గ్రూప్‌లో మొత్తం పది షేర్లూ లాభపడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ అత్యధికంగా 17% దూసుకెళ్లింది. అదానీ పోర్ట్స్ 10%, అంబుజా సిమెంట్స్ 6%, ఏసీసీ, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్, అదానీ టోటల్, అదానీ పవర్, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ షేర్లు 5% చొప్పున లాభపడ్డాయి. గత 3 ట్రేడింగ్ సెషన్లలో ఈ గ్రూప్‌లో రూ.1.42 కోట్ల సంపద సృష్టి జరిగింది.
- సెన్సెక్స్ ఒకటిన్నర శాతం ర్యాలీ చేయడంతో బీఎస్ఈలో రూ. 3.43 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ. 263 లక్షల కోట్లకు చేరింది. ఇదే సూచీలో 30 షేర్లలో టెక్ మహీంద్రా (2%), అల్ట్రాటెక్ (1%), ఏషియన్ పేయింట్స్ (0.19%), నెస్లే లిమిటెడ్ (0.17%) మాత్రమే నష్టపోయాయి.
- ఆటోమోటివ్ విడిభాగాల కంపెనీ డివ్‌జీ టార్క్‌ట్రాన్స్‌ఫర్ సిస్టమ్స్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు నాటికి 5.44 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 38.41 లక్షల షేర్లను జారీ చేయగా 2.08 కోట్ల షేర్లకు బిడ్లు ధాఖలయ్యాయి.

గ్రీన్‌కో రూ. 5,700 కోట్ల నిధుల సమీకరణ



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో ఉన్న హైదరాబాద్ కంపెనీ గ్రీన్‌కో రూ.5,700 కోట్ల నిధులను సమీకరించింది. సింగపూర్‌కు చెందిన జీఐసీ, జపాన్ కంపెనీ ఓరిక్స్ కార్పొరేషన్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీతోపాటు (ఏడీఐఏ) సంస్థ వ్యవస్థాపకులు అనిల్ చలమలశెట్టి, మహేశ్ కొల్లి ఈ మొత్తాన్ని సమకూర్చినట్టు కంపెనీ శుక్రవారం ప్రకటించింది. ఈ ఈక్విటీ నిధులను 25 గిగావాట్ అవర్ కంటే అధిక నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉండే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ఉపయోగిస్తామని గ్రీన్‌కో గ్రూప్ జేఎండీ మహేశ్ కొల్లి వెల్లడించారు. తాజాగా అందుకున్న పెట్టుబడిలో జీఐసీ 51 శాతం, ఓరిక్స్ 16, ఏడీఐఏ 14, వ్యవస్థాపకులు 13 శాతం సమకూర్చినట్టు తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో ప్రముఖ సంస్థల్లో ఒకటైన గ్రీన్‌కో గ్రూప్ ఖాతాలో భారత్‌లో 15 రాష్ట్రాల్లో 7.5 గిగావాట్ల సామర్థ్యం గల సౌర, పవన, జల విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి.

సాక్షి స్పోర్ట్స్



ప్రిక్వార్టర్ ఫైనల్లో మనిక ఓటమి

గోవాలో జరుగుతున్న ప్రపంచ టేబుల్ టెన్నిస్ కంటెండర్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు మనిక బత్రా, సుతీర్థ ముఖర్జీ ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించారు. 34వ ర్యాంకర్ మనిక బత్రా 6-11, 3-11, 11-9, 7-11తో 20వ ర్యాంకర్ కియాన్ తియాని (చైనా) చేతిలో... సుతీర్థ 5-11, 7-11, 5-11తో ఫు యు (పోర్చుగల్) చేతిలో ఓడిపోయారు.

జేసన్ రాయ్ సెంచరీ: ఇంగ్లండ్‌దే సిరీస్

బంగ్లాదేశ్‌తో శుక్రవారం మిర్పూర్‌లో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లండ్ 132 పరుగుల తేడాతో గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. జేసన్ రాయ్ (132; 18 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించడంతో తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 326 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ 44.4 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది.



ఆనందం ఆస్ట్రేలియాదే...

- మూడో టెస్టులో భారత్‌పై విజయం
- డబ్ల్యూటీసీ ఫైనల్‌కూ అర్హత
- 18.5 ఓవర్లలోనే ముగిసిన లాంఛనం
- 9 నుంచి అహ్మదాబాద్‌లో చివరి టెస్టు

ఆస్ట్రేలియా ముందు అతిస్వల్ప విజయలక్ష్యం... అయినా సరే గత టెస్టులో 18 పరుగుల వ్యవధిలో 7 వికెట్లు, ఈ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 11 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు తీసిన తీరును బట్టి భారత శిబిరంలో ఏదో ఒక మూల కాస్త ఆశ, నమ్మకం... అందుకు తగినట్లుగానే ఇన్నింగ్స్ రెండో బంతికే వికెట్ కూడా దక్కింది. అయితే ఆపై ఆసీస్ ఎక్కడా తడబడలేదు. హెడ్, లబుషేన్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తూ పోయారు. డిఫెన్స్ ఆడి ఉత్కంఠ పెంచకుండా ఓవర్‌కు 4.14 రన్ రేట్‌తో పరుగులు చేస్తూ మ్యాచ్‌ను వేగంగా ముగించేశారు. ప్రత్యర్థిని స్పిన్ గోతిలో పడేయబోయిన భారత్ చివరకు అదే వ్యూహానికి చిక్కి మ్యాచ్‌ను చేజార్చుకుంది. రెండు టెస్టులు ఓడి నిస్సహాయంగా కనిపించిన ఆస్ట్రేలియా ఒక్కసారిగా పుంజుకొని చెప్పుకోదగ్గ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అధికారికంగా ఆస్ట్రేలియా అర్హత సాధించింది. భారత్ కూడా ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే చివరిదైన నాలుగో టెస్ట్‌లో ఆసీస్‌పై గెలవాలి. ఒకవేళ మ్యాచ్ 'డ్రా' అయినా, భారత్ ఓడిపోయినా టీమిండియా ఫైనల్ అవకాశాలు న్యూజిలాండ్–శ్రీలంక టెస్ట్ సిరీస్ తుది ఫలితంపై ఆధారపడి ఉంటాయి.



మ్యాచ్ ముగిశాక ఆసీస్ ప్లేయర్లు లబుషేన్, హెడ్‌లను అభినందిస్తున్న జడేజా, కోహ్లి

ఇండోర్: బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. శుక్రవారం ముగిసిన మూడో టెస్ట్‌లో ఆస్ట్రేలియా 9 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. సిరీస్‌లో భారత్ టీమిండియా ఆధిక్యాన్ని 2–1కి తగ్గించింది. 76 పరుగుల లక్ష్యంతో మూడో రోజు బరిలోకి దిగిన ఆసీస్ 18.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 78 పరుగులు చేసింది. ట్రవిస్ హెడ్ (53 బంతుల్లో 49 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), లబుషేన్ (58 బంతుల్లో 28 నాటౌట్; 6 ఫోర్లు) జట్టును గెలిపించారు. నాథన్ లయన్ (11/99) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో చివరి టెస్టు ఈనెల 9 నుంచి అహ్మదాబాద్‌లో జరుగుతుంది.

ప్రత్యర్థిని కుప్పకూల్చేందుకు స్పిన్ తప్ప మరో మార్గం లేదని భావించిన భారత్ మరో ఆలోచన లేకుండా అశ్విన్‌తోనే బౌలింగ్ మొదలు పెట్టింది. దానికి తగిన ఫలితం కూడా అందుకుంది. రెండో బంతికే తడబడిన ఉస్మాన్ ఖాజా (0) కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో టీమిండియా ఆశలు మరింత పెరిగాయి. అయితే హెడ్, లబుషేన్ ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. తొలి 10 ఓవర్లలో ఆసీస్ స్కోరు 13 పరుగులే. ఈ దశలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బంతి సీమ్ దెబ్బ తినడంతో అంపైర్లు బంతిని మార్చాల్సి వచ్చింది. భారత బృందం దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసినా అదే బంతితో బౌలింగ్ చేయక తప్పలేదు. అశ్విన్ ఓవర్లో ఫోర్, సిక్స్ కొట్టి హెడ్ జోరు పెంచగా, జడేజా తర్వాతి ఓవర్లో లబుషేన్ రెండు ఫోర్లు కొట్టాడు. అశ్విన్ మరో ఓవర్లో మళ్లీ రెండు ఫోర్లు రాబట్టి వీరిద్దరు 15 ఓవర్లలో స్కోరును 56/1కు చేర్చారు. డ్రింక్స్ తర్వాత 23 బంతుల్లో 22 పరుగులు రాబట్టి కంగారూలు విజయాన్ని అందుకున్నారు.

స్కోరు వివరాలు: భారత్ తొలి ఇన్నింగ్స్: 109; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 197; భారత్ రెండో ఇన్నింగ్స్: 163; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖాజా (సి) భరత్ (బి) అశ్విన్ 0; హెడ్ (నాటౌట్) 49; లబుషేన్ (నాటౌట్) 28; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (18.5 ఓవర్లలో వికెట్ నష్టానికి) 78. వికెట్ల పతనం:** 1–0. **బౌలింగ్:** అశ్విన్ 9.5–3–44–1, జడేజా 7–1–23–0, ఉమేశ్ 2–0–10–0.

పిచ్ 'నాసిరకం'



మూడో టెస్టుకు ఆతిథ్యమిచ్చిన ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం పిచ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనిని 'నాసిరకం పిచ్'గా గుర్తిస్తూ మూడు డీమెరిట్ పాయింట్లు శిక్షగా విధించింది. మూడో రోజు తొలి సెషన్‌లోపే ఈ టెస్టు ముగిసింది. 'పొడిగా ఉన్న ఈ పిచ్‌పై బంతికి, బ్యాట్‌కు మధ్య సమతుల్యత లోపించింది. మ్యాచ్ ఐదో బంతికే దుమ్ము రేగగా, ఆ తర్వాత పరిస్థితి మరింత దిగజారుతూ వచ్చింది' అని మ్యాచ్ రిఫరీ క్రిస్ బ్రాడ్ నివేదిక ఇచ్చారు.

భారత పురుషుల హాకీ జట్టు చీఫ్ కోచ్‌గా ఫుల్టన్



న్యూఢిల్లీ: భారత పురుషుల హాకీ జట్టుకు కొత్త చీఫ్ కోచ్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన క్రెయిగ్ ఫుల్టన్‌ను నియమిస్తున్నట్లు హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ ప్రకటించారు. 48 ఏళ్ల ఫుల్టన్ దక్షిణాఫ్రికా తరఫున 195 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. 1996 అట్లాంటా ఒలింపిక్స్, 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో దక్షిణాఫ్రికా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. క్రీడాకారుడిగా రిటైర్ యాక కోచింగ్‌వైపు మళ్లిన ఫుల్టన్ 2014 నుంచి 2018 వరకు ఐర్లాండ్ జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించాడు. ఫుల్టన్ శిక్షణలో ఐర్లాండ్ వందేళ్ల తర్వాత 2016 రియో ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. 2015లో ఆయన అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) వార్షిక అవార్డుల్లో ఉత్తమ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఫుల్టన్ బెల్జియం జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా కూడా పని చేశాడు. శిక్షణ బృందంలో ఫుల్టన్ సభ్యుడిగా ఉన్నపుడు బెల్జియం 2021 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, 2018 ప్రపంచకప్‌లో టైటిల్ సాధించింది. గత జనవరిలో స్వదేశంలో జరిగిన ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు తొమ్మిదో స్థానంలో నిలిచింది. టీమిండియా నిరాశాజనక ప్రదర్శన నేపథ్యంలో చీఫ్ కోచ్ గ్రాహమ్ రీడ్ తన పదవికి రాజీనామా చేశాడు.

ఎఫ్1 సీజన్‌కు వేళాయె..



సాఖిర్ (బహ్రెయిన్): ఫార్ములావన్ (ఎఫ్1) 2023 సీజన్‌కు రంగం సిద్ధమైంది. 23 రేసుల ఈ సీజన్‌లో తొలి రేసు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి ఆదివారం జరుగుతుంది. అంతకుముందు శనివారం ప్రధాన రేసుకు సంబంధించిన గ్రిడ్ పొజిషన్స్‌ను తేల్చేందుకు క్వాలిఫయింగ్ సెషన్‌ను నిర్వహిస్తారు. క్వాలిఫయింగ్ సెషన్‌లో అత్యంత వేగంగా ల్యాప్‌ను పూర్తి చేసిన డ్రైవర్ ప్రధాన రేసును 'పోల్ పొజిషన్' హోదాలో తొలి స్థానం నుంచి ప్రారంభిస్తాడు. ఈ సీజన్‌లో కూడా డిఫెండింగ్ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్ జట్టు) తన జోరు కొనసాగించే అవకాశముంది. అతనికి హామిల్టన్ (మెర్సిడెస్), లెక్‌లెర్క్ (ఫెరారీ) నుంచి గట్టిపోటీ ఎదురయ్యే చాన్స్ ఉంది. మొత్తం 10 జట్ల నుంచి 20 మంది డ్రైవర్లు మొత్తం 23 రేసుల్లో పాల్గొంటారు.

మహిళల లీగ్‌కు మోగిన నగారా!

- నేటి నుంచి డబ్ల్యూపీఎల్
- మొదటి మ్యాచ్‌లో ముంబైతో గుజరాత్ జెయింట్స్ 'ఢీ'

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



స్మృతి మంధాన — హర్మన్‌ప్రీత్ — మెగ్ లానింగ్ — బెత్ మూనీ — అలీసా హీలీ

ముంబై: ఎన్నాళ్లుగానో వేచిన క్షణం రానే వచ్చింది... భారత మహిళల క్రికెట్‌లోనూ ఐపీఎల్ లాంటి టోర్నీ ఉండాలని, అమ్మాయిలకు మరిన్ని అవకాశాలు రావాలని ఏళ్లుగా సాగిన చర్చ ఇప్పుడు వాస్తవ రూపం దాలుస్తోంది. అసలు మహిళల లీగ్ ఉంటుందా, ఉండదా, వాణిజ్యపరంగా సఫలం అవుతుందా అనే సందేహాలు... నిర్వహణపై ఏనాడూ స్పష్టత లేని స్థితి... ఇప్పుడు ఇవన్నీ గతం ... ఎట్టకేలకు బీసీసీఐ చొరవతో ఇప్పుడు అన్ని అడ్డంకులను దాటి... అదీ ఐపీఎల్ తరహా యాజమాన్యాల అండతో తొలి మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) సన్నద్ధమైంది. **నేడు రాత్రి గం. 7:30 నుంచి జరిగే తొలి మ్యాచ్‌తో లీగ్‌కు శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ విశేషాలు...**

బరిలో ఉన్న జట్లు (5), కెప్టెన్‌లు: (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు–స్మృతి మంధాన; ముంబై ఇండియన్స్–హర్మన్‌ప్రీత్ కౌర్; ఢిల్లీ క్యాపిటల్స్–మెగ్ లానింగ్; యూపీ వారియర్స్–అలీసా హీలీ; గుజరాత్ జెయింట్స్–బెత్ మూనీ).

వేదికలు: 2 (ముంబైలోనే; బ్రబోర్న్ స్టేడియం, డీవై పాటిల్ స్టేడియం)

మొత్తం మ్యాచ్‌లు: 22 (20 లీగ్ మ్యాచ్‌లతో పాటు ఒక ఎలిమినేటర్, ఫైనల్)

TATA WPL

ఫార్మాట్: ప్రతీ టీమ్ ఇతర నాలుగు జట్లతో రెండేసి మ్యాచ్‌లు (మొత్తం 8) ఆడుతుంది. టాప్‌గా నిలిచిన టీమ్ నేరుగా ఫైనల్‌కు చేరుకుంది. తర్వాతి రెండు టీమ్‌ల మధ్య 'ఎలిమినేటర్' మ్యాచ్ విజేత రెండో ఫైనలిస్ట్ అవుతుంది.

తుది జట్టులో విదేశీ ఆటగాళ్ల సంఖ్య: 4

మ్యాచ్ సమయం: ఐపీఎల్‌లాగే ఒక మ్యాచ్ ఉంటే రాత్రి గం 7:30 నుంచి... రెండు మ్యాచ్‌లు ఉన్న రోజు తొలి మ్యాచ్ గం. 3:30 నుంచి... రెండో మ్యాచ్ రాత్రి గం. 7:30 నుంచి

డీఆర్ఎస్: అందుబాటులో ఉంది. ఒక్కో ఇన్నింగ్స్‌లో జట్టుకు రెండు అవకాశాలు ఉంటాయి.

లీగ్‌లో ఉన్న తెలుగు అమ్మాయిల సంఖ్య: 6 (స్నేహదీప్తి, అంజలి శర్వాణి, సబ్బినేని మేఘన, షబ్నమ్ (ఆంధ్రప్రదేశ్) అరుంధతి రెడ్డి, యషశ్రీ (హైదరాబాద్).

రెస్ట్ ఆఫ్ ఇండియాకు ఆధిక్యం



గ్వాలియర్: రంజీ చాంపియన్ మధ్యప్రదేశ్ జట్టుతో జరుగుతున్న ఇరానీ కప్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఆట మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 112/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ 112.5 ఓవర్లలో 294 పరుగులకు ఆలౌటైంది. యశ్ దూబే (258 బంతుల్లో 109; 16 ఫోర్లు) సెంచరీ సాధించగా, సారాంశ్ జైన్ (150 బంతుల్లో 66; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేశాడు. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో పుల్కిత్ నారంగ్ నాలుగు వికెట్లు తీసుకున్నాడు. 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన రెస్ట్ ఆఫ్ ఇండియా ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 18 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 85 పరుగులు సాధించింది. తమ ఓవరాల్ ఆధిక్యాన్ని 275 పరుగులకు పెంచుకుంది. కెప్టెన్ మయాంక్ డకాట్ కాగా... యశస్వి జైస్వాల్ (58 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్), అభిమన్యు ఈశ్వరన్ (26 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు.


కామారెడ్డి జిల్లా లింగంపేట్‌లోని పురాతన మెట్ల బావి

చారిత్రక బావి.. అభివృద్ధి చర్యలేవి

అయిదంతస్తులు.. వంద అడుగుల లోతు.. కాకతీయుల కాలం నాటి కళాత్మక నిర్మాణమిది. శిథిలమైపోతున్న ఒక పురాతన బావి నేపథ్యమిది. పాలకుల ఆదరణకు నోచక.. శిథిలమైపోతున్న ఈ బావి కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్ర శివారులో ఉంది. సుమారు 18వ శతాబ్దంలో నిర్మితమైన ఈ బావి అడుగు నుంచి పైభాగం వరకు నాలుగు వైపులా ఒకే రకమైన మెట్లు ఉన్నాయి. ఉపరితలం నుంచి 20 అడుగుల వరకు ఒక్కొక్క అంతస్తు చొప్పున అయిదు అంతస్తుల మెట్లు ఉన్నాయి. మెట్ల బావి చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. పునరుద్ధరణ కోసం పురావస్తు శాఖ ముందుకొచ్చినా.. నిధుల కొరత వల్ల ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సికింద్రాబాద్‌లోని బన్సీలాల్ మెట్ల బావి తరహాలోనే.. లింగంపేటలోని పురాతన మెట్ల బావిని బాగు చేయాలని.. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ఇంటర్ విద్యార్థుల కోసం
సైకాలజిస్టులు

- పరీక్షలపై భయం పోగొట్టేందుకు..
- ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15 నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మనోధైర్యాన్ని ఇవ్వడానికి ప్రత్యేకంగా సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులను ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలపై విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టడమే దీని ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. వార్షిక, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. అవసరమైన విద్యార్థులు 14416 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రతి జిల్లా ఆస్పత్రుల్లో ఉచిత మానసిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించినట్టు నవీన్ మిత్తల్ తెలిపారు.

నేటి నుంచి స్టాఫ్‌నర్స్ దరఖాస్తులకు ఎడిట్ ఆప్షన్

సాక్షి, హైదరాబాద్: స్టాఫ్‌నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి ఎడిట్ ఆప్షన్ కల్పించారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి ఈనెల 9 సాయంత్రం 5 గంటల వరకు ఎడిట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. బోర్డు వెబ్‌సైట్ https://mhsrb.telangana.gov.inలో ఎడిట్ అవకాశం అందుబాటులో ఉంటుందన్నారు.

పిల్లలు తక్కువుంటే విలీనమే..!

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మెస్ చార్జీల పెంపునకు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం... విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతిగృహాలను క్రమబద్ధీకరించే అంశాన్ని పరిశీలిస్తోంది. హాస్టళ్ల వారీగా విద్యార్థుల సంఖ్యను సమీక్షించడంతో పాటు సమీపంలో ఉన్న హాస్టళ్లలో సర్దుబాటు చేసే అవకాశాలపై నివేదిక తయారు చేయాలని సంక్షేమ శాఖలను ఆదేశించింది. రెండ్రోజుల క్రితం సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యా సంస్థలతో పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో కొనసాగుతున్న విద్యా సంస్థల్లో డైట్ చార్జీల పెంపుపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్ పాల్గొన్నారు. డైట్ చార్జీలను 25 శాతం పెంచాలని ప్రభుత్వానికి సూచిస్తూ కేబినెట్ సబ్ కమిటీ ప్రతిపాదనలు పంపింది. ఇదే క్రమంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న హాస్టళ్లను సమీపంలోని హాస్టళ్లలో విలీనం చేసి మెరుగైన వసతులు కల్పించే అంశంపైనా చర్చించారు.

> **సంక్షేమ వసతిగృహాల్లో సర్దుబాటు మంత్రం**
> - ఇరవై మంది కంటే తక్కువుంటే సమీప హాస్టల్‌లో విలీనం
> - కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో సమీక్షించిన మంత్రులు
> - ఈ దిశగా ప్రతిపాదనల తయారీకి సంక్షేమ శాఖలకు ఆదేశం
> - డైట్ చార్జీల పెంపుతో సంక్షేమ హాస్టళ్ల పటిష్టతకు చర్యలు

కనీసం 50 మంది విద్యార్థులుంటే..

సగటున ఒక సంక్షేమ హాస్టల్‌లో కనీసం 50 మంది విద్యార్థులుండాలి. దాదాపు వంద మందికి వసతులు కల్పిస్తూ హాస్టల్‌ను అందుబాటులోకి తెచ్చినప్పటికీ... అందులో కనీసం సగం మంది పిల్లలుంటేనే మెరుగైన సర్వీసులు కల్పించవచ్చు. అలాకాకుండా 15 నుంచి 25 మంది విద్యార్థులుంటే ఖజానాపైనా భారం అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న హాస్టళ్లను గుర్తించాలని, అదేవిధంగా వాటిని సమీప హాస్టళ్లలో విలీనం చేసే అంశాలపై పూర్తిస్థాయి నివేదికను జిల్లాల వారీగా రూపొందించాలని మంత్రులు ఆదేశించారు. ఏప్రిల్ నెలాఖరు కల్లా జిల్లాల వారీగా నివేదికలు తయారు చేసి రాష్ట్ర కార్యాలయాలకు పంపించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,550 సంక్షేమ వసతిగృహాలున్నాయి. పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య సంతృప్తికరంగా ఉన్నప్పటికీ చాలాచోట్ల ప్రీమెట్రిక్ హాస్టళ్లలో మాత్రం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. దీంతో కొన్ని జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వ అనుమతితో ప్రీమెట్రిక్ హాస్టళ్లను పోస్టుమెట్రిక్ హాస్టళ్లుగా మార్పు చేశారు. ఇంకా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న వాటిని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రులు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

కొత్తగా 26 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం 5,648 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 26 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి నలుగురు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 118 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన శిబిరాలు

ప్రతి శుక్రవారం నిర్వహించనున్న అగ్నిమాపకశాఖ

సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలి, ప్రమాదవశాత్తు మంటలు అంటుకుంటే ఎలా జాగ్రత్తపడాలన్న అంశాలపై అగ్నిమాపకశాఖ అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపకశాఖ అధికారుల బృందాలు ఈ ప్రత్యేక అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రధానంగా పెట్రోల్ బంక్‌లు, పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమలు, బహిరంగ ప్రదేశాలు, గేటెడ్ కమ్యూనిటీలు తదితర ప్రాంతాల్లో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.